ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
15-6-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 135 పేజీలు: 8+16 వెల: 6.50

ఉమన్స్ టి20 వరల్డ్ కప్‌లో భారత్ తొలి విజయం
స్వర్ణంతో మెరిసిన భారత్ ఆర్చర్లు
ఆటలో

## సింగరేణి నుంచి నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి పెరగాలి

సంస్థ మరింత బలోపేతం కావాలి

కార్మికుల సంక్షేమానికి రూ. 1.25 కోట్ల ప్రమాద బీమా అమలు: డి.సిఎం భట్టి



ఆదివారం శ్రీరాంపూర్‌లోని ఓపెన్‌కాస్ట్ గనులను పరిశీలించిన అనంతరం మీడియాతో డిసిఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు

**నస్పూర్, జూన్ 14, ప్రభాతవార్త:** పోటీ మార్కెట్ పరిస్థితుల్లో సింగరేణి సంస్థ మరింత బలోపేతం కావాలంటే ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాలని, నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం ఆయన సింగరేణిలోనే అతిపెద్దదైన శ్రీరాంపూర్ ఏరియా ఉపరితల గనిని సందర్శించారు. వ్యూ పాయింట్ వద్ద మొక్క నాటిన అనంతరం గని కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఓపెన్ హౌస్ ఇన్‌స్పెక్షన్‌లో రక్షణ పద్ధతులు, బొగ్గు నాణ్యత, నిల్వ, రవాణా లెక్కలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ లాభదాయకత, పోటీతత్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. సింగరేణి సంస్థపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతోనే ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు తమ వ్యక్తిగత, స్వార్థ ప్రయోజనాల కోసమే సంస్థపై అసత్యాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు దేశంలోనే మొట్టమొదటిసారిగా రూ. 1.25 కోట్ల ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్సీ దండే విఠల్, మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్, సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డైరెక్టర్లు ఎల్.వీ. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 'భారత్ ఇన్నోవేట్స్' ప్రపంచానికి ఒక ఆహ్వానం



నైస్‌లో ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌తో ప్రధాని మోడీ

### ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌తో కలిసి పాల్గొన్న ప్రధాని మోడీ

### మేక్ ఇన్ ఇండియాను ఫ్రాన్స్ గౌరవిస్తుంది: మేక్రాన్

### ప్రవాసభారతీయులతో ప్రధాని మోడీ భేటీ

**నైస్ (ఫ్రాన్స్), జూన్ 14:** భారతదేశం ఇకపై ప్రపంచ పరిష్కారాలను కేవలం వినియోగించే దేశం మాత్రమే కాదని, వాటికి ప్రధానంగా దోహదపడే దేశంగా మారిందని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఆవిష్కరణలు, సాంకేతికత ద్వారా ప్రపంచానికి సుస్థిర భవిష్యత్తును అందించాలన్న న్యూఢిల్లీ దార్శనికతను ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఆదివారం మధ్యధరా తీరంలోని ఈ >>2

# రోడ్లపైకి వచ్చి చూస్తా

వర్షాల వేళ అధికారులు, పోలీసులు రోడ్లపైనే ఉండాలి

కోర్ అర్బన్ రీజియన్‌లో మరింత అప్రమత్తం

ట్రాఫిక్ జాం అయితే సహించను

అలసత్వం వహిస్తే అధికారులపై కఠిన చర్యలు

సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు



ఆదివారం హైదరాబాద్‌లో సమీక్షలో మాట్లాడుతున్న సిఎం రేవంత్. చిత్రంలో సిఎస్, డిజిపి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 14:** వర్షాల సమయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన తేల్చిచెప్పారు. అలసత్వంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాకాల సన్నద్ధతపై ఆదివారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పేవిలియన్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, వైద్య ఆరోగ్యశాఖ, పోలీసు శాఖ, వ్యవసాయ శాఖ, వాతావరణ శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. జూన్ 9న కోర్ అర్బన్ రీజియన్‌లో వర్షం కారణంగా ఏర్పడిన పరిస్థితులపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. సైబరాబాద్‌తోపాటు అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్‌జామ్ కావడంతో నగరవాసులు ఇబ్బందులు పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ >>2

## విద్యార్థులకు మన్నికైన యూనిఫాం

### గురుకుల విద్యార్థులకు కిట్ల అందజేత

### జూ. కళాశాల విద్యార్థులకు బ్యాగ్, బెల్టు, టై, బూట్లు, సాక్స్‌లు

### సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్14:** ప్రైవేటు..కార్పొరేట్ స్కూల్ విద్యార్థులు ధరించే మన్నికైన యూనిఫాంలు, వారికి ఏమాత్రం తీసిపోని విధంగా బ్రాండెడ్ షూ, సాక్సులు, టై, బెల్టులు ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బాగాంధీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులకు అందనున్నాయి.. నాణ్యమైన వస్త్రం సరఫరా అయితేనే యూనిఫాంలు ఎక్కువ రోజులు మన్నుతాయి. అందుకే విద్యార్థులకు >>2



## జూలై నుంచి సిఎస్ ఎవరు?

ఈ నెలాఖరులో రామకృష్ణారావు టెర్మ్ పూర్తి

రేసులో సంజయ్, జయేశ్, వికాస్‌రాజ్, శశాంక్, ఘోష్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్14:** జూలై నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎవరు? రామకృష్ణారావును మరోసారి పొడిగిస్తారా? లేక కొత్తవారిని >>7

# బిజెపి కుట్రలో మరొకటి

### 'సర్'తో ఎన్డీయేకు సహకరిస్తున్న ఇసి

### అర్హులను గుర్తించి తిరిగి ఓటరు జాబితాలో చేర్చండి

### పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



**హైదరాబాద్, జూన్ 14,ప్రభావతవార్త:** అప్రజాస్వామిక పద్ధతిలో అధికారం కోసం బిజెపి కుట్రల ఎత్తులు వేస్తోందని ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ హెచ్చరించారు. ఆదివారం గాంధీభవన్ నుంచి సర్‌పై కాంగ్రెస్ జూమ్ మీటింగ్ జరిపారు. ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, డిసిసి అధ్యక్షులు, నియోజక వర్గ ఇంచార్జ్ లు ఇంచార్జ్ లు, మాస్టర్ ట్రైనర్లకు కాంగ్రెస్ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ ఓటర్ మ్యాపింగ్, సర్ జరిగే విధానం.. బిఎల్‌ఏ లు చేయాల్సిన పనులు, బి.ఎల్.ఓ చేస్తున్న పనులపై నిఘా పెట్టాలని కోరారు, ఓటర్ మ్యాపింగ్ లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాయకులకు తగిన సూచనలు చేశారు. మూడు పార్లమెంట్ నియోజక వర్గాలకు ఒక యూనిట్ గా అరగంట చొప్పున 6 జూమ్ మీటింగ్‌లు జరిగాయి. ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో ఎంత శాతం ఓటర్ మ్యాపింగ్ జరిగింది.. మిగతా ఓటర్ మ్యాపింగ్‌లో ఓట్ కోల్పోయిన వారిని గుర్తించి వారికి తిరిగి ఓట్ హక్కు కల్పించే అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ దేశంలో బిజెపి, ఎన్నికల కమిషన్‌లు కలిసి ఓట్ చోరీకి పాల్పడుతున్నాయని అప్రజాస్వామికంగా దేశంలో బిజెపి అధికారంలోకి వస్తుందని విమర్శించారు. సర్ పేరుతో ఓట్ల పరిశీలన చేపట్టి కాంగ్రెస్ పార్టీ కి దేశంలో ప్రతిపక్షాలకు అనుకూలంగా ఉన్న ఓట్లను చోరీ చేసి దొంగ తనంగా రాజకీయాలు చేస్తున్నాయని అన్నారు. తెలంగాణ లో కూడా ఓట్ చోరీ చేసే అవకాశం ఉందని నియోజక వర్గాలలో నాయకులు చాలా అప్రమతంగా ఉండాలని అన్నారు. బిఎల్‌ఏ లు ఓట్ మ్యాపింగ్ ను లోతుగా పరిశీలించి ప్రతి నిజమైన ఓట్‌ను కాపాడాలని సూచించారు. ఓట్ కనుక తొలగిస్తే >>2



హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన కాక్రోచ్ జనతాపార్టీ నిరసన సభలో మాట్లాడుతున్న పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్ చుక్

## ధర్మేంద్ర ప్రధాన్ దిగిపోవాల్సిందే

### కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్

### పరీక్ష పత్రాల లీకేజిపై హైదరాబాద్‌లో భారీ నిరసన

### విద్యార్థుల ఆత్మహత్యలు విచారకరం: సోనమ్ వాంగ్‌చుక్

### హోరెత్తిన విద్యార్థి ప్రభంజనం

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూన్ 14, ప్రభాతవార్త:** పరీక్ష పత్రాల లీకేజీ వివాదాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతాపార్టీ (సిజేపీ) చేపట్టిన నిరసన కార్యక్రమంలో పలువురు నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం నీట్‌లోజరిగిన అవకతవకలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా చేపట్టిన ఉద్యమంలో భాగంగా, ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో సీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈనిరసన కార్యక్రమంకు ప్రముఖ విద్యావేత్త, పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్ చుక్, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కే.నాగేశ్వర్, తెలంగాణ మాజీ విద్యా కమీషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సోనమ్ వాంగ్‌చుక్ >>2

## చీలిన టిఎంసి

### 20 మంది ఎంపీలు ఎన్‌డిఎకు మద్దతు

### త్రిపుర ప్రాంతీయపార్టీ నేషనల్ సిటిజన్స్‌లో చేరిక



**న్యూఢిల్లీ,జూన్ 14:** తృణమూల్ కాంగ్రెస్‌లో రాజకీయ సంక్షోభం మరింత ముదిరింది. లోక్‌సభలో పార్టీకి చెందిన 20 మంది తిరుగుబాటు ఎంపీలు త్రిపురకు చెందిన ప్రాంతీయ పార్టీ అయిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ (ఎన్‌సీపీ)లో విలీనమవుతున్నట్లు ప్రకటించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి విలీనానికి సంబంధించిన లేఖను సమర్పించిన అనంతరం తిరుగుబాటువర్గ నేత కాకోలి ఘోష్ దస్తిదార్ ఈ సమాచారం వెల్లడించారు. తమవర్గానికి తృణమూల్ లోక్‌సభ సభ్యుల్లో మూడింట రెండొంతుల మద్దతు ఉందని ఆమె పేర్కొన్నారు. మేము ఎన్డీయేలో భాగమవుతాం. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ >>2

## మీనాక్షిపై దొంగకేసు పెట్టించిన సిఎం

### సొంత పార్టీ నేతలకే వెన్నుపోటు: కెటిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 14:** తెలంగాణలో రేవంత్ రెడ్డి భూములు, కాంట్రాక్టులు అమ్ముకుంటున్నాడు, అడ్డగోలు అవినీతి చేస్తున్నాడని మీనాక్షినటరాజ్ రాహుల్ గాంధీకిచెప్పినందుకే రేవంత్ పగపట్టారన్నారు. అందుకే మీనాక్షినటరాజన్ మీద రేవంత్ రెడ్డి హైద రాబాదులో దొంగ కేసు పెట్టించారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. రేవంత్ రెడ్డి చేసిన కుట్ర సమాచారం కూడా లేని అమె రాజ్యసభకు నామినేషన్ వేసిందన్నారు. కానీ రేవంత్‌రెడ్డి తాను పెట్టిన దొంగకేసు వివరాలు బిజెపికిచ్చిరని అరోపిం చారు. ఇలా ప్రజలకే కాకుండా సొంత పార్టీ వాళ్లకి గుండు కొట్టి, శఠగోపం పెట్టిన దొంగ రేవంత్ రెడ్డి అని తీవ్ర అరోపణలు చేశారు. ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గ బిఆర్‌ఎస్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి సొంత పార్టీ వాళ్ళనే వెన్నుపోటు పొడిచారన్నారు. కాంగ్రెస్‌లో ఉన్న కొంత మంది వ్యక్తుల్లో మీనాక్షినటరాజన్ నిజాయితీగల >>2




## నేటి నుంచి స్కూళ్లు ఆరంభం

ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ అమలు

3

# 18 నుంచి భారీవర్షాలు

### సంగారెడ్డి కొండాపూర్‌లో 12 సెం.మీ అత్యధిక వర్షపాతం



**హైదరాబాద్, జూన్14, ప్రభాతవార్త:** తెలంగాణలో ఈనెల 18 నుంచి మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతవరణ కేంద్రం తెలిపింది. నైరుతి రుతుపవనాలు తెలంగాణలో జూన్6న ప్రవేశించిన నాటి నుంచి రోజూ వర్షపాతం నమోదవుతూనే ఉంది. గత తొమ్మిది రోజులలో తెలంగాణలో 7 సగటు వర్షపు రోజులు నమోదైనాయి. నాగర్‌కర్నూల్, రంగారెడ్డి జిల్లాలో అతి ఎక్కువ వర్షం కురిసిందని తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ విడుదల చేసిన గణాంకాలు వివరిస్తున్నాయి. నాగర్ కర్నూల్‌లో జూన్ 14వరకు సగటు 4.3సెం.మి వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా సగటు 7.4సెంమి నమైంది. ఇప్పటికే 74శాతం లార్జ్‌ఎకెస్స్ వర్షపాతం కురిసింది. రంగారెడ్డిలో సగటు 4.8సెం.మి సాధరణ వర్షపాతం కురువాల్సి ఉండగా సగటు 7.9సెం.మి కురిసింది. 65శాతం అత్యధిక అతివర్షపాతం నమోదైంది. ఖమ్మం, నారాయణపేట, సంగారెడ్డి, భద్రాద్రికొత్తగూడెం, నల్లగొండ, హైదరాబాద్‌లో అధికవర్షాపాతం నమోదైంది. వనపర్తి, వికరాబాద్, జోగులాంబ గద్వాల సూర్యపేట, మెదక్, మహబూబ్‌నగర్, ములుగులో సాధారణ వర్షపాతం నమోదైంది. కామారెడ్డి, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, జయశంకర్‌భూపాలపల్లి, కరీంనగర్, యాదాద్రి, కుమురం భీం, మేడ్చల్‌మల్కాజిగిరి, మంచిర్యాల, నిజామాబాద్, వరంగల్ జనగామ, ఆదిలాబాద్ జగిత్యాల, మహబూబాబాద్‌పెద్దపల్లి సిద్ధిపేటలో లోటు వర్షపాతం నమోదైంది. అతి తక్కువ వర్షపాతం హనుమకొండ జిల్లాలో నమోదైంది. ఈ జిల్లాలో జూన్ 14 వరకు సగటు 5.8సెం.మి వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా సగటు 1.5సెం.మి వర్షం >>2



ఆదివారం న్యూఢిల్లీలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు మద్దతు లేఖను అందజేస్తున్న టిఎంసి తిరుగుబాటు ఎంపీలు

# చీలిన టిఎంసి

>> నాయకత్వంలో పనిచేస్తాం. పార్లమెంట్‌లో ప్రత్యేకంగా కూర్చుంటామని ఆమె తెలిపారు. ఈ పరిణామంతో లోక్‌సభలో 28 మంది సభ్యులు ఉన్న తృణమూల్ కాంగ్రెస్‌కు గట్టి దెబ్బ తగిలింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు ప్రతిపక్ష బలం కూడా గణనీయంగా తగ్గనున్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

**చట్టపరమైన ఇబ్బందులు తప్పించేందుకే నిర్ణయం**

ప్రత్యేక వర్గంగా ఏర్పడితే ఎదురయ్యే చట్టపరమైన సమస్యలను నివారించేందుకే ఎన్‌సీపీలో విలీనమయ్యే నిర్ణయం తీసుకున్నట్లు వర్గాల సమాచారం. తృణమూల్ సీనియర్ నేత సుదీప్ బంద్యోపాధ్యాయ్ మాట్లాడుతూ, "మేము నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీలో విలీనమవుతున్నాం. ఇది ఒక ప్రాంతీయ పార్టీ అని చెప్పారు. పార్టీలో మూడింట రెండొంతుల మెజారిటీతో బయటకు వచ్చిన వెంటనే అదే పార్టీ పేరుపై హక్కు కోరలేం. జూలైలో తృణమూల్ పేరును మాకు కేటాయించాలని కోరతామన్నారు. ఆ విషయంలో తుదినిర్ణయం కోర్టే తీసుకుంటుందని వివరించారు.

**తిరుగుబాటు ఎంపీలపై తృణమూల్ ఆగ్రహం**

తిరుగుబాటు వర్గంపై తృణమూల్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ సీనియర్ నేత మదన్ మిత్రా మాట్లాడుతూ, మమతా బెనర్జీ నాయకత్వాన్ని బలోపేతం చేస్తామని చెప్పి తృణమూల్ గుర్తుపై ఎన్నికల్లో గెలిచారు. ఇప్పుడు ఆ హామీని విస్మరించి పార్టీని వీడటం మోసం చేసినట్టేనని విమర్శించారు. ఈ అంశాన్ని కోర్టుకు తీసుకెళ్తారా అనే ప్రశ్నకు ఆ నిర్ణయం మమతా బెనర్జీ తీసుకుంటారు. మూడింట రెండొంతుల మద్దతు ఉందని చెప్పడం మాత్రమే సరిపోదు. ప్రత్యేక పార్టీ ఏర్పాటుకు అనేక ప్రక్రియలు ఉన్నాయి. ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని అన్నారు. ముందుగా స్పీకర్‌ను ఆశ్రయించిన తృణమూల్ఇదిలా ఉండగా, తిరుగుబాటు వర్గాన్ని గుర్తించవద్దని కోరుతూ తృణమూల్ ఎంపీలు సాగరికా ఘోష్, కీర్తి ఆజాద్‌లు స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటరీ పార్టీ నేత అభిషేక్ బెనర్జీ తరఫున లేఖను సమర్పించారు. ఆ లేఖలో లోక్‌సభలోని శాసనసభా పార్టీ ఉనికి రాజకీయ పార్టీ నుంచే ఉద్భవిస్తుంది. పార్టీకి చెందిన కొంతమంది సభ్యులు తమ ఇష్టానుసారం విడిపోయి స్వతంత్ర వర్గంగా గుర్తింపు కోరలేరని పేర్కొన్నారు. స్పీకర్ రాజకీయ పార్టీని మాత్రమే గుర్తిస్తారని, ఒకే పార్టీపై రెండు వర్గాలు హక్కు కోరితే అసలు పార్టీ ఏదో నిర్ణయించే బాధ్యత స్పీకర్‌దేనని తృణమూల్ తన వాదనలో పేర్కొంది. ఈ పరిణామాలు పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లోనే కాకుండా జాతీయ రాజకీయాల్లో కూడా కీలక మార్పులకు దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# 'భారత్ ఇన్నోవేట్స్'

>> ఫ్రెంచ్ నగరంలో, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ సమక్షంలో జరిగిన 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమ ప్రారంభోత్సవంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో భారతదేశం, ఫ్రాన్స్, మరికొన్ని దేశాలకు చెందిన అగ్రశ్రేణి ఆవిష్కరణల స్టార్టప్‌లు పాల్గొంటున్నాయి. "ప్రపంచ ఆవిష్కరణల తదుపరి అధ్యాయాన్ని భారతదేశంతో కలిసి సృష్టించడానికి ప్రపంచానికి భారత్ ఇన్నోవేట్స్ ఒక ఆహ్వానం" అని ప్రధాని అన్నారు. భారతదేశ యువ ఆవిష్కర్తలు యావత్ మానవాళికి ప్రయోజనం చేకూర్చే పరిష్కారాలను కనుగొంటున్నారని ప్రధానమంత్రి అన్నారు. మోడీ తన ప్రసంగంలో, హైటెక్నాలజీ, రక్షణ, ఆవిష్కరణలతో సహా పలు కీలక రంగాలలో తన ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల కార్యక్రమాలను ప్రముఖంగా ప్రస్తావించారు. "భారతదేశ 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' ఆగదు, అది ఆగకుండా ముందుకు సాగుతూనే ఉంటుంది," అని ఆయన పునరుద్ఘాటించారు. దశాబ్దం క్రితం ప్రపంచం భారతదేశాన్ని సాంకేతికతను స్వీకరించే దేశంగా చూసిందని, కానీ ఇప్పుడు దేశం సాంకేతికతను అందించే దేశంగా ఎదుగుతోందని మోడీ అన్నారు. "భారతదేశం సుస్థిర భవిష్యత్తు కోసం ఆవిష్కరణలు చేస్తోంది. భారతదేశం ప్రపంచం కోసం ఆవిష్కరణలు చేస్తోంది," అని ఆయన అన్నారు, ఆవిష్కరణ దేశ డిఎన్ఎలోనే ఉందన్నారు.

ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ మాట్లాడుతూ, 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని ఫ్రాన్స్ గౌరవిస్తుందని, పారిస్ వివిధ రంగాలలో దానిలో భాగస్వామిగా ఉందని అన్నారు. భారతదేశాన్ని 'ఆవిష్కరణల దేశం'గా అభివర్ణిస్తూ, ఏఐ, వాతావరణ మార్పు వంటి కీలక రంగాలలో న్యూఢిల్లీ, పారిస్‌ల మధ్య 'నిజమైన భాగస్వామ్యం' ఉందని ఆయన అన్నారు.



నైస్‌లో ప్రవాసభారతీయులతో భేటీ సందర్భంగా బుడ్డోడిని ఎత్తుకున్న పిఎం

'భారత్ ఇన్నోవేట్స్ 2026' అనేది దేశంలోని డీప్‌టెక్ స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థల అభివృద్ధిని ప్రపంచ వేదికపై వేగవంతం చేయడానికి భారత ప్రభుత్వం చేపట్టిన ఒక కీలక కార్యక్రమం. ఈ కార్యక్రమంలో 120కి పైగా ప్రముఖ భారతీయ డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఐఐటీల వంటి అగ్రశ్రేణి విద్యాసంస్థలు, 13 కీలక సరిహద్దు రంగాలకు చెందిన 500 మందికి పైగా వెంచర్ క్యాపిటలిస్టులు, గ్లోబల్ సిఇఓలు ఒకచోట చేరారు. భారత్ ఇన్నోవేట్స్ 2026లో సుమారు 120 మంది భారతీయ ఆవిష్కర్తలు, దాదాపు 15 ఉన్నత విద్యాసంస్థలు (హెచ్ఇఐలు), ప్రముఖ కార్పొరేట్లు, వెంచర్ క్యాపిటల్ సంస్థలతో పాటు గ్లోబల్ సిఇఓలు, పారిశ్రామిక నాయకులతో సహా 500 మందికి పైగా పెట్టుబడిదారులు పాల్గొంటున్నారు. ఫ్రాన్స్ నైస్ నగరంలో ప్రధాని మోడీకి ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం నైస్‌లోని ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. వారితో ముచ్చటించారు. ఇందుకు సంబంధించిన విషయాలను ప్రధాని మోడీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "నైస్‌లోని భారతీయ సమాజం నుండి చిరస్మరణీయమైన స్వాగతం లభించింది. వారు తమ దేశానికి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, భారతదేశంతో మన ప్రవాస భారతీయుల బంధం మునుపెన్నడూ లేనంత బలంగా ఉంది" అని ప్రధానమంత్రి మోడీ 'ఎక్స్'లో రాసుకొచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఆదివారం ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలోని ఉన్న చారిత్రక 'విల్లా క్రెడియోస్'ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు తేలికపాటి సంభాషణలో మునిగి పోయారు. విల్లానుకలియతిరుగుతూ ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.

# మీనాక్షిపై దొంగకేసు పెట్టించిన సిఎం

>> మనిషి.. రాహుల్ గాంధీకి నమ్మిన బంటు అన్న కెటిఆర్ అమెపై రేవంత్ రెడ్డి కుట్ర చేశారన్నారు. రేవంత్ రెడ్డి పాలనను "అట్టర్ ఫ్లాప్"గా అభివర్ణించిన కేటీఆర్, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. సినిమా ట్రైలర్ చూడగానే హిట్ లేదా ఫ్లాప్ అని తెలిసినట్లే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటర్వెల్‌కే ఫ్లాప్ అని తేలిపోయిందని, ఈ రెండున్నర ఏళ్ల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. నిరుద్యోగుల సమస్యలను ప్రస్తావిస్తూ, మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇప్పటివరకు 4 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని, అలాగే నిరుద్యోగ భృతి రూ. 4 వేల హామీని కూడా గాలికొదిలేశారని దుయ్యబట్టారు. కేటీఆర్, కేసీఆర్ ఉద్యోగాలు ఊడగొట్టారని ఆరోపించిన రేవంత్, ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగాలు ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. మహిళా హామీపై స్పందిస్తూ, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి, అది నెరవేరితే నిరూపించాలని, లేని పక్షంలో తాను రాజీనామాకు సిద్ధమని కేటీఆర్ సవాల్ విసిరారు. ఒక్కో లబ్ధిదారునికి ప్రభుత్వం రూ. 1.25 లక్షలు బాకీ ఉందని గుర్తు చేశారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం ప్రజా తీర్పును అవమానించడమేనని అన్నారు. త్వరలో ఉపఎన్నికలు వస్తాయన్న కెటిఆర్ ఆ ఉప ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పి, మళ్లీ బిఆర్ఎస్‌ను గెలిపిస్తారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. విద్యుత్, మంచినీటి సమస్యలపై కేటీఆర్ మాట్లాడుతూ, "2014కు ముందు హైదరాబాద్‌లో కరెంట్ సమస్యలు ఉండేవి, కానీ కేసీఆర్ పాలనలో 24 గంటల నిరంతర విద్యుత్ అందించాం. ఎండాకాలం వచ్చిందంటే కుండలతోధర్నాచేసే పరిస్థితి ఉండేది, కేసీఆర్ వచ్చాక ఆ పరిస్థితి మారిపోయింది. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చాక, హైదరాబాద్‌లోని ప్రతి ఇంటికి రక్షిత మంచినీటిని ఉచితంగా అందిస్తాం. 20 వేల లీటర్ల ఉచిత నీటిని అందించిన ఘనత కేసీఆర్‌దే" అని స్పష్టం చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గ రాజకీయాలపై స్పందిస్తూ, "దానం నాగేందర్ నియోజకవర్గ ప్రజలను మోసం చేసి రేవంత్ పక్కన కూర్చున్నారు. కాంగ్రెస్ గుర్తుతో గెలిచిన దానం నాగేందర్ వల్లత్వరలో ఇక్కడ ఉపఎన్నికరావడం ఖాయం. ప్రతిఓటు విలువైనది, జూబ్లీహిల్స్‌లో లాగా దొంగ ఓట్లతో గెలిచేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోంది. కాబట్టి బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రతి ఓటును జాగ్రత్తగా గమనించాలి" అని పిలుపునిచ్చారు.

## వారం - వర్జ్యం

15-06-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
అమావాస్య ఉ.8.24, పాడ్యమి తె.4.32
మృగశిర రా.7.10
వర్జ్యం : రా.2.33 - రా.3.57
దు.మ.12.34-మ.1.26,
2) మ.3.11-సా.4.03
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** తండ్రి ద్వారా ఆస్తి ధనలాభాలు పొందుతారు. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పుతుంది. వస్త్రలాభం.

**వృషభం:** అనేకాంశాలు అనుకూలంగా ఉన్నా నిష్కారణమైన చికాకులు కొంత అశాంతికి గురి చేస్తాయి. నూతన విద్యావకాశాలు కలవు.

**మిథునం:** అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. కాంట్రాక్టులు లాభిస్తాయి. దీర్ఘకాలిక సమస్యలనుండి బయటపడతారు.

**కర్కాటకం:** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది.

**సింహం:** బ్యాంకు లావాదేవీలు అనుకూలంగా ఉంటాయి. శ్రమకు తగిన ప్రతిఫలం ప్రతిపనిలోనూ కనబడుతుంది.

**కన్య :** చిన్ని చిన్ని నిర్మాణ పనులకు ధనం ఖర్చు చేయవలసి వస్తుంది. వృత్తిలో చెప్పుకోదగిన ఒడిదుడుకులు ఉండవు.

**తుల :** సెంటిమెంటు వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు పాటించండి. కీలక వ్యవహారాలలో గోప్యతను వహించి లాభపడతారు.

**వృశ్చికం:** మీ వెంటే ఉంటూ మీ వైరి వర్గానికి సహాయ సహకారాలు అందించే వారిని గుర్తిస్తారు. శుభవార్తలు అందుకుంటారు.

**ధనుస్సు:** దగ్గరి బంధువులతో తొలిత చర్చించి ఒక శుభకార్యాన్ని ఖరారు చేస్తారు. విందులో పాల్గొంటారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిని పొందుతారు.

**మకరం:** మీకు ఇష్టమైన తోటలు కొనుగోలు చేస్తారు. ప్రభుత్వ ఉద్యోగులకు స్థాన చలనం. సంఘంలో ప్రత్యేక గౌరవం.

**కుంభం:** కొత్త పెట్టుబడులకు తగిన లాభం పొందుతారు. ఆరోగ్యం, వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు. వస్త్రలాభం.

**మీనం :** పరిశోధనలు, సాంకేతిక విషయాలపై ఖసక్తి చూపుతారు. విదేశీ పర్యటన అవకాశాలు ఉన్నాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రోడ్లపైకి వచ్చి చూస్తా

>> మున్సిపల్, పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తం కాలేదన్నారు . వర్షాల సన్నద్ధతపై జూన్ 1న సమీక్ష నిర్వహించి తాను స్వయంగా అనేక సూచనలు చేశానని గుర్తుచేశారు. అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ముఖ్యమంత్రి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జూన్ 9న వర్షం సమయంలో మున్సిపల్, పోలీసు అధికారుల మధ్య సమన్వయం లోపించిందన్నారు. ఈ పరిస్థితికి గల కారణాలను విశ్లేషించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌లను ఆదేశించారు. మరో సారి ఇలాంటి పరిస్థితి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ సూచనల మేరకు వర్షాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షం సమయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హైడ్రా, ట్రాఫిక్, జలమండలి సిబ్బందితో పాటు సివిల్ పోలీసులు కూడా క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనన్నారు. పోలీసు కమిషనర్ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు రోడ్లపైకి రావాల్సిందేనని తేల్చిచెప్పారు. అవసరమైతే తాను కూడా రోడ్డుపైకి వస్తానని ముఖ్యమంత్రి అన్నారు. వర్షం కారణంగా ట్రాఫిక్ జామ్ అయితే ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ విభాగంలోని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డీజీపీకి సూచించారు. మానవ తప్పిదాల వల్ల సమస్యలు తలెత్తితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించనని హెచ్చరించారు. వర్షాల సమయంలో ఏర్పడే వాటర్ లాగింగ్ పాయింట్లు, బ్లాక్ స్పాట్లు, ట్రాఫిక్ జామ్ అయ్యే ప్రాంతాల డేటా ఆధారంగా అధికారులు సన్నద్ధం కావాలని సూచించారు. వర్షం కారణంగా పలు చోట్ల చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ పునరుద్ధరణ వెంటనే జరగాలని సూచించారు. అవసరమైన చోట్ల మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. వర్షం సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది అంతా క్షేత్రస్థాయిలో పనిచేసేలా చూడాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులకు సూచించారు. మాన్యువల్ ప్రకారం ప్రాజెక్టుల నిర్వహణ ఉండాలన్నారు. వర్షాకాలంలో ప్రాజెక్టుల వద్ద సంబంధిత ఇంజినీర్లు తప్పనిసరిగా స్థానికంగా ఉండాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ప్రాజెక్టులను వదిలి వెళ్లే ఇంజినీర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ కార్యదర్శిని ఆదేశించారు. ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులు, నిర్వహణకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు సూచించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యంగా విత్తనాలు, యూరియా పంపిణీపై దృష్టి సారించాలన్నారు. రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. యూరియా స్టాక్ , పంపణి కోసం స్థానిక వ్యవసాయ అధికారిని బాధ్యుడిగా నియమించడంతో పాటు రెవెన్యూ సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. సన్న వడ్ల కోసం వ్యవసాయ శాఖ ప్రకటించిన ఎనిమిది రకాల విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. గతంలో తాగునీటి కాలుషితం కారణంగా జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. నీటి కలుషితం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున వైద్య ఆరోగ్య శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులను సిద్ధం చేసుకోవాలన్నారు. వర్షాల కారణంగా నీటి నిల్వలు ఏర్పడి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నందున శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జలమండలి, వైద్య ఆరోగ్య శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌కు ముఖ్యమంత్రి సూచించారు. పోలీసు, ట్రాఫిక్, ఫైర్, హైడ్రా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు. సిఎం వద్ద జరిగిన సమీక్షా సమావేశంలో సిఎంఓ ముఖ్యకార్యదర్శి శేషాద్రి, జయేష్ రంజన్(ప్రత్యేక ప్రధాన కార్యదర్శి-మున్సిపల్), వికాస్ రాజ్(ప్రత్యేక ప్రధాన కార్యదర్శి-రోడ్లు భవనాలు), సందీప్ కుమార్ సుల్తానియా(ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి), ఈ. శ్రీధర్, (నీటిపారుదల శాఖ కార్యదర్శి)డా. గౌరవ్ ఉప్పల్(ప్రణాళిక శాఖ కార్యదర్శి)కె. సురేంద్ర మోహన్(వ్యవసాయ శాఖ కార్యదర్శి), హరిచందన(ప్రత్యేక కార్యదర్శి-విపత్తు నిర్వహణ), ఆర్.వి.కర్ణన్(జీహెచ్ఎంసీ కమిషనర్)వినయ్ కృష్ణారెడ్డి(ఎంఎంసీ కమిషనర్)సృజన (సీఎంసీ కమిషనర్), అశోక్ రెడ్డి (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎండీ), డి. కృష్ణ భాస్కర్(టీజీ ట్రాన్స్‌కో సీఎండీ)ఎస్. హరీష్(టీజీ జెన్‌కో సీఎండీ), జితేష్ వి. పాటిల్(టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ), కె. వరుణ్ రెడ్డి(టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ), వి.సి. సజ్జనార్(హైదరాబాద్ పోలీస్ కమిషనర్), విక్రమ్ సింగ్ మాన్(అగ్నిమాపక శాఖ అదనపు డీజీ), డా. తరుణ్ జోషి(ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్), ఎం. రమేష్ (సైబరాబాద్ పోలీస్ కమిషనర్), ఏ.వి. రంగనాథ్ (హైడ్రా కమిషనర్), బి. సుమతి (మేడ్చల్‌మల్కాజిగిరి పోలీస్ కమిషనర్) తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి కుట్రలో మరొకటి

>> వెంటనే తగిన ఆధారాలతో వాటిని తిరిగి దరఖాస్తు చేయించి పునరుద్ధరణ జరిగేలా చూడాలని సూచించారు. రాబోయే ఎన్నికలలో చాలా కీలకంగా ఉన్న దృశ్యా ప్రతి ఒక్క ఓటును కాపాడుకోవాలని అన్నారు.. ఈ జూమ్ మీటింగ్ లకు కో ఆర్డినేటర్‌గా నాయకులు గంప వేణు గోపాల్ వ్యవహరించగా ఎన్నికల కమిషన్ కు సంబంధించిన వివరాలను టిపిసిసి ఎలెక్షన్ కమిషన్ చైర్మన్ రాజేష్ వివరించారు.. కాగా ఇప్పటి వరకు 90 శాతం బిఎల్ఏ ట్రైనింగ్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఇక నుంచి బిఎల్ఎ2 లు క్షేత్ర స్థాయిలో 25 వ తేదీ నుండి ఇంటింటికి వెళ్తారు, ప్రతి 10 బూతులకు ఒక సూపర్ వేజర్ ని నియామకం చేస్తూ, ప్రతి అసెంబ్లీ కి ఒక కోఆర్డినేటర్ ని నియమించి, ఎఇఆర్ఒ, ఇఆర్ఒలతో సమస్య పరిష్కారం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంకా జూమ్ సమావేశంలో ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రి పొన్నం ప్రభాకర్, ట్రైనింగ్ సెల్ చైర్మన్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, పార్లమెంట్ల వారీగా డిసిసి అధ్యక్షులు, ఎంపిలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు..




ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన నిరసనలో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న యువత

# ధర్మేంద్ర ప్రధాన్ దిగిపోవాల్సిందే

>> మాట్లాడుతూ సీజేపీ ఒక రాజకీయ వేదిక కాదని, దేశ యువతను ప్రోత్సహిస్తూ, ప్రతి భారతీయుడిని మేల్కొలిపి, సమాజానికి సానుకూలంగా దోహదపడేలా చేయటమే ఈ ఉద్యమ లక్ష్యమని తెలిపారు. విద్యారంగంలో పటిష్టమైన పునాదులు ఉండాలని, మన విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసి, పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యాసంస్థలలో సమస్యలు సరిదిద్దాలని, ప్రతి ఒక్కరిలో జవాబుదారీతనం ఉండాలని అన్నారు. ప్రజల గొంతులు అణచివేయకుండా, నిర్భయంగా తమ గొంతులు వినిపించే అవకాశం ఉండాలన్నారు. పర్యావరణ సమస్యలపై గళం విప్పుతున్న హైదరాబాద్ ప్రజలను చూస్తే గర్వంగా ఉందని తెలిపారు. నీట్ పేపర్ లీకేజీ వివాదంతో ఆకాంక్ష చతుర్వేది వంటి విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం విచారకరమని, విద్యార్థులు ఎవరూ ఆందోళన చెందవద్దని, విద్యార్థుల పక్షాన సీజేపీ పోరాడుతుందని హామీ ఇచ్చారు. ప్రొఫెసర్ కే.నాగేశ్వర్ మాట్లాడుతూ లాల్‌బహుదూర్ శాస్త్రి రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో భారీ రైలు ప్రమాదం జరిగితే దానికి నైతిక బాధ్యత వహిస్తూ ఆనాడు ఆయన తన పదవికి రాజీనామా చేశారని, నేడు పరీక్షా పత్రాల లీకేజీలతో విద్యార్థులు బలిఅవుతున్నా, కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎక్కడ ఉన్నారో కూడా తెలియటం లేదని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేస్తే ఆ కుర్చీలో నాగేశ్వర్‌రావు, సోనమ్ వాంగ్‌చుక్‌లు కూర్చోరని తెలిపారు.

మనం ఎటువంటి రాజకీయ పాలనలో ఉన్నామో అర్థం కావటం లేదన్నారు. ఉల్లి ధర పెరుగుతోందంటే ఉల్లి మేం తినమంటారు, పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయంటే బంగారం కొనటం మానేయండి అంటున్నారు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయంటే ఆడపిల్లలు ఆ డ్రస్ ఎందుకు వేసుకున్నారు, ఆ సమయంలో వాళ్లు బయటకు ఎందుకు వెళ్లారు అని అంటున్నారని, వీటిపై ప్రశ్నిస్తే నువ్వు అర్బన్ నక్సలైట్, పాకిస్తాన్ ఏజెంట్, హిందూ ద్రోహి అంటారని మండిపడ్డారు. విద్యార్థులకు ఉద్యోగాలిస్తే మీరు తీసుకురాలేని మిలియన్ డాలర్లు తీసుకువస్తారని, ఇతరులపై ఆధారపడే పరాన్నభుక్కులం మేము కాదని, కష్టపడి పనిచేయాలనుకునే కాక్రోచ్‌లమని స్పష్టం చేశారు. అసలైన దేశభక్తులం మేమే అని, భగత్‌సింగ్ వారసులమని, ఆన్‌లైన్‌లో ప్రారంభమైన ఈ ఆవేశం ఇప్పుడు రోడ్డుమీదకు వచ్చిందని, ప్రజల పక్షాన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆకునూరి మురళి మాట్లాడుతూ పరీక్షలు సరిగా పెట్టలేని సన్యాసుల పాలనలో ఉన్నామని, దూర్మర్గపు పరిపాలన చేస్తూ ప్రతి సంవత్సరం విద్యార్థులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నిరసన కార్యక్రమంలో సీజేపీ స్పోక్స్ పర్సన్ విజేత దహియా, వామపక్ష నేతలు, సీజేపీ కార్యకర్తలు, విద్యార్థులు, యాక్టివిస్టులు పాల్గొన్నారు.

# 18 నుంచి భారీవర్షాలు

>> మాత్రమే కురిసింది. సగటు వర్షపు రోజులు కూడా ఈ జిల్లాలో అత్యల్పంగా రెండురోజులు నమోదైదనాయి. తెలంగాణలో తొమ్మిది రోజుల లో అత్యధికంగా వర్షపు రోజులు రంగారెడ్డి, సూర్యాపేటలో 8 రోజులుగా నమోదైనాయి. తెలంగాణ ప్రస్తుతం మొత్తంగా చూస్తే రాష్ట్రసగటు సాధారణ వర్షపాతం 5.2సె.మి నమోదు కావాల్సి ఉండగా ఏడు సగటు వర్షపు రోజులతో 4.8సెం.మి కురిసి రాష్ట్రంలో సాధారణ సగటు వర్షాపాతం నమోదైనట్లు రికార్డు అయింది. శనివారం ఉదయం ఎనిమిదిన్నర నుంచి ఆదివారం ఉదయం ఆరుగంటల వరకు సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో 12.1సెం.మి అత్యధిక భారీ వర్షం కురిసింది. వికారాబాద్‌జిల్లా పూడురు మండలం పెద్దఉమ్మెంతులలో 8.9సెం.మి, వనపర్తి జిల్లా రేవల్లి లో7.5 రంగారెడ్డి జిల్లా షాబాద్ చందన్‌వెల్లి, యాదాద్రిజిల్లా వలిగొండ వెర్కట్‌పల్లి6.8సెం.మి రంగారెడ్డి జిల్లా మోయినాబాద్‌లో 6.7 సెం.మి , రెడ్డిపల్లిలో6.5సెం.మి అదే భారీ వర్షం కురిసింది. వికారాబాద్ శంకరపల్లి, నావాబ్ పేటలో కురిసిన వర్షంతో మూసీ వాగులో నీటి వరద ప్రవాహం మొదలైంది. జోగులాంబం గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట, మెదక్, మహబూబ్‌నగర్ ఓ మోస్తారు వర్షం కురిసింది. ఆదివారం ఉదయం ఎనిమిదిన్నర తరువాత మంచిర్యాల నిర్మల్, నల్లగొండ, కుమురంభీం, నారాయణపేట, మహబూబ్‌నగర్ సూర్యపేట, వికరాబాద్ జిల్లాలో 15 ప్రదేశాల్లో ఓ మోసార్తు వర్షం కురిసింది. ఇది ఇలా ఉంటే రానున్న మూడ రోజుల్లో గంటకు 30నుంచి 40కిమి వేగంతో ఈదు గాలులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతారణ శాఖ ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్రంలో నైరుతిరుతుపవనాలు నెమ్మదిగా కదులుతున్నాయనీ 18నాటికి విస్తరించి భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. సోమవారం పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాద్రాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

## విద్యార్థులకు మన్నికైన యూనిఫాం

>> అందజేసే యూనిఫాంలకు సంబంధించి వస్త్రం సరఫరా మొదలు కుట్టు పని వరకు ప్రతి దశలోనూ నాణ్యతకు పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు సిఎం కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని రకాల పాఠశాలలు, గురుకులాల్లోని విద్యార్థులకు మఫత్‌లాల్ వంటి పేరెన్నికల గల సంస్థ నుంచి యూనిఫాం వస్త్రాన్ని ఈ దఫా సేకరిస్తున్నారు. యూనిఫాంతో పాటు స్కూల్ బ్యాగ్, బూట్లు, సాక్సులు, టై, బెల్ట్, బెడ్డింగ్ సామగ్రి, ప్లేటు, గ్లాసు, కటోరా ఇలా ప్రతి దానిలోనూ ప్రభుత్వం నాణ్యతకు పెద్ద పీట వేసింది. గతంలో పాఠశాల విద్యా విభాగం ఏ గురుకుల విభాగానికి ఈ గురుకుల విభాగం విద్యార్థులకు అవసరమయ్యే సామగ్రి వేర్వేరుగా కొనుగోలు చేసి అందజేసేవి, దాంతో అనేక రకాల హెచ్చు తగ్గులు కనిపించేవి. కొన్ని పొరపాట్లు చోటుచేసుకునేవి, ఆ సమస్యలను అధిగమించి సామగ్రి సేకరణ పంపిణీలో ఏకరూపత కోసం ఈ ఏడాది ప్రభుత్వం సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ సిస్టమ్ తీసుకువచ్చింది. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పరిధి విద్యా సంస్థల విద్యార్థులకు మన్నికైన యూనిఫాం, ఇతర సామగ్రి అందజేసేందుకు రూ.687.78 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తోంది. దీనిని ఖర్చుగా కాకుండా భవిష్యత్ తరాలపై పెట్టే వ్యయంగా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది. మొత్తం 27 లక్షల మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాంకు సంబంధించి 2.97 కోట్ల మీటర్ల వస్త్రం కొనుగోలుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. మఫత్‌లాల్ కంపెనీ 2.41 కోట్ల మీటర్లు, తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంస్థ (టిజిఎస్‌సిఒ) 55.32 లక్షల మీటర్ల వస్త్రం సరఫరా చేస్తున్నాయి. ఇందులో విద్యార్థినీవిద్యార్థులకు లైట్ బ్లూ, డార్క్ బ్లూ, వైట్, ప్లెయిన్ మెరూన్, మెరూన్ చెక్స్ రంగుల్లో యూనిఫాంలు అందజేయనున్నారు. విద్యార్థినులకు షర్ట్, పంజాబీ డ్రెస్, చున్నీ సరఫరా చేయనున్నారు. ఈ దఫా విద్యార్థులకు యూనిఫాం రంగులను ప్రభుత్వం మార్చింది. డే స్కాలర్స్‌కు టాప్ లైట్ బ్లూ, లోవర్స్ డార్క్ బ్లూ యూనిఫాంలో ఉండనున్నాయి. గురుకులాల్లోని విద్యార్థులకు టాప్‌లో మెరూన్ చెక్, లోవర్ మెరూన్ యూనిఫాంలో ఉండనున్నాయి. యూనిఫాం కుట్టు పనిని మహిళా స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం అప్పజెపింది.. రాష్ట్రంలోని మహిళా సంఘాలకు రోజుకు 75 వేల నుంచి లక్ష యూనిఫాంలు కుట్టే సామర్థ్య ఉంది. ఒక్కో యూనిఫాం కుట్టు పనికి రాష్ట్ర ప్రభుత్వం రూ.75 చెల్లిస్తుంది. ఈ పనితో సంఘాల్లోని మహిళలకు సుమారు రూ.40 కోట్లకుపైగా ఆదాయం సమకూరనుంది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన సామగ్రితో కూడిన కిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. ఇందులో యూనిఫాంతో పాటు తెల్లని బూట్లు, తెల్లని సాక్సులు ఉంటాయి. గతంలో బీసీ గురుకులాల్లోని విద్యార్థులకు మాత్రమే బూట్లు ఇచ్చేవారు. ఈ దఫా అన్ని రకాల యాజమాన్యాల్లోని విద్యార్థులకు బూట్లను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, పట్టణ గురుకుల పాఠశాలల విద్యార్థులకు బెల్టు, ఐడీ కార్డు, టై, స్కూల్ బ్యాగు, బూట్లు (నలుపు, తెలుపు - సాక్సులతో), బెడ్డింగ్ సామగ్రి, ప్లేటు, గ్లాసు, కటోరా, ట్రంక్ బాక్సు, పీటీ డ్రెస్, నైట్ డ్రెస్, ట్రాక్ సూట్‌తో కూడిన సంపూర్ణమైన కిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది. మైనారిటీ గురుకులాల్లోని విద్యార్థులకు తొలిసారిగా ట్రాక్ సూట్, నైట్ డ్రెస్ లను రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది. ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ పాఠశాలల్లోని విద్యార్థులకు తొలిసారిగా నల్లటి బూట్లు, బెల్టును రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది. ఈ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం వ్యయం చేస్తున్నది రూ.687.78 కోట్లు మాత్రమే. పేద, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన సామగ్రి అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా జాతీయ ఈ టెండర్ల పద్ధతిని పాటిస్తోంది. యూనిఫాం, బెడ్డింగ్ ఆర్డర్లలో 25-30శాతం తెలంగాణ రాష్ట్ర చేనేత కార్మికుల సహకార సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఇందులో 25శాతం యూనిఫాం వస్త్రం (సుమారు 56 లక్షల మీటర్లు), 100శాతం దుప్పట్లు (6, 49, 381), 3 లక్షల బెడ్‌షీట్లు, 2.29 లక్షల కార్పెట్లు ఉన్నాయి. ఈ ఆర్డర్‌తో చేనేత కార్మికులకు ఆదాయం సమకూరనుంది. టైలు, బెల్టులు, ఐడీ కార్డుల ఆర్డర్‌ను తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్‌కి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ప్రభుత్వం విద్యార్థులకు అందజేసే యూనిఫాం, టైలు, బెల్టులు, ఐడీ కార్డులు, దుప్పట్లు, బెడ్‌షీట్లు, కార్పెట్లతో యూనిఫాంలు కుట్టే మహిళలు, దుప్పట్లు, కార్పెట్లు తయారుచేసే చేనేత కార్మికులు, బెల్టులు, ఇతర సామగ్రి తయారీతో టిజిఎల్ఐపిసి పరిధిలోని కార్మికులకు ఆదాయం లభిస్తుంది.

## రక్తదానం చేద్దాం, ప్రాణదాతలుగా నిలుద్దాం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జూన్14:** రక్తదానం పట్ల సమాజంలో చైతన్యం కలిగిస్తూ,నిరంతరం అమూల్యమైన సేవలతో ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపుతున్న సేవా సంస్థలు, స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణాలను కాపాడుతున్న ప్రతి రక్తదాతకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ప్రపంచ రక్తదాన దినోత్సవం' సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలిపారు.రక్తదానం ఒక ప్రాణాన్నినిలబెట్టే మహోన్నత మానవతా సేవ అని, ఒకరి రక్తదానం మరొకరి జీవితాన్ని కాపాడుతుందని, వారి కుటుంబంలో కొత్తఆశలను నింపుతుందన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను కాపాడే మహత్తరకార్యంలో భాగస్వాములై ప్రాణదాతలుగా నిలవాలని సిఎం ఒక సందేశంలో వివరించారు.

## రేపటి నుంచి టెట్ పరీక్షలు

### 22 వరకు కొనసాగింపు, అభ్యర్థుల నుంచి 1,36,418 దరఖాస్తులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 14:** టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)-2026 పరీక్షలను రేపటి(మంగళవారం) నుంచి నిర్వహించనున్నారు. ఈనెల 22 వరకు పరీక్షలను కొనసాగించనున్నారు. పరీక్షలను 5 రోజుల పాటు 10 సెషన్‌లలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన హాల్ టికెట్లను ఈ నెల 9న జారీ చేసిన విషయం తెలిసిందే. పరీక్షలకు సంబంధించి ఉదయం సెషన్లను 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌ను 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,36,418 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు చేసుకున్న వారిలో ఇన్ సర్వీస్ టీచర్ల నుంచి 28,149 దరఖాస్తులు వచ్చాయి. 5 దరఖాస్తులు ట్రాన్స్ జెండర్ల నుంచి వచ్చాయి. 1,36,418 దరఖాస్తుల్లో పేపర్-1కి 32,779 దరఖాస్తులు రాగా, పేపర్-2కి 86,305 దరఖాస్తులు వచ్చాయి.రెండు పేపర్లకు 17,334 దరఖాస్తులు వచ్చాయి. 28,149 ఇన్ సర్వీస్ టీచర్లలోపేపర్-1కి 7,678 దరఖాస్తులు రాగా, పేపర్-2కి 20,471 దరఖాస్తులువచ్చాయి. పేపర్-2లో మ్యాథ్స్ అండ్ సైన్స్‌కి 11,343 దరఖాస్తులు రాగా, పేపర్-2 సోషల్ స్టడీస్‌కి 9,128 దరఖాస్తులు వచ్చాయి.

## గద్వాల్ విజయలక్ష్మి సోదరి అదృశ్యం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 14, ప్రభాతవార్త:** తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి సోదరి అదృశ్యమైంది. ఆ మేరకు గద్వాల్ విజయలక్ష్మి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం ఈ నెల 4న తన సోదరి నమ్రత(57) ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్ళింది. అలా వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెదికినా, తెలిసిన వారిని విచారించినా ఫలితంలేకుండాపోయింది.కాగా సతీష్(35), సత్యనారాయణ(45), కుమారి(45)ల మీద ఆమె అనుమానం వ్యక్తం చేస్తూ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్రంలో భూ ప్రకంపనలు

### రిక్టర్ స్కేల్‌పై 3.8గా నమోదు

### ఇళ్ల నుండి బయటకు పరుగులు



**హైదరాబాద్, జూన్ 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో భూ ప్రకంపనాలు సంభవించాయి. రాష్ట్రంలోని కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని పలు చోట్ల ఆదివారం తెల్లవారు జామున స్వల్ప భూకంపం సంభవించింది. రాష్ట్రంలోని జిల్లా కేంద్రం కొత్తగూడెంతోపాటు, జిల్లాల్లోని పాల్వంచ, ముల్కలపల్లి, బుర్గంపాడ, భద్రాచలం, మణుగూరు తదితర ప్రాంతాల్లోను, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తెల్లవారు జామున 2:26గంటల ప్రాంతంలో భూకంప ప్రకంపనలు సంభవించాయి. జాతీయ భూకంప శాస్త్ర కేంద్రం (ఎన్‌సిఎస్) అధికారిక సమాచారం ప్రకారం, ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కే లుపై 3.8గా నమో దైంది. ఈ భూకంప కేంద్రం ఆంధ్రప్రదేశ్‌లోని రాజమం డ్రికి వాయువ్యంగా 111 కిలోమీటర్ల దూరంలో ఉంది. భూమిలోపల సుమారు 10కిలోమీటర్ల లోతులో ఈ ప్రకంపనలు సంభవించాయని అధికారులు తెలిపారు. తీవ్రత తక్కువగా ఉన్నప్పటికీ, ప్రకంపనలు స్పష్టంగా అనుభూతి చెందాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భూకంపం సంభవించింది. జనాలు గాఢ నిద్రలో ఉండగా అర్థరాత్రి భూమి కంపించింది.దీంతో ప్రజలు నిద్ర లేచి ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు.భూకంపం సంభవించిన సమయంలో నివాసితులు గాఢనిద్రలో ఉన్నందున, కొద్దిమంది మాత్రమే ప్రకంపనలను అనుభూతిచెంది, ఈ అనూహ్య సంఘటనతో భయాందోళనలకు గురయ్యారు. మంచాలు, గృహోపకరణాలు, వంటసామాను అకస్మాత్తుగా వణకడం ప్రారంభించడంతో తాము అయోమయానికి గురయ్యామని ప్రజలు తెలిపారు. అయితే, భూకంపం కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగలేదని అధికారులు ప్రకటించారు.

## సైబరాబాద్ పోలీసులకు పట్టుబడ్డ అంతరాష్ట్ర డ్రగ్ స్మగ్లర్




**హైదరాబాద్, జూన్ 14, ప్రభాతవార్త:** గ్రేటర్ పరిధిలో మాదకద్రవ్యాల స్మగ్లర్ల అరెస్టుల పర్వం ఆగడం లేదు. నిత్యం ఏదో ఒకచోట కొందరు డ్రగ్స్ స్మగ్లర్లు పట్టుబడుతూనే వున్నారు. తాజాగా శనివారంరాత్రి మాదాపూర్‌లోని చంద్రా నాయక్ తాండలో అపార్ట్‌మెంట్‌పై ఎస్ఓటి పోలీసులు దాడి చేయగా విజయ వాడకు చెందిన అంతర్ రాష్ట్ర డ్రగ్ స్మగ్లర్ దనేకుల తరుణ్ తేజ (22) దొరికిపోయాడు. ఇతని వద్ద 15 గ్రాముల ఎండిఎంఎ , 382 గ్రాముల ఓజి కుష్ గంజా, తొమ్మిది సెల్‌ఫోన్లు, రెండు చిన్నపాటి తూకం యంత్రాలు, డ్రగ్స్ వాడకం కోసం ఉపయోగించే కాగితాలు, మాదకద్రవ్యాలను పాకింగ్ చేసేందుకు కావాల్సిన సామాగ్రి ట్టుబడ్డాయి. విజయవాడకు చెందిన కార్తిక్, పృథ్వీ అనే డ్రగ్‌స్మగ్లర్ల నుంచి ఇతను మాదకద్రవ్యాలను తక్కువ ధరకు కొని వాటిని హైదరాబాద్‌లో తనకు తెలిసిన వారికి ఎక్కువ ధరకు విక్రయి స్తున్నాడు. వీరిద్దరిని పట్టుకునేందుకు పోలీసులు రంగంలో దిగారు. కాగా పోలీసుల దాడుల సందర్భంగా ఎనిమిది మంది యువకులు ఎండిఎంఎ, ఓజి కుష్ గంజాయి డ్రగ్స్ సేవించిన పరిస్థితులో వుండగా వారిని వెంటనే అదుపులోకి తీసుకుని ఎర్రగడ్డలోని మానసిక ఆసుపత్రిలోగల పునరావాస కేంద్రానికి తరలించారు. పట్టుబడ్డ తరుణ్ తేజను అరెస్టుచేసి రిమాండుకు తరలించారు.

# వర్షాల నేపథ్యంలో హైవే అథారిటీ అప్రమత్తం

### వాటర్ లాగింగ్ పాయింట్లపై నిఘా, స్థానిక పోలీసులతో గస్తీ

**హైదరాబాద్ జూన్ 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో హై వే అథారిటీ అప్రమత్తయ్యింది. రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ రహదారులపై వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నిఘా పెంచడంతో పాటు రోడ్లపై నీరు ప్రవహించే ప్రాంతాలలో స్థానిక పోలీసులతో కలిసి గస్తీని చేబట్టింది. రాష్ట్రంలో విజయవాడ, బెంగళూరు, ముంబాయి, పూణే, వరంగల్ జాతీయ రహదారులుండగా వీటికి అనుసంధానంగా రాష్ట్ర రహదారులు వుండడం తెలిసిందే. జాతీయ రహదారుల పక్కన అనేకచోట్ల చెరువులు వుండడం విదితమే. ఈ చెరువుల కారణంగా అనేకసా ర్లు వరదల సమయంలో వరదనీరు నిమిషాల వ్యవధిలో రహదారులను ముంచెత్తిన ఉదంతాలున్నాయి. ఇందులో బెంగళూరు జాతీయ రహదారిపై గల గగన్‌పహాడ్ వద్ద ఐదేళ్ల క్రితం రాత్రివేళ అప్పా చెరువు పొంగి వరదనీరు రోడ్డును ముంచెత్తింది. ఈ ఘటనలో పాత కర్నూలు రోడ్డు చౌరస్తాపై నిమిషాల వ్యవధిలో పది అడుగుల నీరు చేరింది. దీంతో ఆ సమయంలో బెంగళూరు జాతీయ రహదారిపై ప్రయాణించిన అనేక వాహనాలు కొట్టుకుపోగా ఎనిమిది మంది మరణించారు. కొందరు తృటిలో ప్రాణాలు దక్కించుకున్నారు. ఈ ఘటన తరువాత అప్పా చెరువుకు మరమ్మత్తులు చేబట్టినా ప్రతీ సంవత్సరం వరదనీరు ఈ ప్రాంతంలో వస్తూనే వుండడం గమనార్హం. బెంగళూరు జాతీయ రహదారిపై గల శంషాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలలో వున్న చెరువులు సైతం వర్షాకాలంలో ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. దీని తరువాత విజయవాడ జాతీయ రహదారిపై పలుచోట్ల వున్న చెరువులు అనేకచోట్ల వర్షాకాలంలో రహదారిని ముంచెత్తుతున్నాయి. ముంబాయి, వరంగల్, పూణె జాతీయ రహదారులపైనా ఇలాంటి పరిస్థితులు వున్నాయి. అయితే భారీ వర్షాలపై అన్ని శాఖలు సమన్వయంతో వుండాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన దరిమిలా పోలీసు శాఖ వెంటనే రంగంలో దిగింది. డిజిపి ఆనంద్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. దీంతో పాటు సిటీ కొత్వాల్ సజ్జనర్, సైబరాబాద్ కొత్వాల్ రమేష్, ఫ్యూచర్ సిటీ కొత్వాల్ డాక్టర్ తరుణ్ జోషి సహా ఆయా జిల్లాల కమిషనర్లు, ఎస్‌పిలు తమ తమ సిబ్బం దితో వరదల ప్రాంతంలో పర్యటించి పౌర అధికారులతో సమన్వయం చేసుకోవడంతో పాటు ట్రాఫిక్ వ్యవస్థ గాడితప్పకుండా చర్యలు చేబట్టారు. భారీ వర్షాల వల్ల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు ఎలావున్నా జాతీయ రహదారులపై పరిస్థితులు భిన్నంగా వుండడం విశేషం. ని త్యం లక్షల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగే జాతీయ రహదారులపై వరదనీరు వస్తే వాహనాల ఆగిపోతుంటాయి. దీంతో ట్రాఫిక్ ముం దుకు సాగే పరిస్థితి వుండదు. రోడ్లపై గోతులు ఏర్పడి ప్రమాదాలు సంభవిస్తాయి. వాహనాలు స్కిట్ అవుతూ ప్రమాదాలకు లోనవుతాయి. దీనివల్ల ఒక్కోసారి కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ జాం ఏర్పడుతుంటుంది. వీటన్నింటి నేపథ్యంలో హైవే అథారిటీ ముందుగానే రంగంలో దిగి ఆయా ప్రాంతాలలో పరిస్థితులను అధ్యయనం చేస్తూ స్థానిక పోలీసులను అప్రమత్తం చేయసాగింది.

## డాక్టర్ సెజల్ పవార్‌కు 15రోజుల బలవంతపు సెలవు

**మృతదేహాల ప్రైవేట్ భాగాలపై జోకుల ఫలితం..**

**కెఇఎం ఆసుపత్రి క్యాంపస్, హాస్టల్‌లోకి రాకుండా నిషేధం**

**సెజల్‌తో పాటు కమెడియన్ ప్రణీత్ సహా ముగ్గురిపై సైబర్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు**

**హైదరాబాద్, జూన్ 14, ప్రభాతవార్త:** స్టాండప్ కామెడి షోలో మృతదేహాల ప్రైవేట్ భాగాలపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు జోకులు వేసి వివాదంలో ఇరుక్కున మహిళా డాక్టర్‌పై ముంబాయిలోని కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ (కెఈఎం) ఆసుపత్రి యాజమాన్యం చర్యలు చేబట్టింది. అనాటమి తరగతుల శిక్షణ సందర్భంగా మృతదేహాల పోస్టుమార్టం సమయంలో మీరు ఎలా వ్యవహరిస్తారు ? ముఖ్యంగా మగవారి మృతదేహాల విషయంలో ఎలా స్పందిస్తారు ? అని కమెడియన్ ప్రణీత్ అడిగిన ప్రశ్నకు కెఈఎం ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యురాలు సెజల్ పవార్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సంచలనం రేపడం తెలిసిందే. జర్మనిలో జరిగిన ఓ షోకు సంబంధించి ప్రణీత్ అడిగిన ప్రశ్నలకు డాక్టర్ సెజల్ జవాబిస్తూ పోస్టు మార్టం సమయంలో మహిళా మృతదేహాలు ఎలావున్నా పురుషుల మృతదేహాల విషయంలో తామంతా బాడిల ప్రైవేటు పార్ట్‌ల కొలతలపై జోకులు వేసుకుంటూ నవ్వుతామని చెప్పారు. ఇదికాస్త వైరల్‌గా మారడం, నిమిషాల వ్యవధిలోనే ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో వీడియోల రూపంలో ప్రసారమవడం సంచలనం రేపింది. దీనిపై నెటిజన్లతో పాటు వైద్య పరిశోధనలకు మృతదేహాలను ఇచ్చిన వారి బంధువుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం అయ్యింది. మృతదేహాల పోసుమార్టం ప్రైవేటు పార్ట్‌లపై కుళ్లు జోకులు వేసిన డాక్టర్‌పై వె ంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌లు వచ్చాయి. వైద్య నిపుణులు కూడా సెజల్ వ్యాఖ్యలను తప్పుపట్టారు. దీంతో దీనిపై కెఈఎం ఆ సుపత్రి యాజమాన్యం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. మృతదేహాల పోస్టుమార్టం ప్రైవేటు పార్ట్‌లపై కుళ్లు జోకులు వేసిన డాక్టర్ సెజల్ పవార్‌ను 15 రోజుల పాటు బలవంతపు సెలవుపై పంపింది. దీనిపై ఉన్నత స్థాయి విచారణకు ఆసుపత్రి యాజమాన్యం ఆదేశించింది. డాక్టర్ సెజల్ వ్యాఖ్యలను ఆసుపత్రి యాజమాన్యం తీవ్రంగా ఖండించడంతో పాటు విచారణకు ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. ఈ విచారణ పూర్తయ్యే వరకు సదరు డాక్టర్‌ను ఆసుపత్రి క్యాంపస్‌తో పాటు హాస్టల్‌లో ప్రవేశించకుండా నిషేధం విధించింది. మరోవైపు ఈ ఘటనపై మహారాష్ట్ర సైబర్ క్రైం పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. డాక్టర్ సెజల్ పవార్, కమెడియన్ ప్రణీత్ మోర్, షోలో పాల్గొన్న హిమాన్షు జాంగ్రాలపై బిఎన్ఎస్ చట్టంతో పాటు ఐటి సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. కాగా ఈ ఘటనపై డాక్టర్ సెజల్ బహిరంగ క్షమాపణ చెప్పగా కమెడియన్ ప్రణీత్ తన సోషల్ మీడియా ఖాతాలను డీయాక్టివ్ చేశారు. ఈ ఘటన కామెడీ పేరుతో చేసే షోలకు, వ్యాఖ్యలకు ఉండాల్సిన హద్దులపై దేశ వ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది.

# ఖాకీ మాటున కామాంధుడు



**వివాహిత మహిళపై లైంగిక వేధింపులు**

**ఐజికి ఫిర్యాదు చేసిన బాధిత మహిళ**

**కేసు నమోదు చేసిన వరంగల్ పోలీసులు**

**వరంగల్ క్రైం, జూన్ 14 ప్రభాతవార్త:** వివాహిత మహిళపై వేధింపులకు పాల్పడిన ఓ ఎస్సై పై కేసు నమోదు చేసిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. నాలుగేళ్లుగా భయ భ్రాంతులకు గురి చేసి లైంగిక దాడికి పాల్పడిన వివరాలు ఇలా ఉన్నాయి వరంగల్ పోలీసు కమిషనరేట్ సిసిఎస్ విభాగంలో పని చేస్తున్న ఎస్ఐ రాజ్‌కుమార్ 2022లో హన్మకొండ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే వాడు. ఆ సమయంలో అదే ప్రాంతానికి చెందిన బాధిత మహిళ కుటుంబ కలహాల కారణంగా తన భర్త మీద మార్చి 2022లో ఫిర్యాదుచేసింది. ఇదే అదునుగా భావించిన ఎస్సై న్యాయం చేస్తానని నమ్మించి, అతడికి తెలిసిన న్యాయవాదితో భర్తకు విడాకులు ఇప్పించాడు. తర్వాత పెళ్లి చేసుకుంటానని ఆ వివాహితను నమ్మించి, లొంగదీసుకుని పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె రెండు సార్లు గర్భం దార్చలడంతో అబార్షన్ చేయించాడు. బాధిత వివాహిత పెళ్లి విషయంపై ఎస్ఐని గట్టిగా అడగడంతో న్యూడ్ ఫొటోస్‌తో బ్లాక్ మెయిల్ చేస్తూ, బెదిరింపులకు పాల్పడడం, ఆమె పనిచేసే చోటకి ఫోన్ నంబర్ లొకేషన్ తెలుసుకుని అక్కడి నుండి, బలవంతంగా తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు.

ఆమె ఫోన్ నంబర్స్ ట్రాక్ చేసి అనుమానించి వేధింపులకు పాల్పడ్డాడు. ఈ నెల మొదటి వారంలో ఎస్ఐ బాధిత వివాహితను హన్మకొండలోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడి, జీవితాంతం నాతోనే లైంగికంగా ఉండాలి, లేదంటే న్యూడ్ పిక్స్ బయట పెడతానని బ్లాక్ మెయిల్ చేశాడు. ఎస్ఐ అరాచకాన్ని భరించలేక భాదితురాలు హైదరాబాదులోని ఐజీకి ఫిర్యాదు చేసింది. ఉన్నతాధికారి ఆదేశాల మేరకు భరోసా సెంటర్‌లో మహిళా పోలీసు అధికారి బాధితురాలి స్టేట్‌మెంట్ తీసుకుని హానుమకొండ పీఎస్‌కు రిఫర్ చేశారు. ఈ మేరకు హానుమకొండ పోలీసు స్టేషన్‌లో నిందితుడు ఎస్ఐ రాజ్ కుమార్‌పై లైంగికదాడి, బెదిరింపు, చీటింగ్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ప్రస్తుతం ఎస్ఐ వరంగల్ పోలీసు కమిషనరేట్ సీసీఎస్ విభాగంలో పని చేస్తున్నాడు. ఇంతకు ముందు ఎల్కతుర్తి పీఎస్ లో పని చేసినప్పుడు అవినీతి కారణంగా సస్పెండ్ సైతం అయ్యాడు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీస్ అధికారి, న్యాయం కోసం వచ్చిన బాధితురాలిని నమ్మించి నాలుగేళ్లుగా కామవాంఛతో నరకం చూపడం వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో చర్చనీయాంశంగా మారింది.

# గోదావరిలో బోటుకు బ్రేక్..



**ఆగిన పాపికొండల యాత్ర**

**దేవీపట్నం వద్ద నిలిచిపోయిన విహార నౌక**

**89మంది పర్యాటకులు సురక్షితం**

**అప్రమత్తమైన అధికార యంత్రాంగం, మరో బోటులో తరలింపు**

**భద్రాచలం, ప్రభాతవార్త:** ప్రముఖ పర్యాటక కేంద్రమైన పాపికొండల విహారయాత్రలో ఆదివారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. 89 మంది పర్యాటకులతో ప్రయాణిస్తున్న ఒక టూరిస్ట్ బోటు గోదావరినది మధ్యలో దేవీపట్నం సమీపంలో సాంకేతిక లోపంతో ఒక్కసారిగా నిలిచిపోయింది. నడి నదిలో ఇంజిన్ మొరాయించడంతో బోటులో ఉన్న పర్యాటకులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు బోటు నిలిచిపోయిన సమాచారం అందుకున్న వెంటనే జలవనరుల శాఖ, పర్యాటక శాఖ అధికారులు, బోటు నిర్వాహకులు అప్రమత్తమయ్యారు. యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. తక్షణమే ప్రత్యామ్నాయంగా మరో బోటును ఘటనాస్థలానికి పంపించి, అందులోని 89 మంది పర్యాటకులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అటు ప్రయాణికులు, ఇటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఉదంతాన్ని తీవ్రంగా పరిగణించిన అధికారులు పాపికొండల పర్యాటక బోట్ల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల కాలంలో పర్యాటక బోట్ల నిర్వహణ, భద్రతా ప్రమాణాల లోపాలపై వరుసగా ఫిర్యాదులు వస్తుండటంతో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పాపికొండల విహారయాత్రలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. గోదావరి నదిలో నడిచే అన్ని పర్యాటక బోట్లకు సమగ్ర ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించామని, భద్రతా ప్రమాణాలు పూర్తిగా పాటి స్తున్నట్లు నిర్ధారణ అయిన బోట్లకే తిరిగి అనుమతులు జారీ చేస్తామని సంబంధిత అధికారులు తెలియజేశారు.ఫిట్‌నెస్ ధ్రువీకరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు పాపికొండల యాత్రలు నిలిచివుంటాయని వెల్లడించారు. అదేవిధంగా దేవీపట్నం సమీపంలో బోటు నిలిచిపోవడానికి గల అసలు సాంకేతిక కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పర్యాటకుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# నన్ను తరిమికొట్టే వ్యక్తి ఈ గడ్డ మీద పుట్టలేదు

### ప్రభుత్వ వైఫల్యాలపై నిప్పులు చెరిగిన కిషన్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 14 ప్రభాతవార్త :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి మరోసారి మండిపడ్డారు. ఆదివారం అంబర్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. పార్టీ జెండాను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆవిష్కరించారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడారు. అంబర్ పేటలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ మెట్రో రైలుకు కేంద్రం నిధులిచ్చిందని అన్నారు. మెట్రోకు నిధులివ్వకుంటే తాము రాజీనామా చేస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని మీరు రాజీనామా చేస్తారా అని సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. తనను తరిమికొడతానని సిఎం రేవంత్ రెడ్డి అంటున్నారని, నన్ను తరిమికొట్టే వ్యక్తి ఈ గడ్డ మీద పుట్టలేదులేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన కిషన్ రెడ్డి, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ గాలిలో కలిసిపోయాయని విమర్శించారు. నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2,500 ఆర్థికసాయం, దళిత కుటుం బాలకు రూ.12లక్షల సాయం, రైతులకు బోనస్ వంటి హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తున్నా, వాటి ని సద్వినియోగం చేసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ముఖ్యంగా అంబర్‌పేట్ ఫ్లైఓవర్ కింద చెత్త, మట్టి తొలగింపులో ప్రభుత్వం రాజకీయ అడ్డంకులు సృష్టి స్తోందని ఆయన ఆరోపించారు. ఫ్లైఓవర్ కింద బ్యూటిఫికేషన్ పనులను అడ్డుకుంటున్నారని, ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత అని హెచ్చరించారు. అంబర్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలు తనను గతంలో ఎంతో ఆదరించి, ఎమ్మెల్యేగా గెలిపించి పార్టీకి కొండంత అండగా నిలిచారని గుర్తు చేశారు. అంబర్‌పేట్ అభివృద్ధిలో బీజేపీ పాత్ర ఎంతో కీలకమని,తమ హయాంలో 21 ప్రభుత్వ పాఠశాలలు, వందకు పైగా కమ్యూనిటీ హాల్స్, బీసీ హాస్టల్, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఫ్లైఓవర్లు, పార్కులు నిర్మించామనితెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీమంత్రి సి.క్రిష్ణయాదవ్, బీజేపీ రాష్ట్రప్రధానకార్యదర్శి గౌతమ్ రావు, బీజేపీ నాయకులు రమేష్‌యాదవ్, దీపక్ రెడ్డిపాల్గొన్నారు.



ఆదివారం అంబర్‌పేట నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



## నేటి నుంచి స్కూళ్లు ఆరంభం

### ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ అమలు

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 14:** తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాలలు నేడు(సోమవారం) పునః ప్రారంభం కానున్నాయి. 52 రోజుల వేసవి సెలవుల అనంతరం తిరిగి సోమవారం నుంచి బడిగంట మోగనుంది. ఇప్పటి వరకు రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కొనసాగుతుండగా.. ఈ ఏడాది నుంచి ఉదయం పూట విద్యార్థులకు అల్పాహారం(బ్రేక్‌ఫాస్ట్)తోపాటు పాలను కూడా అందించనున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, యుఆర్ఎస్‌లతో పాటు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు కూడా వేసవి సెలవులు కొనసాగాయి. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన వేసవి సెలవులు ఏప్రిల్ 24 నుంచి ప్రారంభమై జూన్ 11 వరకు వేసవి సెలవులు కొనసాగనున్నట్టు 2025-26 విద్యా సంవత్సరం అకడమిక్ క్యాలెండర్‌లో ప్రకటించారు. 49 రోజుల వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు జూన్ 12న పునః ప్రారంభవుతాయని ప్రకటించారు. 2026-27 విద్యా సంవత్సరం ఈ నెల 12 నుంచి ప్రారంభం కావల్సి ఉన్నప్పటికీ .. ప్రభుత్వానికి అందిన విజ్ఞప్తుల మేరకు పాఠశాలలను ఈ నెల 12 నుంచి కాకుండా ఈ నెల 15 నుంచి పునః ప్రారంభించాలని నిర్ణయించినట్టు పాఠశాల విద్య శాఖ డైరక్టర్ నవీన్ నికోలస్ ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 13 రెండోవ శనివారం, 14 ఆదివారం వస్తున్నందున, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఈ నెల12కు బదులుగా ఈ నెల15న తిరిగి తెరవాలని నిర్ణయించనట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు. పాఠశాలల పునఃప్రారంభం వాయిదా పడటం వలన కోల్పోయిన విద్యా సమయాన్ని భర్తీ చేయడానికి 2026-27 విద్యా క్యాలెండర్ ప్రకారం నిర్దేశించిన బోధనా దినాలను ఖచ్చితంగా పాటించేలా చూసేందుకు, పాఠశాల విద్యాశాఖ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు జుల నెలో రెండవ శనివారంఅయిన (తేది 11.07.2026)ను సాధారణ పనిదినంగా పరిగణించాలని నిర్ణయించినట్టు డైరక్టర్ ప్రకటించారు. రాష్ట్రంలో 24,672 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా సుమారు 11వేల వరకు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నీ కూడా ప్రారంభంకానున్నాయి.

## రేపు రూ.2వేల కోట్ల రుణం

### రిజర్వ్ బ్యాంక్‌కు ఆర్థిక శాఖ ఇండెంట్

**హైదరాబాద్, జూన్ 14, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2 వేల కోట్ల రుణ సమీకరణకు సిద్ధమైంది. ఈ నెల 16న బహిరంగ మార్కెట్లో నిర్వహించనున్న సెక్యూరిటీ బాండ్ల వేలంలో పాల్గొని ఈ మేరకు రుణాన్ని సేకరిస్తామని ఆర్థిక శాఖ తమకు ప్రతిపాదనలు పంపినట్టు ఆర్బీఐ వెల్లడించింది. ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలోని ఏప్రిల్ నెల నుండి జూన్ వరకూ కలిగిన తొలి త్రైమాసికంలో రూ.18,900 కోట్ల రుణాలు సమీకరిస్తామని రిజర్వ్ బ్యాంక్‌కు ప్రతిపాదనలు పంపించింది. ఇందులో భాగంగా ఇప్పటికే రూ.16,900 కోట్ల రుణాలు సేకరించిన సర్కార్ మిగిలిన రూ.2 వేల కోట్ల రుణాన్ని వచ్చే మంగళవారం సమీకరించనున్నది. ఇప్పటి వరకూ సమీకరించిన రుణాల్లో ఏప్రిల్ 7వ తేదీన రూ.3,900 కోట్లు, 21న రూ.3 వేల కోట్లు, మే నెల 5న రూ.4 వేల కోట్లు, 19న రూ.2 వేల కోట్లు, ఈ నెల 2వ తేదీన రూ.4వేల కోట్లు చొప్పున మొత్తం రూ.16,900 కోట్ల మేర రుణాలు సేకరించింది. తాజాగా ఇప్పుడు మరో రూ.2 వేల కోట్లను సేకరించ నుండటంతో ఈ క్వార్టర్‌లో ఇంతవరకూ రూ.18,900 కోట్ల రుణాన్ని సేకరించినట్లవుతుంది. కాగా తెలంగాణ ప్రభుత్వం తన అవసరాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల కోసం వివిధ మార్గాల ద్వారా నిధులు సమీకరిస్తోంది. ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి పాత అధికవడ్డీ రుణాలను తక్కువ వడ్డీలకు రీఫైనాన్స్ చేసుకోవడంపై కూడా దృష్టి సారించింది,



## మారిన ఆర్మీ యూనిఫాం

### బ్రిటిష్ ఆనవాళ్లకు చెక్..దేశీయ శైలిలో దుస్తుల రూపకల్పన

**న్యూఢిల్లీ, జూన్ 14:** ఇండియన్ ఆర్మీ వలసవాద ఆనవాళ్లను పూర్తిగా చెరిపేస్తూ డ్రెస్ కోడ్‌లో పలు కీలక మార్పులు చేసింది. కొత్తగా మెడ వరకు మూసి ఉండే కోటు (బండీజాకెట్)ను ప్రవేశపెట్టారు. దీనిని ఫుల్ స్లీవ్‌షర్టు, ఫార్మల్ ఫ్యాంట్, షూస్‌పై ధరించాల్సి ఉంటుంది. ఈ విధంగా మొదటిసారి దేశీయ శైలిలో ఆర్మీ అధికారుల దుస్తులు ఉండేలా మార్పులుచేసింది. ఇకపై గణతంత్ర దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం, ఆర్మీడే,గార్డ్‌ఆఫ్‌హానర్ లాంటి ముఖ్యమైన కార్యక్రమాల్లో మాత్రమే పరేడ్ కమాండర్లు, కంటింజెంట్ కమాండర్లు, నిర్దేశిత సిబ్బంది మాత్రమే ఖడ్గాలు పట్టుకుంటారు. రివ్యూయింగ్ అధికారులు మాత్రం ఖడ్గాలు ధరించకూడదని నిబంధన పెట్టారు. ఇక శీతాకాలంలో ధరించేందుకు కొత్తగా బాటిల్ జాకెట్‌ను ప్రవేశపెట్టారు.అయితే వీటిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు మూడు ఏళ్లు గడువు ఇచ్చారు. 2029 జూన్ నాటికి ప్రస్తుతం ఉన్న పాత స్వెటర్ల స్థానంలో వీటిని అందరు సైనికులకు అందుబాటులోకి తెస్తారు. బ్రిటిష్ కాలం నాటి 'రాయల్' పదాన్ని, రివ్యూయింగ్ ఆఫీసర్లు కత్తి పట్టుకునే విధానాన్ని రద్దు చేసింది. భారత సార్వభౌమాధికారాన్ని గుర్తుచేసే విధంగా సివిల్ డ్రెస్‌లో స్వదేశీ 'బంది' జాకెట్, చలికాలం కోసం కొత్తగా 'బ్యాటిల్ జాకెట్' ప్రవేశపెట్టింది. ఈ మార్పులన్నింటినీ తాజాగా విడుదల చేసిన 'ఆర్మీ యూనిఫామ్స్ 2026 పాంప్లెట్‌లో సవివరంగా పొందుపరిచింది. ఈ మార్పులు చేయడానికి గల కారణాన్ని 'స్వదేశీకరణ, జాతీయ నైతికతతో అనుసంధానం' అనే అధ్యాయంలో స్పష్టంగా వివరించారు. దేశ ప్రజల సెంటిమెంట్లు, మారుతున్న మన దేశ గుర్తింపును దృష్టిలో ఉంచుకొని, ఈ సంస్కరణలు చేసినట్లు పేర్కొన్నారు.అలాగే, ఆర్మీ పరిధిలోని 246 రోడ్లు, భవనాలకు ఉన్న బ్రిటిష్ పేర్లను తొలగించి మన వీరుల పేర్లను పెట్టింది. ఇందులో 124రోడ్లు, 77కాలనీలు, 27భవనాలు, పార్కులు, మైదానాలు, హెలిప్యాడ్‌లు ఉన్నాయి. ఇప్పటివరకు వీటికున్న బ్రిటీష్ అధికారుల పేర్లు తీసేసి, మన దేశం కోసంప్రాణాలు అర్పించిన పరమవీరచక్ర గ్రహీతల, యుద్ధ వీరుల పేర్లు పెట్టారు.ఇందులో భాగంగా కోల్‌కతాలోని ప్రసిద్ధ ఫోర్ట్ విలియం పేరును విజయ్ దుర్గ్‌గా మార్చింది.

## ప్రమాదకర పురుగుమందులను నిషేధించాలి

### తెలంగాణ రైతు సంఘం డిమాండ్

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 14:** రాష్ట్రంలో ప్రమాదకర పురుగు మందులు, కలుపుమందులపై ప్రభుత్వం సంపూర్ణ నిషేధం విధించాలని తెలంగాణ రైతు సంఘం (ఏఐకెఎస్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పంటను రక్షించుకునే క్రమంలో రైతులు వాడుతున్న విషపూరిత పురుగుమందుల వల్ల రైతులతోపాటు రైతు కుటుంబ సభ్యులు, మరికొందరి ప్రజల ఆరోగ్యాల మీద తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అనేక అధ్యయనాలు చెబుతున్నాయని, వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారం పేరుతో రైతులను కార్పొరేట్ కంపెనీలు ఉత్పత్తి చేసే రసాయనాల బానిసలుగా మార్చడం సరికాదని సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని కార్పోరేట్‌లకు అప్పచెప్పేందుకు రైతుల ఆరోగ్యం, ప్రజల ఆరోగ్యం, నేల సారవంతాన్ని, పర్యావరణ పరిరక్షణను గాలికొదిలేస్తున్నదని ఆరోపించారు. ఇటీవల వెలువడిన పలు అధ్యయనాలు, మీడియా కథనాలు, వైద్య నిపుణుల హెచ్చరికలు రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ ప్రజల ఆరోగ్యంపై రసాయన పురుగుమందులు, కలుపు మందులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. క్యాన్సర్లు, కిడ్నీ వైఫల్యాలు, శ్వాసకోశ వ్యాధులు, రక్తహీనత, చర్మవ్యాధులు, నాడీ సంబంధిత సమస్యలు గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోందన్నారు.

వార్త

విశ్వవిద్యాలయాల్లో చదివిన వారు, పట్టాలు పుచ్చుకున్నవారు మాత్రమే విద్యావంతులు కారు. గద్దుకాలంలో తొణకనివారు, సామాజిక వ్యవహారాల్లో తెలివిగా ఉండేవారు కూడా విద్యావంతులే.

- లావోసు

# రాచపుండుకు ధరల సలుపు!

బతుకగలిగినంత కాలమే కాదు బతకాలనుకున్నంత కాలం కేన్సర్ మహమ్మారి మానవాళి దరి చేరకపోవడం వైద్యశాస్త్ర అద్భుతం. అలనాడు రాచపుండుకు వైద్యం లేదు. ఆధునిక వైద్య విధానంలో కేన్సర్‌ను ముందుగా కన్గకొని వైద్యం చేయడంతో రోగి జీవన ప్రమాణాన్ని పెంచగలుగుతున్నారు. అది సంప్రదాయ వైద్యమా? ఔషధ సేవనమా? కీమోథెరపీలా? ఎలాంటి చికిత్సకైనా కేన్సర్ లొంగుతుందనే ప్రజల్లో నమ్మకం కలిగించడంలో ఎంతో మంది వైద్యులు కృతకృత్యులయ్యారు. అందుకే కేన్సర్‌చికిత్సలో అధునాతన శాస్త్రీయ చికిత్సలు రోగుల్లో ఆశలు రేపుతున్నాయి.వచ్చింది కేన్సర్ కదా! దాని ప్రస్థానం అంతిమయాత్రేనని బాధపడుతూ వైద్యం ఎందుకులే డబ్బులు దండుగ అనే ఆలోచన నుండి చాలా మంది బయటపడిపోయారు. భారత్‌లో గత పదేళ్లకాలంలో మహిళల్లో కేన్సర్ రుగ్మత బాగా పెరిగింది. 2024లో 7.8లక్షల మంది మహిళలే కేన్సర్ బారినపడ్డారు. ఆధునిక శాస్త్రీయ పరిశోధనలు కేన్సర్ కణ నిర్మూలనకు వీలైన వినూత్న చికిత్సలను అందుబాటులోకి తెచ్చాయి. కేన్సర్ మూలకణాలను, రూపాలను, దశలను కనుగొనేందుకు 'పెట్' స్కాన్‌లు అందుబాటులోనే ఉన్నాయి. ఇన్ని సౌకర్యాలున్నా కేన్సర్ నివారణ ఔషధాలు సామాన్యుడికి అందకుండాపోతున్నాయి. ఎన్నో ఔషధాలకు జనరిక్ ఔషధాలను సామాన్యుడికి అందించగలుగుతున్నా కేంద్ర ప్రభుత్వం కేన్సర్ రోగులకు చౌకధరకు ఔషధాలు అందించడంలో వెనుకబడింది. తాజాగా కేన్సర్ నిరోధక ఔషధాలను 50 శాతం పెంచాయి. రానురాను ఆధునిక వైద్య చికిత్సలు తక్కువ ఖర్చుకే అందుబాటులోకి రావడంతో కేన్సర్ రోగాల్లో తమ జీవన ప్రమాణంపై ఎంతో భరోసా ఏర్పడి మనో వ్యాకులత లేకుండా దర్జాగా కాలం గడిపేస్తున్నారు. ఎంతో ధీమాగా ఉన్నారు. కేన్సర్ అధునాతన చికిత్సలు వ్యాధి నిర్ధారణ పరికరాలు ఎన్నెన్నో ఆవిష్కరణలు సమాజానికి అందుతున్న వేళ ఔషధ ధరలు పెరిగిపోవడం అత్యంత విచారకరం. కేన్సర్ మందులు, టెటనస్ సీరం, చిన్న పిల్లల వాక్సిన్‌ల ధరలను ఒక్కసారిగా 50 శాతం పెంచుతూ జాతీయ ఫార్మాస్యూటికల్ ధరల నియంత్రణ అధారిటీ (ఎన్.పి.పిఎ) తీసుకున్న నిర్ణయం కేన్సర్ రోగులు మీద శరాఘాతమే. వీరి రోగ చికిత్సలో ఒక్క డోస్ ఆలస్యమైనా రోగి ప్రాణాలపై ప్రభావం చూపుతుంది.పెరిగిన ధరల ప్రభావమూ ప్రాణాంతకమే. ఈ రెండు సమస్యలూ రోగిని చావనివ్వక, బతుకనివ్వక త్రిశంకు నరకంలో ఉంచే పరిస్థితి కాగలదు. ఒకపక్క ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సామాన్యుడి ప్రయోజనాలు కాపాడే వైపుగా తీసుకుకెళ్లే లక్ష్యంతో ముందుకు సాగుతుంటే అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మూలిగే నక్కపై తాడిపండు పడ్డ చందంగా కనపడుతోంది. ప్రస్తుత దేశ కాలమానఆరోగ్య వాతావరణ పరిస్థితుల్లో కీలక ఆంకాలజీ ఔషధాలు, ఇమ్యూనో గ్లోబులిన్ ఇంజెక్షన్‌లు వ్యాక్సిన్‌ల గరిష్ట ధరలను సవరించడం అవసరమని ఔషధ తయారీదారుల వాదన. కానీ ఒక్కసారిగా ఈ భారం రోగి తట్టుకోలేనిది. దేశంలో కేన్సర్ చికిత్స పొందుతున్న 35 లక్షల మంది రోగులది మోయలేని దైన్యం. సిస్ప్లాటిన్, కార్బోప్లాటిన్ మందులు కేన్సర్ రోగనివారణలో కీలకంగా వాడుతుంటారు. ఇవి రెండూ కీమోథెరపీ ఔషధాలు. ఈమందుల ధరల పెంపులో వాడే అతిఖరీదైన 'ప్లాటినం' ముడి సరుకుల గురించి చెప్పచ్చునేమోకానీ మిగిలిన ఔషధాల ధరలు అదే స్థాయిలో పెంచడం అంత సమర్థనీయం కాదు. పెరిగిన ఉత్పత్తివ్యయాల విషయంలో మందుల తయారీదారులు ఆందోళన కాదనలేం.కానీ కేన్సర్ రోగుల మీద పడే భారం గురించి ప్రభుత్వమే ఆలోచించాలి. లేకుంటే ప్రధాని తన మానస పుత్రికగా చెప్పుకునే 'ఆయుష్మాన్ భారత్' పథకం లక్ష్యం నెరవేరనట్లే! ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలు అందనంత ఆకాశంలో ఉంటే ఆపథకం ప్రయోజనాలు సామాన్యుడికి చేరకుండా దూరంగా జరగడం ప్రభుత్వ ప్రతిష్టకు అంత మంచిది కాదు. ఆయుష్మాన్ భారత్ పథకంలో 5 లక్షల రూపాయల మేరకు నగదు రహిత వైద్యంతోపాటు కేన్సర్ శస్త్రచికిత్సలు,కీమోథెరపీ, రేడియోథెరపీ వంటి సేవలున్నాయి. ఇప్పుడీ ప్రాణాంతక వ్యాధులను నయంచేసే ఔషధాల ధరలుపెంచిన నేపథ్యంలో కేన్సర్ రోగుల బతుకు అంధకారం కాకుండా చూసుకునే బాధ్యత కేంద్రప్రభుత్వం మీదఉంది.ఒకవైపు ప్రభుత్వం ధరలను నియంత్రించాలని చూస్తూ మరోపక్క తయారీదారుల లాభదాయకతను దృష్టిలో ఉంచుకుని, వారికి నష్టాలొస్తే ప్రాణాధార ఔషధ ధరల ఉత్పత్తి ఆగిపోతుందన్న భయంతో కేంద్రంవారికి అవసరమైన విధంగా ధరల సర్దుబాటు చేయడం భారతీయ ఆరోగ్య విధానంలో వైరుధ్యం ఉన్నట్లు స్పష్టమౌతోంది. కేన్సర్ నివారణలో కీలక మందులు ఉత్పత్తి, సరఫరా సాధ్యాసాధ్యాల రీత్యానే ప్రాణాధార మందుల ధరలు పెంచాల్సిన అవశ్యకత ఏర్పడిందని ఎన్‌పిపిఎ వివరణనిస్తోంది. కర్ర విరగదు పాము చావదు' అన్నరీతిలో కాకుండా పేదలకు ప్రాణాధారాల మందులు అందుబాటులో ఉంచే విధంగా కేన్సర్ నివారణ 'ఔషధ సబ్సిడీ'ని ప్రవేశపెట్టడం కేంద్ర ప్రభుత్వం తక్షణకర్తవ్యం. ఇప్పుడు పెరిగిన ధరల నేపథ్యంలో ఆయుష్మాన్ భారత్ వైద్యప్యాకేజిల మీదకూడా పడుతుంది. ఆసుపత్రులు ఒత్తిడి తట్టుకోలేక చేతులు ఎత్తేస్తే తొలుత ఇబ్బంది పడేది పేదరోగులే. భారత్‌లో దొరికే ఆధునిక వైద్యం కోసం ఎంతోమంది విదేశీయులు కూడా వస్తుండడమే మెడికల్ టూరిజంకానీ వైద్యం ఖరీదౌతోందని తెలిస్తే వెనుకంజే తప్ప వారికి గత్యంతరం లేదు. ఆయుష్మాన్ భారత్ వైద్య సౌకర్యాలకు, ఔషధ ధరలకూ మధ్య పొంతన కుదరక ధరల చట్టంలో రోగి సతమతమవకుండా పథకాన్ని పునర్నిర్వచించాలి.

చేజారిన ఓ నిమిషాన్ని భూమిపై ఉండే సిరిసంపదలేవీ తిరిగి చేకూర్చజాలవు.



- మార్టిన్ లూథర్ కింగ్

దేనినైనా ఆశించబోయే ముందు అందుకు కావలసిన అర్హతను సంపాదించుకో.



- బర్ట్రండ్ రస్సెల్

# ఆధార్‌తో 'సర్'ను సరిచేయలేమా!

**ప్రతి చిన్న విషయానికి గుర్తింపు కార్డుగా ఆధార్ కార్డును ఉపయోగిస్తున్నారు. ఎవరైనా ఆధార్ కార్డు ఉన్నచోటే ఓటు హక్కును కూడా కలిగి ఉండటం మంచిది. ఒకవేళ ఆధార్ కార్డు ఒక అడ్రస్‌లో ఉండి, ఓటుహక్కు ఇంకొక అడ్రస్‌లో ఉంటే ఆధార్ కార్డు అడ్రస్‌ను త్వరితగతిన సులభంగా మార్చుకునే అవకాశం కల్పించాలి. దీంతో అనేక సమస్యలు పరిష్కారం అవుతాయి. అప్పుడు మాత్రమే ఓటర్ల జాబితా ప్రక్షాళన అనేది బాగా జరుగుతుంది. ఏది ఏమైనా ఓటర్ జాబితా ప్రక్షాళనలో బిఎల్ ఓ లు, వారి పైఅధికారులు, బిఎల్ఏలు ,రాజకీయ పార్టీలు ప్రజలు నిష్పక్షపాతంగా, నిజాయితీగా వ్యవహరించినట్లయితే ఓటరు జాబితా పూర్తిగా ప్రక్షాళన అవుతుంది. అప్పుడే 'సర్' లక్ష్యం నూటికి నూరు పాళ్లూ నెరవేరినట్లే.!**

డాక్టర్ టి .సేవకుమార్

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్)మూడవ దశ జూన్ నెలలో కొన్ని ఇతర రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ప్రారంభం కాబోతోంది. ఇందులో ఎన్నో దశల ప్రక్రియలు ఉన్న,ముఖ్యంగా నెలరోజుల పాటు బూత్ లెవెల్ ఆఫీసర్స్ (బిఎల్ఓలు) ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ పత్రాలుఇచ్చి, పూర్తి చేసిన తర్వాత వాటిని స్వీకరించి, ఆ పత్రాలను ఇచ్చిన వారికే ఓటు హక్కు కల్పించడంలో కీలక పాత్ర పోషించబోతున్నారు. గతంలో 2002లో మన ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన ఈ సమగ్ర సవరణను 24ఏళ్ల తర్వాత మళ్లీ 2026లో మన తెలుగు రాష్ట్రాలలో చేపడుతున్నారు. దేశ స్వాతంత్రానంతరం జరుగుతున్న11వ సమగ్ర సవరణ ఇటీవల 2025లో తొలిసారిగా బీహార్‌రాష్ట్రం నుంచి ప్రారంభించారు.ఈ సవరణలో ఆ రాష్ట్రంలో సర్వసాధారణ గుర్తింపు కార్డుగా భావించే ఆధార్ కార్డును అంగీకరించకుండా ఈసీ సూచించిన మొత్తం 11రకాల కార్డులు, పత్రాలను ఆమోదించి ఓటు హక్కును కల్పించడంతో రాజకీయ పార్టీలలో కలవరం మొదలైంది. అదే లేకుంటే సర్ సజావుగా సాగిపోయేది. 20సంవత్సరాల వ్యవధిలో ఈసీ ప్రకటించిన గణాంకాల ప్రకారం చనిపోయిన వారు, డూప్లికేట్ ఓటర్లు, వివిధ కారణాలతో రాష్ట్రం పరిధి దాటి వెళ్లి పోయినవారు, ఇంకా అసలు ఆచూకీ తెలియని వారు మొత్తం 68లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. ఈ విషయంలో ఈసీ, ప్రతిపక్ష పార్టీల మధ్య పెద్ద యుద్ధమే జరిగింది. రాహుల్ గాంధీ 'ఓట్ చోర్' యాత్రకు అంకురార్పణకు ఈ తకరారుతో మొదలు, దేశవ్యాప్త ప్రతిపక్షాల నిరసనలు సర్‌పై ప్రభావం చూపలేకపోయాయి. రెండో దశలో మరి కొన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జరిగింది. ఈ దశలో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన రభస ఏ రాష్ట్రంలోనూ జరగలేదు. 90లక్షలకు పైగా ఓట్లను తొలగించారు. ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా, ఈ అంశంలో ఏర్పడిన సందేహాలపై సుప్రీంకోర్టులో వాదించారు కూడా. చివరికి ఈసీ, టిఎంసి, బిజెపిల పరస్పర ఆరోపణలు, దాడులు సుప్రీంకోర్టుకే తలనొప్పి తెప్పించాయి. ముఖ్యంగా'సర్' లో చాలా రాష్ట్రాలలో అధికార పక్షం, ప్రతిపక్షాల ఓటర్లను గుర్తించి..ఆయా రాష్ట్రాలలో రాజకీయ పార్టీల అధికారమే లక్ష్యంగా..కొందరి ఓటర్లను కొందరు కావాలనే ఉద్దేశపూర్వకంగా ,అక్రమంగా తొలగించారన్నది ప్రస్తుత ప్రధాన ఆరోపణ. ఈ ఆరోపణలలో వాస్తవం లేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత 'సర్' పై అంటే ఈసీ పై నే ఉంది. ఇటీవల సుప్రీంకోర్టు'సర్' చట్టబద్ధమైనదని ఆ హక్కు ఈసీకి ఉందని తేల్చి చెప్పింది. ఈసీ మాత్రం తన పని తాను చేసుకుపోతూనే ఉంది. ఇక అసలు విషయానికి వస్తే.. మన రెండు తెలుగురాష్ట్రాల్లో దేశ సరిహద్దు రాష్ట్రాలైన బీహార్, పశ్చిమ బెంగాల్‌లలో లాగా ఎక్కువ మంది అక్రమ వలసదారులు ఉండకపోవచ్చు. అయితే హైదరాబాద్ వంటి నగరాలలో అక్రమ వలసదారులుకొందరు ఉండవచ్చు. ఇటీవల ఉగ్రవాదుల మూలాలు విజయవాడలో గుర్తించాక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అక్రమవలసదారులు లేరనే నిర్ణయానికి రాలేని పరిస్థితి. ఈ నేపథ్యంలోసర్ ఓటర్ల జాబితా ప్రక్రియలోలోపాలు ఎక్కడ ఉంటున్నాయి?ఎవరు,ఎలా సరిదిద్దాలి? అనే అంశంపై చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్క భారతీయ పౌరుడికి ఓటు హక్కు కల్పించాలన్న రాజ్యాంగబద్ధహక్కును ఎలా పరిరక్షించుకోవాలనే అంశంపై దృష్టి సారించాలి. ఇతర రాష్ట్రాల్లోని అనుభవాలను స్వీకరించి ,అధ్యయనం చేసి లోపరహిత ఓటర్ జాబితా తయారు చేయవలసిన కర్తవ్యం ఈసీ,ప్రభుత్వ అధికారుల పైన ఉంటే... అందుకు పూర్తిగా సహకారం అందించవలసిన బాధ్యత ప్రజల పైన, రాజకీయ పార్టీల పైన ఉందన్నది వాస్తవం. ఆ బాధ్యత



యుత, కర్తవ్య నిర్వహణలో భాగంగా ప్రభుత్వ అధికారులతో పాటు ,ఈసీ గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలకు భాగస్వామ్యం కల్పించింది. ఆ జాతీయ ,రాష్ట్ర పార్టీల తరపున బూత్ లెవెల్ ఏజెంట్ (బిఎల్ఏ)లను నియమించుకునే అవకాశం కల్పించింది. అంతేగాక వీరికి ఈసీ,సర్‌పై పూర్తిస్థాయి శిక్షణ కూడా ఇస్తున్నారు. జూలై 1 నాటికి 18 సంవత్సరాలు నిండిపోతున్న వారు కూడా ఎన్యుమరేషన్ పత్రం ద్వారా ఓటు హక్కు పొందే అవకాశం కల్పించారు. ఎవరైతే ఆమోదించబడిన ధ్రువీకరణ పత్రాలతో ఎన్యుమరేషన్ పత్రాలను తిరిగి ఇస్తారో...వారికే ఓటు హక్కు కల్పించడం జరుగుతుందని ఈసి స్పష్టం చేసింది. తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్ళిన వారికి ఆన్ లైన్ లో కూడా సంబంధిత పత్రాలతో ఓటు హక్కును నమోదు చేసుకునే అవకాశం కల్పించింది.అంతేగాక కుటుంబ యజమాని కూడా వారి తరపున ఎన్యుమరేషన్ పత్రానికి, సంబంధిత ధ్రువీకరణ పత్రాలనుజతచేసి గార్డియన్‌గా సంతకంచేసి ఇచ్చే అవకాశం కూడా కల్పించింది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే చనిపోయిన వారి తరపున, మరోచోట ఓటుఉన్న వారి తరపున ఎన్యుమరేషన్ పత్రాలను పూర్తి చేసి ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఇస్తే వారి ఓట్లను గుర్తించి తొలగించడం ఎంతవరకు సాధ్యమన్న విషయాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఒక యాప్ ద్వారా జరుగుతోన్న ఈ తతంగంలోనే అసలు సమస్య మొదలవుతుంది. ఆధార్‌కార్డును పరిగణలోకి తీసుకోకపోవడం వల్ల డూప్లికేట్ ఓట్లను తొలగించే అవకాశం తగ్గిపోతుంది. డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీ ద్వారా కంప్యూటర్లో కొన్ని డూప్లికేట్ ఓట్లను గుర్తించిన, సరైన నిర్ధారణ లేకుండా తొలగించలేకపోతున్నారు. ఎన్నికల సంఘం నిర్వహించిన గత స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో అనేక లోపాలు ఉన్నాయి.చనిపోయిన వారిని ఓటర్ లిస్ట్‌నుండి తొలగించడంలో బిఎల్ఓలు అనేకఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఒక ఓటర్‌ను తొలగించాలంటే 2024 ఎన్నికలకు ముందు ఎన్నో నిబంధనలు ఉన్నాయి. తర్వాత వాటిని కొంతమేర సవరించారు.డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీలను గుర్తించి వారి డూప్లికేట్ ఓట్లను కొంతవరకు బయటకు తీశారు. మీరు ఎక్కడ ఓటు ఉంచుకోవాలనుకుంటున్నారో తెలుపమనివారికి అప్పుడు నోటీసులు జారీ చేశారు. అందులో కొద్ది మంది మాత్రమే స్పందించారు. మరికొద్దిమంది అసలు స్పందించలేదు. డూప్లికేట్ ఓటర్ ను కచ్చితంగా తొలగించాలి అంటే ఆధార్ కార్డుతో అనుసంధానం ఒకటే మార్గం. అయితే సర్‌లో ఆధారకార్డును ఒక గుర్తింపు కార్డుగా మాత్రమే ఉపయోగించాలి గాని, పౌరసత్వం నిర్ధారణ కోసం ఉపయోగించకూడదని... ఆధార్ కార్డు ఉన్నంత మాత్రాన ఓటు హక్కు కల్పించబోమని చెప్పడం కుదరదని సుప్రీం కోర్టు ఆదేశాలు ఉండటంతో ఆధార్‌కార్డు ద్వారా డూప్లికేట్ ఓట్లను తొలగించడంలో కొంత స్పష్టత ఏర్పడింది. సర్‌లో కుటుంబ యజమాని ప్రస్తుతం ఇంట్లోలేని వ్యక్తుల ఎన్యుమరేషన్ పత్రాలను పూర్తిచేసిఇచ్చే అవకాశం కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో నియమించే బిఎల్ఏలకు అక్కడ ఓటర్లందరూ తెలిసి ఉండే అవకాశం ఉంటుంది. అర్బన్ ఏరియాలో ఆ పరిస్థితి లేదు .నేడు తమ ఇంటి పక్కన ఎవరు ఉంటున్నారో కూడా తెలియని పరిస్థితి నగరాలలో నెలకొనిఉంది.ఈ నేపథ్యంలో అర్బన్ ఏరియాలో డూప్లికేట్ ఓట్లను తొలగించడం కోసం గుర్తింపు కార్డుగా ఆధార్ కార్డు ఉపయోగిస్తే డూప్లికేట్ ఓట్లు తొలగించడం చాలా సులభతరం అవుతుంది.సుప్రీంకోర్టు ఆధార కార్డును పౌరసత్వ నిర్ధారణకు ఉపయోగించకూడదని చెప్పిందే కానీ డూప్లికేట్ ఓట్లను తొలగించటంలో ఉపయోగించ వద్దని చెప్పలేదు. నేడు ఆధార్ కార్డు భారతదేశంలో ,తెలుగు రాష్ట్రాల్లో లేనివారు దాదాపు లేరనేచెప్పాలి.పుట్టిన తర్వాత కొద్ది రోజులకే ఆధార్ కార్డు తీసుకుంటున్నారు. ప్రతి చిన్న విషయానికి గుర్తింపు కార్డుగా ఆధార్ కార్డును ఉపయోగిస్తున్నారు. ఎవరైనా ఆధార కార్డు ఉన్నచోటే ఓటు హక్కును కూడా కలిగి ఉండటం మంచిది. ఒకవేళ ఆధార్ కార్డు ఒక అడ్రస్‌లో ఉండి, ఓటుహక్కు ఇంకొక అడ్రస్‌లో ఉంటే ఆధార కార్డు అడ్రస్ ను త్వరితగతిన సులభంగా మార్చుకునే అవకాశం కల్పించాలి. దీంతో అనేక సమస్యలు పరిష్కారం అవుతాయి. అప్పుడు మాత్రమే ఓటర్ల జాబితా ప్రక్షాళన అనేది బాగా జరుగుతుంది. ఏది ఏమైనా ఓటర్ జాబితా ప్రక్షాళనలో బిఎల్ ఓ లు,వారి పై అధికారులు, బిఎల్ఏలు ,రాజకీయ పార్టీలు ప్రజలు నిష్పక్షపాతంగా, నిజాయితీగా వ్యవహరించినట్లయితే ఓటరు జాబితా పూర్తిగా ప్రక్షాళన అవుతుంది. అప్పుడే 'సర్' లక్ష్యం నూటికి నూరు పాళ్లూ నెరవేరినట్లే.! ●

# అపరిశుభ్రతకు నిలయాలుగా ప్రభుత్వ ఆసుపత్రులు!


బుగ్గన మధుసూదనరెడ్డి

మన రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి పట్ల ఎంతో శ్రద్ధాశక్తులు కనబరుస్తూ అక్కడి పరిసరాల పరిశుభ్రతను, మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు తగిన బడ్జెట్ ఏర్పాటు చేసి ఎన్నో చర్యలు తీసుకుంటున్నప్పటికి ప్రభుత్వ అసువత్రిలోని కొంతమంది సిబ్బంది నిర్లక్ష్య వైఖరి మూలాన అక్కడి రోగుల వార్డులు ఎలుకలకు, దోమలకు, పాములకు, విషసర్పాలకు నిలయాలుగా మారుతూ అక్కడికి వైద్య నిమిత్తమై వస్తున్న రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వార్డులు ఒక నరకకూపంగా మారుతుండటం కడు శోచనీయం.ప్రయివేటు వైద్యశాలల్లో చికిత్స శక్తికి మించిన పని కావడంతో బీద,బిక్కి,నిరుపేదలు తప్పనిసరి పరిస్థితుల్లో వైద్యం చేయించుకునే నిమిత్తమై ప్రభుత్వ ఆసుపత్రులకు నిత్యం ఎంతో దూర ప్రాంతాల నుంచి వందలాది మంది వస్తూ వుంటారు. మరీ వారికి లక్షలాది రూపాయలు జీతాలు తీసుకుంటున్న డాక్టర్లు, వేలాది రూపాయల జీతాలు తీసుకుంటున్న దిగువ స్థాయి ఆరోగ్య సిబ్బంది వంటివారు తమ వృత్తికి తగిన న్యాయం చేస్తూ రోగుల వార్డులు పరిశుభ్రంగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకునే గురుతర బాధ్యత ముమ్మాటికీ వారి భుజస్కందాలపై వుంది. ఇందులో భాగంగా అక్కడి బాత్రూంలలో గాని,వార్డులలో గాని ఎక్కడైనా పెద్ద పెద్ద రంధ్రాలు వుంటే తక్షణమే వాటిని పూడ్చివేయడంతోపాటు అక్కడి బండ సట్టం మరీ పాతపడిపోయి చీలికలు వచ్చి వుంటే తక్షణమే వాటి మరమ్మత్తులపై దృష్టి పెట్టాలి. అప్పుడే అక్కడి వార్డులలో పాములు, ఎలుకలు,దోమలు వంటివి చొరబడకుండా రోగులు తగిన రక్షణలో ఉండగలుగుతారు. ఎందుకంటే అక్కడికి వచ్చే రోగులు ఎంతో అపాయకరమైన పరిస్థితుల్లో, ఆందోళనతో ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తూ వుంటారు. అలాంటి రోగులు వారి తరపున సహాయకారిగా ఉండేందుకు వచ్చే వారి కుటుంబసభ్యులకు తగిన సౌకర్యాలు కనీసం ఒక మోస్తారులోనైనా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ ఆసుపత్రులలోని సిబ్బంది పై ఎంతైనా వుంది. ఏదిఏమైనా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలు అనేవి సామాన్యులకు,నిరుపేదలకు ఒక దేవాలయాల వంటివి కాబట్టి అక్కడికి విచ్చేసే రోగుల పట్ల భగవంతుడు భక్తులకు అనుగ్రహమిచ్చినట్లు, అక్కడి డాక్టర్లు, మిగతా ఆరోగ్య సిబ్బంది వారి పట్ల ఎంతో ప్రేమానురాగాలతో, అప్యాయతతో నడుచుకొని, వారు చేరిన వార్డులలో ఎలాం టి అపరిశుభ్రత వాతావరణం లేకుండా యుద్ధ ప్రాతిపదికన తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏమైనా 'ఆరోగ్యమే మహా భాగ్యం' అంటారే అలా అనారోగ్యం పాలైన తమ ఆరోగ్యా న్ని మెరుగుపరచుకునేందుకు ప్రభుత్వ సర్వజన వైద్యశాల లకు వచ్చే నిరుపేద రోగుల పట్ల కాస్త కనికరం చూపి అక్కడి పరిసరాలలో దుమ్ము, ధూళి పేరుకుపోకుండా,విష పురుగులు, తేళ్లు వంటివి సంచరించకుండా అత్యంత అప్ర మత్తతతో వ్యవహరించాల్సిన తక్షణ కర్తవ్యం, బాధ్యత ప్రభుత్వ ఆసుపత్రిసిబ్బంది పై ఎంతైనా వుంది ఇలా అపరి శుభ్రతకు నిలయాలుగా దురదృష్టవశాత్తు ప్రభుత్వ ఆసుప త్రులు మారితే పేద,నిరుపేద రోగులకు వచ్చినజబ్బుమాట దేవుడెరుగు లేని కొత్తజబ్బులు కొనితెచ్చుకున్నవారవుతారు. కాబట్టి రోగులకు మెరుగైన సౌకర్యాలు అందించాలి. ●

# విద్య నాణ్యత పేరుతో గతానికి 'పరీక్ష' శిక్షలా?

తరిగోపుల నారాయణస్వామి

భారత రాజ్యాంగం ప్రతి బాలబాలికకు విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించిన నేపథ్యంలో విద్యా హక్కు చట్టం అమలులోకి రావడం దేశ విద్యా చరిత్రలో ఒక కీలక ఘట్టం. విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, బోధనలో నాణ్యతను పెంపొందించడం, దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ నియామకాలకు ఒకే విధమైన ప్రమాణాలను తీసుకురావడం వంటి లక్ష్యాలతో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రవేశపెట్టబడింది. ఈ లక్ష్యాలను ఎవరూ వ్యతిరేకించరు.అయితే చట్టం అమలులోకి వచ్చిన తర్వాత రూపొందించిన అర్హత ప్రమాణాలను, ఆచట్టం అమలులోకి రాకముందే చట్టబద్ధంగా నియమితులైన ఉపాధ్యాయులపై కూడా తప్పనిసరిగా వర్తింపజేయడం ఎంతవరకు న్యాయసమ్మతం అనే ప్రశ్న నేడు దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఉపాధ్యాయులను ఆలోచింపజేస్తోంది. 2010కు ముందు దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలు అప్పటికి అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఉపాధ్యాయ నియామకాలను చేపట్టాయి. టిటిసి, డీఈడీ, బిఈడి వంటి విద్యార్హతలను పరిశీలించి, ప్రభుత్వ నియామక పరీక్షలను నిర్వహించి, మెరిట్ ఆధారంగా ఉపాధ్యాయులను నియమించాయి. ఆ సమయంలో టెట్ అనే పరీక్ష విధానం అమలులో లేదు. టెట్ లేకపోయినకాలంలో టెట్ అర్హత లేకపోవడం ఎలాంటి లోపంగా పరిగణించబడలేదు. ఎందుకంటే ఆ వ్యవస్థే అప్పట్లో లేదు. ప్రభుత్వం స్వయంగా అర్హులుగా గుర్తించి నియమించిన వ్యక్తులను, దశాబ్దాల తర్వాత మరోసారి కొత్త ప్రమాణాలతో అర్హత నిరూపించుకోమని కోరడం సహజ న్యాయ సూత్రాల పరంగా అనేక సందేహాలను లేవనెత్తుతోంది.చట్టపరమైన వ్యవస్థలో ఒక ప్రధాన సూత్రం ఏమిటంటే చట్టాలు సాధారణంగా భవిష్యత్తుకు వర్తించాలి. ఇప్పటికే పూర్తయిన చర్యలను తిరిగి కొత్త ప్రమాణాలతో కొలవకూడదు. దీనినే న్యాయశాస్త్రంలో 'ప్రాస్పెక్టివ్ అప్లికేషన్'అని వ్యవహరిస్తారు. ఒక వ్యక్తి ఉద్యోగంలో చేరినప్పుడు అమలులో ఉన్న అర్హతలు, నిబంధనలు, ఎంపిక విధానాలే అతని నియామకానికి ప్రామాణికం కావాలి. భవిష్యత్తులో కొత్త ప్రమాణాలు తీసుకురావడం ప్రభుత్వ హక్కే అయినప్పటికీ, వాటిని గతానికి వర్తింపజేయడం అనేక సమస్యలకుదారితీయవచ్చు. నేడు అనేక మంది ఉపాధ్యాయులు 20,25,30 సంవత్సరాల అనుభవాన్ని కలిగి ఉన్నారు. వారు వేలాది మంది విద్యార్థులకు బోధించారు. వారి శిష్యులు వైద్యులు, ఇంజినీర్లు,న్యాయవాదులు, శాస్త్రవేత్తలు, పరిపాలనా అధికారులు, ప్రజాప్రతినిధులుగా ఎదిగారు. అలాంటి ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని ఒక్క పరీక్ష ఆధారంగా మళ్లీ అంచనా వేయడం సముచితమా అనే ప్రశ్నను విస్మరించలేం. ఉద్యోగంలో చేరిన తర్వాత సంవత్సరాల తరబడి నిర్వహించిన బోధన, సేవా రికార్డు, శిక్షణా కార్యక్రమాలు, విద్యార్థుల




ఫలితాలు, పాఠశాల అభివృద్ధిలో వారి పాత్ర వంటి అంశాలను పక్కనబెట్టి కేవలం ఒక పరీక్షనే తుది ప్రమాణంగా పరిగణించడం సమగ్ర మూల్యాంకనం కాదని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే ప్రస్తుతం బోధిస్తున్న సబ్జెక్టుకు సంబంధం లేని అంశాలు కూడా టెట్‌లో ఉంటాయి. ఉదాహరణకు ఒక ఉపాధ్యాయుడు ఎన్నో సంవత్సరాలుగా ఒక నిర్దిష్ట సబ్జెక్టును బోధిస్తూ ఉండవచ్చు. కానీ పరీక్షలో అతని రోజువారీ బోధనతో ప్రత్యక్ష సంబంధం లేని ఇతర అంశాలపై కూడా ప్రశ్నలు రావచ్చు. అటువంటి పరిస్థితిలో పరీక్ష ఫలితాన్ని మాత్రమే ఆధారంగా తీసుకుని అతని బోధనా సామర్థ్యాన్ని నిర్ణయించడం ఎంతవరకు శాస్త్రీయం అనే ప్రశ్న తలెత్తుతోంది. వయోభారంతో పాటు ఆరోగ్య సమస్యలు, కుటుంబ బాధ్యతలు, సేవా ఒత్తిడులు కూడా అనేక మంది ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను ప్రభావితం చేస్తుంటాయి. యువకుడిగా ఉద్యోగంలో చేరిన వ్యక్తి, మూడు దశాబ్దాల తర్వాత అదే పోటీ పరీక్షా వాతావరణంలో మళ్లీ ఉత్తీర్ణత సాధించాలని కోరడం ఆచరణాత్మకంగా కూడా సవాలుతో కూడుకున్న అంశమే. అనుభవం ద్వారా సంపాదించిన నైపుణ్యాన్ని కేవలం పరీక్షా మార్కులతో కొలవడం విద్యా రంగం సంక్లిష్ట స్వభావాన్ని పూర్తిగా ప్రతిబింబించదు. ఇక్కడ మరో కీలక ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇదే సూత్రాన్ని ఇతర ఉద్యోగ వ్యవస్థలకు కూడా వర్తింపజేస్తే పరిస్థితి ఎలా ఉంటుంది? కొత్త న్యాయ విద్యా ప్రమాణాలు అమలులోకి వచ్చాయని ఇప్పటికే సేవలందిస్తున్న న్యాయవాదులను మళ్లీ పరీక్ష రాయమంటే అంగీకరిస్తారా? కొత్త న్యాయపరమైన ప్రమాణాలు వచ్చాయని న్యాయమూర్తులను మరోసారి అర్హత పరీక్షకు హాజరు కావాలని చెబుతారా? పోలీసు శాఖలో కొత్త శిక్షణ విధానాలు వచ్చాయని ఇరవై సంవత్సరాల సేవ కలిగిన పోలీసు సిబ్బందిని మళ్లీ నియామక పరీక్షలకు పంపుతారా? వైద్య రంగంలో కొత్త ప్రమాణాలు అమలులోకి వచ్చాయని ఇప్పటికే సేవలందిస్తున్న వైద్యులను మళ్లీఅర్హత పరీక్షలకు హాజరు కావాలని ఆదేశిస్తారా? ఈ ప్రశ్నలకు సమాధానం 'కాదు' అయితే ఉపాధ్యాయుల విషయంలో మాత్రమే భిన్నమైన ప్రమాణాలు ఎందుకు అమలవుతున్నాయనే సందేహం సహజంగానే వస్తుంది. ఉపాధ్యాయులు టెట్‌ను వ్యతిరేకించడం లేదు. కొత్తగా నియమితులయ్యే వారికి ఉన్నత ప్రమాణాలుండాలని వారూ కోరుకుంటున్నారు. కానీ చట్టంఅమలులోకి రాకముందే చట్టబద్ధంగా నియమితులైన వారిని తిరిగి కొత్తఅర్హతల కిందకు తీసుకురావడమే తమ అభ్యంతరమని చెబుతున్నారు. ఇది టెట్‌కు వ్యతిరేక ఉద్యమం కాదు. ఇది చట్టాల కాలపరిమితి అమలుపై జరుగుతున్న చర్చగా చూడాలి. ఈ మొత్తం వివాదం మరో పెద్ద వాస్తవాన్ని కూడా బయటపెడుతోంది. ప్రజాప్రతినిధులు శాసనాలు రూపొందించే సమయంలో వాటి దీర్ఘకాలిక ప్రభావాలను, ఇప్పటికే సేవలో ఉన్న ఉద్యోగుల హక్కులను, న్యాయపరమైన చిక్కులను, పరిపాలనా వాస్తవాలను మరింత లోతుగా పరిశీలించాల్సిన అవసరంఉంది. కొన్నిసార్లు మంచి ఉద్దేశంతో రూపొందించిన చట్టాలు కూడా అమలు దశలో అనేక అనుకోని సమస్యలను సృష్టిస్తాయి. అందుకే చట్ట నిర్మాణ ప్రక్రియలో విస్తృత చర్చలు, నిపుణుల సూచనలు, ప్రభావ విశ్లేషణలు తప్పనిసరి కావాలి. విద్యా నాణ్యతను పెంచడం ఎంత ముఖ్యమో, ఇప్పటికే సేవలో ఉన్న ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడడం కూడా అంతే ముఖ్యం. అనుభవాన్ని, సేవా రికార్డును, విద్యార్థుల అభివృద్ధిలో వారి పాత్రను, శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొన డాన్ని, పాఠశాలల అభివృద్ధికి చేసిన కృషిని కూడా సమానంగా పరిగణించాలి. ఒక ఉపాధ్యాయుడి విలువను కేవలం ఒక పరీక్ష ద్వారా మాత్రమే నిర్ణ యించడం విద్యావ్యవస్థకు కూడా నష్టం కలిగించే అవకాశం ఉంది. ●

# ప్రజావాక్కు

## అనాధలవుతున్న తల్లిదండ్రులు

ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం పిల్లలు విదేశాలకు వెళ్లడం నేటి కాలంలో సహజమైపోయింది.చిన్నప్పుడు పిల్లల ప్రతి అడుగులోనూ తోడుగా నిలిచిన తల్లిదండ్రులు, నేడు వృద్ధాప్యంలో వారికోసం ఎదురుచూస్తూ గడుపుతున్నారు. పిల్లలు డబ్బుసంపాదించి పంపుతున్నాతల్లిదండ్రులకు కావాల్సింది డబ్బుకాదు, పిల్లల ప్రేమాభిమానాలు.ఆప్యాయమైన పలకరింపు, ఆత్మీయమైన సాన్నిహిత్యమే. ఫోన్‌లో వినిపించే స్వరం క్షణిక ఆనందాన్ని ఇచ్చినా, పక్కన ఉండే ప్రేమను భర్తీ చేయలేకపోతుంది. పిల్లలుదూరంగా ఉంటే,తల్లిదండ్రులు తమసొంత ఇంట్లో నేఅనాధలుగా మారుతున్నపరిస్థితిఆందోళన కలిగిస్తోంది.

- నిమ్మగడ్డ కృష్ణ హైదరాబాద్

## టీచింగ్ డైరీ నుండి మినహాయింపు ఇవ్వాలి

వివిధ శారీరక వైకల్యాలతో, దృష్టిలోపం, అంధత్వంతో బాధపడుతూ విద్యాబోధన చేయుచున్న లెక్చరర్స్, టీచర్స్‌కు టీచింగ్ డైరీ రాయడం నుండి మినహాయింపు ఇవ్వాలి.సహాయకులు లేనిదే తమ పనులు తాము చేయలేకపోవుచున్నారు.అందరి వలెటీచింగ్ డైరీ రాయడం వికలాంగులైన టీచింగ్ స్టాఫ్‌కు కొంత ఇబ్బందికరం. అందు కోసం కూడా సహాయకుల సహాయం అవసరం ఉంటుంది. కనుక 2026-2027 నూతన విద్యా సంవత్సరం ప్రారంభంకాబోతున్నది. కనుకగురుకులాలలో అదనంగా పని ఒత్తిడి వలన వికలాంగులు గురుకులాలలో ఇబ్బందులు పడుతున్నారు.కనుక వికలాంగులైన టీచింగ్ స్టాఫ్‌కు టీచింగ్ డైరీరాయడం నుండి మినహాయింపు ఇవ్వాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

## రైతులకు ఆసరా కల్పించాలి

ఈ సీజన్లో తెలంగాణలో ఎక్కువ మొత్తంలో పూడిక తీత పనులు జరుగుతున్నాయి. తెలంగాణ గ్రామీణా ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణలోను తెలంగాణ వ్యవసాయంలో ఉత్పత్తి ఉత్పద్దకతను పెంచడంలో పూడిక తీత పనులు ఉపయోగపడుతాయి. అయితే తెలంగాణలో నీటి వసతులు వివిధ మార్గాల ద్వారా పెరిగినా ఇప్పటికీ స్థిరనీటి వసతి లేని మారుమూల గిరిజన తాండాలు గ్రామాలున్నాయి. తెలంగాణలో ప్రతి గ్రామంలో మల్లమ్మ ఎల్లమ్మ పోషమ్మ దేవాలయాలు ఎట్లా ఉంటాయో అట్లనే ప్రతి గ్రామానికి కుంటలు చెరువులు సర్వసాధారణంగా ఉంటాయి. అయితే వాటిని పూడిక తీయించడం ముఖ్యం.

- భారత అవినాష్, జనగామ

## ఇల్లాలే జాతి నిర్మాత అంటున్న సుప్రీం

సుప్రీం కోర్టు నిన్న ఇల్లాలి ఘనతను చాటేలా తీర్పు వెలువరించింది.పంజాబ్‌లో2001లో రోడ్డుప్రమాదంలో దుర్మరణం పాలైన ఓ గృహిణికి రావాల్సిన పరిహారం విషయమై కేసు నడవగా, తుదితీర్పులో ఆమె ప్రాముఖ్యతను ఎలా చూడాలో చెప్తూ సమాజానికి దిశానిర్దేశం చేసింది. పరిహారం లెక్క కట్టేటప్పుడు ఆమెను కేవలం ఇంటిని చూసుకునే ఇల్లాలిగా పరిగణించడం తప్పు అన్నది సారాంశం. ఇంట్లో భర్త సంపాదనపై బ్రతికేమనిషిగా చూడడం అన్యాయమని,ఆమెని చూడాల్సింది ఇంటిని నిలబెట్టే మూలాధారం అన్నది నొక్కి చెప్పింది. ఆమె చేసే చాకిరీ,సేవలు వెలకట్టలేనివి. అవి లేకుంటే ఇంట్లో వారి పనితీరు ప్రభావితమై,జాతి సంపదకు నష్టం వాటిల్లుతుంది. పరోక్షంగా ఆ కుటుంబమే కాకుండా దేశం ఆర్థికంగా నష్టపోతుంది. కనుక ఇల్లాలి ఇంటి పనికి ఖరీదు కట్టాల్సిందేనంటూ చెప్పింది. ప్రస్తుతానికి ఆసేవల్ని డొమెస్టిక్ వాల్యూగా లెక్కించి కనీసంగా నెలకు 30వేల రూపాయలుగా నిర్ణయించింది.

- డా.డి.వి. జి. శంకరరావు, విజయనగరం

## జన్మిస్తే మాత్రమే చాలదు

జన్మదినం అంటే కేవలం జన్మిస్తే చాలదు నీ జననం వలన కుటుంబానికి ఏవిధంగా మేలుచేసావు. విపత్కర పరిస్థితుల్లో స్నేహితులకు,ఇతరులకు నీ వంతుగా ఏ విధమైన సహాయం చేశావు,ఇతరుల పట్ల గౌరవం,పేరు ప్రఖ్యాతలు అనేది మాత్రమే జననానికి నీవుఇచ్చే అర్థం.సార్థకతలేని జన్మదినం వృథా.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## అంతరాయం లేని విద్యుత్ అందించాలి

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచిన ఆక్వా రంగాన్ని ఆదుకోవడం అత్యవసరంగా మారింది. దేశ విదేశీ మార్పిడి ఆదాయంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ రంగం ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో రొయ్యలు, చేపల ధరలు పతనం కావడం,రవాణా ఖర్చులు విపరీతంగా పెరగడం వల్ల రైతులు కోట్లలో నష్టపోతున్నారు. దీనికి తోడు నాణ్యమైన మేత, మందుల ధరలు నియంత్రణ లేకుండా పెరిగిపోవడం సాగు వ్యయాన్నిభారంగామార్చింది.విద్యుత్ రాయితీల కోత, నాణ్యమైన విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల నిర్వహణ ఖర్చులు మరింతపెరిగాయి.ఆక్వా ప్రాసెసింగ్ కంపెనీలు,మధ్య వర్తుల సిండికేట్ వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఇథనాల్ ఇంధనంగా 100 శాతం వినియోగం



### కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

**న్యూఢిల్లీ, జూన్ 14:** దిగుమతి చేసుకునే శిలాజ ఇంధనాలపై భారతదేశం ఆధారపడటాన్ని తగ్గించడం, స్వచ్ఛమైన, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు పరివర్తనను వేగవంతం చేయడం లక్ష్యంగా, ఇంధనంగా 100 శాతం ఇథనాల్ వినియోగానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. దీనివల్ల తక్కువ ధరకే ఇంధనం దొరుకుతుందని, దేశంపై చమురు దిగుమతుల భారం తగ్గుతుందని పేర్కొన్నారు. గత 12 యేళ్లలో ఎన్డీయే ప్రభుత్వ సాధించిన కీలక విజయాలను వివరిస్తూ, నాగ్‌పూర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి ఈ ప్రకటన చేశారు. దేశంలో వాహన ఇంధనంగా 100 శాతం ఇథనాల్‌ను చట్టబద్ధంగా ఉపయోగించేందుకు మార్గం సుగమం చేస్తూ, అవసరమైన నియంత్రణ ఫైల్‌పై శనివారం సాయంత్రం సంతకం చేసినట్లు గడ్కరీ తెలిపారు. ముడి చమురు దిగుమతులను తగ్గించడం, ఇంధన భద్రతను మెరుగుపరచడం, స్వచ్ఛమైన ఇంధన ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం వంటి ప్రభుత్వ విస్తృత ప్రయత్నాలకు ఈ నిర్ణయం మద్దతు ఇస్తుందని భావిస్తున్నారు. సాంప్రదాయ శిలాజ ఇంధనాలకు ఆచరణీయమైన ప్రత్యామ్నాయంగా ఇథనాల్‌కు తాను చాలాకాలంగా మద్దతు ఇస్తున్నట్లు మంత్రి పునరుద్ఘాటించారు. సాంకేతిక పురోగతులు, పెరుగుతున్న పారిశ్రామిక భాగస్వామ్యం ఇప్పుడు ఇథనాల్‌తో నడిచే వాహనాలను ఒక వాస్తవిక ఎంపికగా మార్చాయని ఆయన అన్నారు. 100 శాతం ఇథనాల్ ఇంధనంతో నడిచే సామర్థ్యం గల వాహనాలను ప్రవేశపెట్టడానికి అనేక ప్రముఖ ఆటోమొబైల్ తయారీదారులు సిద్ధమవుతున్నారని గడ్కరీ చెప్పారు. ప్రభుత్వ ప్రత్యామ్నాయ ఇంధన వ్యూహం విజయవంతం కావడానికి ఫ్లెక్స్ ఫ్యూయల్, ఇథనాల్ అనుకూల వాహనాల లభ్యత చాలా అవసరమని పరిశ్రమ నిపుణులు భావిస్తున్నారు. స్వచ్ఛమైన, దేశీయంగా ఉత్పత్తి అయ్యే ఇంధనానికి ప్రోత్సాహం:ఇంధన వనరులను వైవిధ్యపరచడం, ఉద్గారాలను తగ్గించడం, దేశీయ వ్యవసాయ ఉత్పత్తికి మద్దతు ఇవ్వడం వంటి తన దీర్ఘకాలిక వ్యూహంలో ఇథనాల్‌ను ఒక కీలక భాగంగా కేంద్రం పరిగణిస్తోంది. ఇథనాల్ ప్రధానంగా చెరకు, మొక్కజొన్న వంటి వ్యవసాయ ముడి పదార్థాల నుండి ఉత్పత్తి అవుతుంది. ఇది ఇంధన భద్రతకు దోహద పడటంతో పాటు, రైతులకు అదనపు ఆదాయ వనరును కూడా అందిస్తుంది. 100 శాతం ఇథనాల్ ఇంధనానికి ఆమోదం లభించడం, దానికి అనుకూలమైన వాహనాలను త్వరలో విడుదల చేయనుండటంతో, రాబోయే సంవత్సరాల్లో ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు మార్పును వేగవంతం చేసి, దిగుమతి చేసుకునే పెట్రోలియం ఉత్పత్తులపై భారతదేశం ఆధారపడటాన్ని తగ్గించాలని ప్రభుత్వం ఆశిస్తోంది.

## జూలై 4 నుంచి దివంగత ఖొమేనీ అంత్యక్రియలు ప్రారంభం

### పలుచోట్ల అంతిమయాత్రలు.. చివరిగా 9న మషాద్‌లో తుది క్రతువు

**టెహ్రాన్, జూన్ 14:** ఇరాన్‌లో సుదీర్ఘ కాలంపాటు పరిపాలించిన మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల షెడ్యూల్ ఖరారైంది. జూలై 4 నుంచి రాజధాని టెహ్రాన్‌లో ఈ అంత్యక్రియల ప్రక్రియ ప్రారంభం కానుందని ఇరాన్ ప్రభుత్వ మీడియా ఆదివారం వెల్లడించింది. ఖమేనీ సంస్మరణ బాధ్యతలను పర్యవేక్షిస్తున్న ప్రధాన కమిటీ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. జూలై 4, 5 తేదీల్లో టెహ్రాన్‌లోని ప్రసిద్ధ ఇమామ్ ఖమేనీ ముసల్లా ప్రార్థనా మందిరంలో ఖమేనీ పార్థివ దేహానికి వీడ్కోలు వేడుకలు నిర్వహిస్తారు. అనంతరం జూలై 6, 7 తేదీల్లో రాజధాని టెహ్రాన్, పవిత్ర నగరం కోమ్‌లలో భారీ అంతిమ యాత్రలు సాగుతాయి. 9న దేశ ఈశాన్య ప్రాంతంలోని మషాద్ నగరంలో తుది వీడ్కోలు కార్యక్రమం ముగుస్తుంది. అదే రోజున షియా ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే ఎనిమిదవ మతపెద్ద ఇమామ్ రెజా పవిత్ర క్షేత్రంలో ఖమేనీ దేహాన్ని ఖననం చేయనున్నారు. నిజానికి మార్చి నెలలోనే జరగాల్సిన ఈ అంత్యక్రియలు యుద్ధ పరిస్థితుల కారణంగా వాయిదా పడుతూ వచ్చాయి. 86 యేళ్ల అలీ ఖమేనీ ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన భారీ వైమానిక దాడుల్లో మరణించారు. ఈ దాడితో ఇరాన్‌పై ఆయన సాగించిన 36 యేళ్ల పాలన ముగిసింది. ఖమేనీ మరణం తర్వాత మార్చి మొదటి వారంలో ఆయన కుమారుడు మొజ్తబాఖమేనీ ఇరాన్ కొత్తసుప్రీంలీడర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ దాడుల్లో ఖమేనీతోపాటు ఆయనకుమార్తె, మనవడు, అల్లుడు, మరోనలుగురు కుటుంబసభ్యులు ప్రాణాలు కోల్పోయారు.

# వాణిజ్య నౌకలు హార్ముజ్ జలసంధి మీదుగా రావద్దు

### పబ్లిక్ మారిటైమ్ రేడియో ఛానల్‌లో ఇరాన్ హెచ్చరికలు

**టెహ్రాన్, జూన్ 14:** అంతర్జాతీయ చమురు, సహజ వాయువుల రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరాయి. ఈ వ్యూహాత్మక జలసంధిని ఇరాన్ పూర్తిగా మూసివేసింది. ఈ పరిసర ప్రాంతాల్లో ప్రయాణించే వాణిజ్య నౌకలు హార్మూజ్ జలసంధి వైపు రావద్దని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నావికాదళం హెచ్చరికలు జారీ చేసింది. పబ్లిక్ మారిటైమ్ రేడియో ఛానల్ ద్వారా ఇరాన్ నావికాదళం పంపిన ఈ హెచ్చరికల ఆడియో రికార్డింగ్ ఇప్పుడు అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. ఆ ప్రాంతంలో ప్రయాణిస్తున్న ఒక వాణిజ్య నౌక సిబ్బంది అందించిన ఆడియో రికార్డింగ్ ప్రకారం పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్ పరిధిలో ఉన్న అన్ని నౌకలను ఉద్దేశించి ఐఆర్‌జీసీ హెచ్చరికలు జారీ చేసింది. హార్మూజ్ జలసంధిని ప్రస్తుతం పూర్తిగా మూసివేయడం జరిగింది. ఈ జలసంధి గుండా ఎలాంటి నౌకల కదలికలు ఉన్నా వాటిని చాలా కఠినంగా ఎదుర్కొంటాం. మీ ఆరోగ్యం, భద్రత దృష్ట్యా, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు హార్మూజ్ జలసంధి వైపు రాకుండా దూరంగా ఉండండని ఆ రేడియో సందేశంలో ఇరాన్ స్పష్టం చేసింది. ట్రంప్ శాంతి ఒప్పందం డ్రోన్ల కూల్చివేత ఈ ఉద్రిక్తతల నడుమ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఆదివారం (జూన్ 14) ఒక శాంతి ఒప్పందం కుదరబోతోందని, ఆ ఒప్పం దంపై సంతకాలు ముగిసిన వెంటనే హార్మూజ్ జలసంధిని తిరిగి తెరుస్తారని ట్రంప్ వెల్లడించారు. మరోవైపు క్షేత్రస్థాయిలో ఘర్షణ వాతావరణం కొనసాగుతూనే ఉంది. హార్మూజ్ జలసంధిలోని వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ పంపిన పలు డ్రోన్లను తాము విజయవంతంగా కూల్చివేసినట్లు అమెరికా సైన్యం శుక్రవారం రాత్రి ప్రకటిం చింది. అంతర్జాతీయ మారిటైమ్ ఆర్గనైజేషన్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఈనెల 11 నాటికి హార్మూజ్ జలసంధి, పశ్చిమాసియా పరిసర ప్రాంతాల్లో అంతర్జాతీయ నౌకలపై 46 దాడులు జరిగాయి. ఈ దాడుల వల్ల ఇప్పటివరకు 14 మంది అంతర్జాతీయ నావికులు ప్రాణాలు కోల్పోయారు. బుధవారం ఒక చమురు ట్యాంకర్‌పై జరిగిన దాడిలో ముగ్గురు నావికులు మరణించగా, ఆ దాడిని తామే చేసినట్లు అమెరికా సైన్యం ఆ తర్వాత ధ్రువీకరించింది. ఈ నేపథ్యంలో ఆదివారం జరగబోయే శాంతి ఒప్పందం కోసం అంతర్జాతీయ వాణిజ్య వర్గాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.



**యుఎస్‌తో డీల్‌పై గుస్సా..**
**ఇరాన్‌లో మిన్నంటిన నిరసనలు**

యుఎస్‌తో డీల్ కుదరనుందన్న వార్తలు ఇరాన్‌లో నిరసనలను రగిలించాయి. దేశ ప్రయోజనాల విషయంలో విదేశాంగ శాఖ మంత్రి అరాగ్చీ రాజీ పడ్డారంటూ ప్రజలు పలునగరాల్లో నిరసనలకు తెరతీశారు. యూఎస్‌తో డీల్ విషయంలో ఇరాన్‌లోని అతివాదులు నిరసన బాట పట్టారు. ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అరాగ్చీ, పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ ఘాలిబఫ్‌కు వ్యతిరేకంగా నిరసనలకు తెరతీశారు. నేడు ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాటు పాక్ కూడా ప్రకటించడంతో ఇరాన్‌లో నిరసనలు మిన్నంటుతున్నాయి. ఇరాన్ అధికార వర్గాలు మాత్రం ఈ విషయంపై ఆచితూచి స్పందిస్తున్నాయి. అయినప్పటికీ, తమ దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగేలా విదేశాంగ శాఖ మంత్రి, స్పీకర్ యూఎస్‌తో ఒప్పందానికి సిద్ధమవుతున్నారంటూ కొందరు ఇరానీయన్లు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, మషాద్ నగరంలోని విదేశాంగ శాఖ కార్యాలయం ముందు అనేక మంది అతివాదులు పెద్ద ఎత్తున నిరసనకు తెరతీశారు. యూఎస్‌తో ఒప్పందం గురించి మంత్రి అరాగ్చీ ప్రస్తావించిన అనంతరం దేశంలో ఆగ్రహావేశాలు ఊపందుకున్నాయి. అనేక మంది అరాగ్చీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన దేశానికి తలవంపులు తెచ్చే పని చేశారని, మరణ శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. రాజధాని టెహ్రాన్‌తో పాటు అనేక ఇతర ప్రాం తాల్లో నిరసనలు వెల్లువెత్తినట్టు తెలుస్తోంది. యూఎస్‌తో కుదుర్చుకోనున్న ప్రతిపాదిత డీల్‌లో ఇరాన్ ప్రయోజనాలకు రక్షణలు లేవని ఇరాన్‌లోని అతివాద వర్గం ఆరోపిస్తోంది. ఈ డీల్ కుదిరితే హోర్ముజ్‌పై ఇరాన్ పట్టు సడలిపోతుందని వారు చెబుతున్నారు. అంతిమంగా ఇరాన్ ప్రయోజనాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీల్ కోసం అమెరికా చెప్పినట్టల్లా తలూపుతున్నారని ఇరాన్ పాలకవర్గాన్ని తీవ్రంగా విమర్శి స్తున్నారు. ఈ డీల్ కుదిరాక అమెరికా విధించిన నిర్బంధం తొలగిపోతుందని అరాగ్చీ ఇటీవల చెప్పారు.

## ముంబయిలోని 36 పెట్రోలు బంకుల్లో లీటరుకు రూ.5 తగ్గింపు

### ఎంఎన్‌ఎస్ రాజ్‌థాకరే పుట్టినరోజు కానుక

**ముంబయి, జూన్ 14:** మహారాష్ట్ర నవ్‌నిర్మాణ్‌సేన వ్యవస్థాపకుడు రాజ్ థాక్రే పుట్టినరోజు సందర్భంగా ముంబైలోని ద్విచక్ర వాహనదారులకు పెట్రోల్‌పై ప్రత్యేక తగ్గింపును ప్రకటించింది. ఈ పథకం కింద నగరంలోని ఎంపిక చేసిన 36 పెట్రోల్ బంకుల్లో టూవీలర్లకు లీటర్ పెట్రోల్‌పై రూ.5 తగ్గింపును అందిస్తోంది. రాజ్ థాకరే పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఒక్కరోజు పాటు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. దేశంలో ద్రవ్యోల్బణం, ఇంధన ధరలు నిరంతరం పెరుగుతూ సామాన్యుల బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్న తరుణంలో ఎంఎన్‌ఎస్ ఈ నిర్ణయం తీసుకుంది. సామాన్యులపై పడుతున్న ఆర్థిక భారాన్ని కొంతమేర తగ్గించడమే తమ లక్ష్యమని వారు స్పష్టం చేశారు. ఈ చొరవపై ఎంఎన్‌ఎస్ డివిజన్ ప్రెసిడెంట్ జై శృంగార్‌పురే మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో పరిస్థితులు చాలా కష్టంగా ఉన్నాయి. ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగింది, పెట్రోల్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇలాంటి సమయంలో మా వంతుగా ప్రజలకు కొంత మద్దతు ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. మరో ఎంఎన్‌ఎస్ నేత సందీప్ దేశ్‌పాండే ఇంధన ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం విషయంలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పెట్రోల్ ధరల భారాన్ని అంతిమంగా ప్రజలే మోస్తున్నారని, వినియోగదారులపై ఒత్తిడి తగ్గించడానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అమెరికా డాలర్ విలువలో హెచ్చుతగ్గులు కూడా ఇంధన ధరలపై ప్రభావం చూపుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ తాజా కార్యక్రమం ద్వారా ముంబై వాసులకు తక్షణ ఊరట లభిస్తుందని అన్నారు.

## అఖిలేష్‌యాదవ్ కుమార్తెపై అభ్యంతరకర పోస్టులు

### ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని సిఎం యోగి ఆదేశం

**లక్నో, జూన్ 12:** సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కుమార్తె అదితి యాదవ్‌పై కొందరు తప్పుడు, అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం, సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ చేయడంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర అభ్యంతర వ్యక్తం చేశారు. సమాజంలో ఎవరి ఆడపిల్లపైనా ఒకటేనని, వారిని ఇలాంటి నీచమైన బహిరంగ చర్చల్లోకి లాగకూడదని అన్నారు. యూపీలోని అంజాంగఢ్‌లో రూ.955 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను యోగి ఆదిత్యనాథ్ ఆదివారంనాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడకూతుళ్లపై అభ్యంతరకర వ్యాఖ్యలను అనుమతించే ప్రసక్తే లేదని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఇటీవల సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కుమార్తెపై కొందరు వ్యక్తులు అనుచిత వ్యాఖ్యలు చేయడం చూశాను. వారిపై తక్షణమే ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించానని యోగి ఆదిత్యనాథ్ చెప్పారు. ఆడకూతుళ్లు అందరికీ కూతుళ్లేనని, గ్రామాల్లో ఆడపిల్లలను తమ ఆడపిల్లలుగా, అక్కాచెల్లెళ్లను తమ సొంత సోదరీమణులుగా చూస్తారని, అలాంటి సంస్కృతిలో పెరిగిన మనం ఆడపిల్లల పట్ల ఎలాంటి వైరుధ్యం చూపించరాదని అన్నారు. అఖిలేష్ యాదవ్ కుమార్తెను టార్గెట్ చేస్తూ సామాజిక మాధ్యమంలో పరువునష్టం కలిగించే పోస్టను సర్క్యులేట్ చేసిన వారిపై ఇటీవల ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. తప్పుడు ఉద్దేశాలతో కొందరు వ్యక్తులు ఈ పోస్టులను సర్క్యులర్ చేస్తున్నారంటూ అఖిలేష్ యాదవ్ కాన్పూర్ పోలీస్ కమిషనరేట్ సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేశారు. ఫోటో మార్ఫింగ్ చేసి, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆడపిల్లలు, సీనియర్ సిటిజన్లను కించపరచేలా సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తలు వ్యవహరిస్తుండటంపై కూడా యోగి ఆదిత్యనాథ్ చురకలు వేశారు. అఖిలేష్ జీ మహిళలు, సీనియర్ సిటిజన్లు, సీనియర్ నేతలను కించపరచే వ్యాఖ్యలు చేయవద్దని మీ కార్యకర్తలకు సూచించండి. తగిన సంయమనంతో వ్యవహరించేలా చూడండి. వారికి బాగా అర్థమయ్యేలా చెప్పండి. అప్పటికీ వారికి అర్థం కాకపోతే మాకు అప్పగించండి. వారికి ఎలా చెప్పాలో అలా మేము చెబుతామని అన్నారు.

# బావిలోకి దూసుకుపోయిన పికప్ ట్రక్కు

### 14 మంది మృతి, మరో ఆరుగురి వెలికితీత

**సోలాపూర్, జూన్ 14:** దైవ దర్శనానికి వెళ్లి తిరిగొస్తుండగా మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా తాండుల్వాడి సమీపంలో పికప్ ట్రక్కు బావిలో పడిపోయింది. ఈ ఘటనలో 14 మంది భక్తులు అక్కడికక్కడే మరణించారు. మరో ఆరుగురిని బావిలో నుంచి సురక్షితంగా బయటకు తీసినట్లు అధికారులు వెల్లడించారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం సోలాపూర్ జిల్లాలోని రంజణిగావ్ గ్రామానికి చెందిన 14 మంది భక్తులు పికప్ వాహనంలో మస్వాడ్ ప్రాంతంలోని సిద్ధనాథ్ దేవాలయం దర్శించుకు నేందుకు వెళ్లారు. అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో పందర్‌పూర్ వెళ్తుండగా తాండుల్వాడీ సమీపంలో ఒక్కసారిగా అదుపుతప్పిన పికప్ వాహనం రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. బావి పూర్తిగా నీటితో నిండి ఉండటంతో పికప్ ట్రక్కు క్షణాల్లోనే మునిగిపోయింది. ఇది గమనించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ బృందాల ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. బావిలో నుంచి ఎనిమిది మంది మృతదేహాలను వెలికితీశారు. మృతుల్లో నలుగురు మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. ఇక మరో ఆరుగురిని సురక్షితంగా బయటకు తీసి ఆస్పత్రికి తరలిం చారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. పికప్ ట్రక్కులో సాంకేతిక లోపం తలెత్తిందా లేదా డ్రైవర్ నిర్లక్ష్యంకారణమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ప్రమాదం జరిగిన బావికి రక్షణ గోడలు లేవని దీనివల్ల ఇంతమంది ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని స్థానికులు చెబుతున్నారు.



## హిమాచల్‌ప్రదేశ్‌లో డ్రోన్ పోస్ట్ సర్వీస్

**సిమ్లా, జూన్ 14:** భారత తపాలా శాఖ హిమాచల్‌ప్రదేశ్‌లోని అత్యంతఎత్తైన, దుర్గమమైన కొండ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు వేగంగా సేవలు అందించడానికి డ్రోన్‌టెక్నాలజీని అందు బాటులోకి తెచ్చింది. రాష్ట్రంలోని మండీ జిల్లాలో తొలిసారిగా నిర్వహించిన డ్రోన్ పోస్టల్ డెలి వరీ ట్రయల్స్ విజయవంతమయ్యాయి. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధి యా సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ సేవల ద్వారా హిమాచల్‌ప్రదేశ్‌లోని మారు మూల ప్రాంతాలకు తపాలా సేవలను మరింత చేరువ చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.



## బంగ్లా అక్రమ వలసల కట్టడికి అసోం సిఎం కార్యాచరణ

**దిస్పూర్, జూన్ 14:** అసోం ప్రభుత్వం ఆధార్ కార్డుల జారీ ప్రక్రియపై 18 ఏళ్లు నిండిన వారికి కొత్తగా ఆధార్ నమోదును నిలిపివేస్తున్నట్లు ప్రకటిం చింది. బంగ్లాదేశ్ నుంచి వచ్చే అక్రమ వలసదారులు ఆధార్ కార్డులు పొందకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ కఠిన చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో జనాభా కంటే అధికంగా, అంటే 100 శాతానికి మించి ఆధార్ కార్డులు జారీ అయినట్లు గుర్తించామని, ఈ అదనపు కార్డులు ఎవరికి జారీ అయ్యాయో నిగ్గుతేల్చాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అక్రమ చొరబాటుదారులు ఆధార్ పొందకుండా కట్టడి చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని సీఎం వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో అర్హులైన వారు ఆధార్ పొందేందుకు ప్రత్యేక నిబంధ నలను రూపొందించారు. దీని ప్రకారం, జిల్లా కలెక్టర్ సంబంధిత వ్యక్తి వివరాలను సిఫార్సు చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం వాటిని క్షుణ్ణంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుంది. కాగా, షెడ్యూల్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ), మరియు టీ గార్డెన్ కమ్యూ నిటీలకు చెందిన వారికి మార్చి 31, 2027 వరకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు. 18 ఏళ్లు పైబడిన వారికి కొత్త ఆధార్‌కార్డుల జారీ ప్రక్రియను నిలిపివేసినప్పటికీ, 18 ఏళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు యథాతథంగా కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## సంక్షిప్త వార్తలు

### లండన్‌లో భారత్ సంతతి యువకుడి దారుణ హత్య



**లండన్, జూన్ 14:** భారత సంతతి యువకుడు నగరంలో దారుణ హత్యకు గురయ్యాడు. పశ్చిమ లండన్‌లోని సౌత్‌హాల్ ప్రాంతంలో పంజాబ్‌కు చెందిన 26 ఏళ్ల గుర్బేజ్ సింగ్‌ను దుండగులు కత్తితో పొడిచి చంపారని మెట్రోపాలిటన్ పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనతో లండన్‌లోని భారత సమాజంలో ఆందోళన వ్యక్తమవుతోంది. బుధవారం అర్ధరాత్రి దాదాపు 12:30 గంటలకు నార్త్ రోడ్‌లోని డోర్మర్స్ వెల్స్ లేన్ జంక్షన్ వద్ద ఈ దాడి జరిగింది. కత్తిపోట్లపై సమాచారం అందుకున్న లండన్ అంబులెన్స్ సర్వీస్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, పారామెడికల్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకునేసరికి ఇద్దరు వ్యక్తులు గాయాలతో పడి ఉన్నారు.

### మమతా బెనర్జీకి లీగల్ నోటీసులు

**కోల్‌కతా, జూన్ 14:** పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి టిఎంసి రెబల్ ఎంపి కకోలీ ఘోష్ కుమారుడు బైద్యనాథ్ ఘోష్ లీగల్ నోటీసులు పంపారు. మాజీ సీఎం మమతాతోపాటు మరో ముగ్గురు ఎంపిలకు కూడా లీగల్ నోటీసులు పంపారు. బరసత్ అసెంబ్లీ టికెట్ కోసం తాను పార్టీని అడిగానని చేసిన ఆరోపణలపై క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. పదవి కోసం తాను ఆశపడలేదని ఆయన స్పష్టం చేశారు. మమతకు లీగల్ నోటీసులివ్వడంపై పశ్చిమబెంగాల్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అటు తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో ప్రక్షాళన చేపట్టిన అధిష్ఠానం యువజన విభాగం అధ్యక్షుడిగా అర్నబ్‌బెనర్జీ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా అలీఫా అహ్మద్‌ను నియమించింది.

### ఎఐఎడిఎంకెకు సీనియర్ నటి గౌతమి రాజీనామా


**చెన్నై, జూన్ 14:** తమిళనాడు రాజకీయాల్లో ఎఐఎడిఎంకెకు షాక్ తగిలింది. ఆ పార్టీకి సీనియర్ నటి గౌతమి రాజీనామా చేశారు. పార్టీ సభ్యత్వంతో పాటు తన పదవికి రాజీనామా చేస్తూ ఎఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శి పళనిస్వామికి లేఖ పంపారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీలోని అంతర్గత పరిణామాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు. కచ్చితమైన కారణాలను మాత్రం వెల్లడించలేదు. బిజెపితో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన గౌతమి ఆ తర్వాత ఎఐఎడిఎంకెలో చేరారు. ఆమె తదుపరి అడుగుపై తీవ్ర ఆసక్తి నెలకొంది.

### పరిహారం ఫైల్ పెండింగ్.. అధికారిని చెప్పుతో కొట్టిన రైతు

**బెంగళూరు, జూన్ 14:** కర్ణాటకలోని బాగల్‌కోట్‌లో భూసేకరణ పరిహారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ విసిగిపోయిన రైతు బసప్ప దొడమణి.. శనివారం టౌన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో ఒక అధికారిపై చెప్పుతో దాడి చేశాడు. ఈ ఘటనతో కార్యాలయంలో కలకలం రేగింది. కొందరు అధికారులు భయంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పిఓకెలో ప్రజలపై షరీఫ్ సర్కార్ అణిచవేత, దమనకాండ

**ముజఫరాబాద్, జూన్ 14:** పాక్ ఆక్రమిత కాశ్మీర్ పీవోకేలో ప్రజలు రాజకీయ హక్కులు, అణచివేతకు వ్యతిరేకంగా తిరగబడుతున్నారు. అక్కడి ప్రజలు బాధల్ని వినకుండా పాకిస్తాన్ ప్రభుత్వం, పాక్ ఆర్మీ ప్రజల్ని పిట్టల్లా కాల్చి చంపుతోంది. తమ హక్కుల్ని పాక్‌లోని ఇతర ప్రాంతాల వారు ముఖ్యంగా పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన వారు దోచుకు పోతు న్నారని పీఓకేలోని ప్రజలు ఆరోపిస్తున్నారు. పీఓకేను పంజాబ్‌గా పాకిస్తాన్ మారుస్తోందని, వలసల్ని ప్రోత్స హించడంతోపాటు పీఓకేలోని సహజవనరులను పంజాబ్ ప్రాంతానికి దోచిపెడుతోందని ఆరోపిస్తున్నారు. నిజానికి ఇది పీఓకే ఒక్క ప్రాంత సమస్య కాదు. పాకిస్తాన్‌లోని ఖైబర్ ఫఖ్తుంఖ్వా, బలూచిస్తాన్, సింధ్ ప్రావిన్సుల హక్కుల్ని కూడా పంజాబ్ ప్రావిన్స్ హరిస్తుందనే భావన అక్కడి ప్రజల్లో ఉంది. పాకిస్తాన్ అంటే పంజాబ్, పంజాబ్ అంటే పాకిస్తాన్ అనేది నిజం. ఎందుకంటే పాకిస్తాన్ సైనిక వ్యవస్థ, రాజకీయ వ్యవస్థలో పంజాబీ ఆధిక్యత కనిపిస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే పాక్ ఆర్మీని ఖైబర్ ఫఖ్తుంఖ్వావంటి ప్రాంతాల్లో పంజాబ్‌ఆర్మీ అని సంబోధిస్తుంటారు. పాకిస్తాన్ పంజాబీల ఆధిపత్యం గల సైన్యం, అధికార యంత్రాంగం, రాజకీయ వ్యవస్థలు పాక్ ఆక్రమిత కాశ్మీర్, గిల్గిత్‌బాలిస్తాన్‌లపై తమ నియంత్రణకోసం ఒత్తిడి చేస్తున్నాయని హక్కుల కార్యకర్తలు, సంస్థలు చెబుతున్నారు.




## ఒమన్ తీరంలో మునిగిపోతున్న నౌక నుంచి 14 మందిని రక్షించిన యుఎస్

**మస్కట్, జూన్ 14:** ఒమన్ తీరంలో భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న ఓడ ఇంజన్ వైఫల్యంతో మునిపోవడం ప్రారంభమైంది. సకాలంలో రెస్క్యూ చేయడంతో అందులో ఉన్న 14 మంది భారతీయుల్ని సురక్షితంగా కాపాడారు. అయితే, ఇదే ప్రాంతంలో జరిగిన మరో ప్రమాదంలో ఒక భారతీయ నావికుడు మరణించారు. జూన్ 14న ఎంఎస్‌వి విరాట్1 అనే కార్గో షిప్ మునిగిపోయినట్లు మస్కట్‌లోని భారతీయ రాయబార కార్యాలయం వెల్లడించింది. ఈ ప్రమాదం ఒమన్ లోని రాస్ అల్ హద్‌కు సుమారు 80 నాటికన్ మైళ్ల దూరంలో జరిగింది. ముందుగా పరిస్థితి తీవ్రంగా ఉండటంతో ఇండియన్ నేవీకి చెందిన నౌకలు సంఘటనా స్థలానికి వెళ్లాయి. అయితే, అమెరికన్ నేవీకి చెందిన పీ8 సముద్ర నిఘా విమానం సంఘటన స్థలానికి చేరుకుని ఒక లైఫ్ రాఫ్ట్ జారవిడిచి, భారతీయ సిబ్బందిని రక్షించింది. ఓడలోని 14 మంది సిబ్బంది లైఫ్ రాఫ్ట్ సాయం తో ప్రాణాలతో బయట పడ్డారు. ఎంవి జబల్ అలీ 9 నౌక కూడా సంఘటనా స్థలంలో సహాయక కార్యక్రమాల్లో పాలు పంచుకుంది. గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఇదిలా ఉంటే మరో నౌకలో భారతీయ పౌరుడు నిశాంత్ ఉర్తానంతన్ మరణించారు. ఆరోగ్య కారణాల వల్ల మరణించినట్లు భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. అతడి మృతదేహం దుక్మ్ పోర్టులోని ఎంటీ సెలెస్టియన్ నౌకలో ఉంది. అతడి మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్ పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాయబార కార్యాలయం వెల్లడించింది.

### రాహుల్ ఆక్షేపణ

## అమెరికాకు నమ్మకమైన సేవకుడిలా వ్యవహారిస్తున్న మోడీ

**న్యూఢిల్లీ, జూన్ 14:** హర్మూజ్ జలసంధిలో అమెరికా సైనిక దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో కేంద్రం అమెరికాకు ఒక నమ్మకమైన సేవకుడిలా మోడీ వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందిస్తూ అమెరికా ఏమాత్రం పశ్చాత్తాపం చూపకపోగా, వారి ఆదేశాలను పాటించని నౌకలను సహించబోమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో హెచ్చరించడాన్ని ఆయన తప్పుబట్టారు. అమెరికా దాడుల్లో మన ముగ్గురు నావికులు చనిపోయి కొద్ది రోజులే అయింది. అయినా ఇంతవరకు వారి నుంచి కనీసం పశ్చాత్తాపం లేదు, క్షమాపణ లేదు. పైగా, మనకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. అమెరికా సైన్యం ఆదేశాలను తక్షణమే పాటించాలి. ఎలాంటి ఉల్లంఘనలైనా సహించేది లేదన్న వారి మాటలు చూడండి. ఒక స్వతంత్ర దేశం



ఇలాంటి భాషను ఎప్పటికీ సహించదు. కానీ మన బలహీన ప్రధాని మాత్రం నోరు మెదపడం లేదు. ఒక విధేయుడైన సేవకుడిలా వారి ఆదేశాలను వింటున్నారు, పాటిస్తున్నారు. ఈ బలహీన ప్రధాని దేశ గౌరవాన్ని కాపాడలేరు. ఎందుకంటే, దేశాన్ని అవమానించే వాళ్లే ఆయన నియంత్రణలో ఉన్నారు. అందుకే మన వాళ్లను చంపినా, మనల్ని అవమానించినా ఆయన మౌనంగా ఉండిపోతున్నారు. ఇది దేశ ప్రజలందరూ గమనించాలంటూ రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇతర నేతలు కూడా కేంద్రంపై విరుచుకుపడ్డారు. ఈ ఘటనపై అమెరికా బేషరతుగా క్షమాపణ చెప్పాలని పవన్ ఖేరా డిమాండ్ చేశారు. విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందన చాలా బలహీనంగా ఉందని, ఆయన కేవలం ఇది సమర్థనీయం కాదు అనడం సరికాదని అన్నారు. మరో నేత మనీశ్ తివారీ మాట్లాడుతూ, అమెరికా మంత్రి వ్యాఖ్యలు బెదిరింపుగా ఉన్నాయని, నావికుల మృతికి వారే కారణమన్నట్లుగా ఉన్నాయని ఆరోపించారు. ఈ ఘటనపై భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అమెరికాతో మాట్లాడి, నావికుల మృతిపై తీవ్ర నిరసన తెలిపినట్లు వెల్లడించారు. వాణిజ్య నౌకలపై ప్రాణాంతక దాడులు సమర్థనీయం కాదని స్పష్టం చేసినట్లు తెలిపారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో జరిగిన ఈ ఘటన, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానంపై ప్రతిపక్షాలకు ప్రధాన అస్త్రంగా మారింది.

# పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక స్కూల్ బస్సులు

## అధికారులను ఆదేశించిన ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 14:** నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ప్రత్యేక స్కూల్ బస్సులు నడపాలని ఆర్‌టీసీ నిర్ణయించింది. వేసవి సెలవుల అనంతరం నేటి(సోమవారం) నుండి రాష్ట్ర వ్యాప్తంగా 2026–27విద్యాసంవత్సరానికి గాను పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి రవాణా ఇబ్బందులు కలగకుండా అన్ని రూట్లలో తగినన్ని స్కూల్ బస్సులను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి అన్ని రీజియన్‌ల అధికారులను ఆదేశించారు. నూతన విద్యాసంవత్సరంలో మొత్తం 227 పనిదినాలు ఉన్నందున, విద్యార్థులు సకాలంలో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా రవాణా సౌకర్యాలను సిద్ధం చేశామని ఎండీ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని రీజియన్ల అధికారులు, డిపో మేనేజర్లు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి రవాణా ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఎండీ అధికారులను ఆదేశించారు.

ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థుల స్కూల్ టైమింగ్స్‌కు అనుగుణంగా బస్సు సర్వీసులను క్రమబద్ధీకరించాలని, గతంలో నడిపిన అన్ని స్కూల్ రూట్ల ను విధిగా పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు బస్సుల కోసం ఎక్కువ సమయం వేచి ఉండకుండా, ఉదయం, సాయంత్రం వేళల్లో ఖచ్చితమైన సమయ పాలన పాటించాలన్నారు. అవసరమైన చోట అదనపు ట్రిప్పులు నడపాలని క్షేత్ర స్థాయి సిబ్బందిని ఎండీ నాగిరెడ్డి ఆదేశించారు.

# రాహుల్ జన్మదినం 19న జాబ్‌మేళా


## ఎంపి అనిల్ కుమార్ యాదవ్



**హైదరాబాద్,జూన్14,ప్రభావార్త:** రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా ఈనెల 19 గాంధీ భవన్ లో మేఘా జాబ్ నిర్వహిస్తున్నామని ఎంపి అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు.న ఆదివారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ ఈ జాబ్ మేళా100 కంపెనీలు పాల్గొంటాయనీ నిరుద్యోగ యువత అందరూ ఉపయోగించుకోవాలని తెలిపారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక లక్ష మందికి వివిధ రంగాల్లో ఉద్యోగఅవకాశాలు కల్పించిందని తెలిపారు. రాహుల్ గాంధీ విద్యా వ్యవస్థ పై పోరాటం చేస్తున్నారని చెప్పారు విద్యార్థుల జీవితా తో కేంద్రం చెలగాటం ఆడుతోందని ఇక కేంద్ర ప్రభుత్వ ప్రజా,విద్యార్థి,ఉద్యోగ,కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడే రాహుల్‌కు మద్దతుగా ప్రజలు ముందుకు రావాలని అసలమైన ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలనీ ఆయన కోరారు. కేంద్రప్రభుత్వం పేపర్ లీకేజ్ చేసి విద్యార్థుల భవిష్యత్‌పై తీవ్ర ప్రతికూల ప్రభావంపడేలా చేస్తోందనీ అన్నారు. మోడీ ఏడాది కి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తా అన్నడనీ మోడీ ఉన్న ఉద్యోగాలు పీకేస్తుండనీ ఆవేదన చెందారు. మోడీ 12ఏండ్ల పూర్తి అయిన సందర్భంగా ఆయన దేశానికి ఏమి చేశారని సంబరాలు చేస్తున్నారని ప్రశ్నించారు. బ్యాంకాంగ్ తరహాలో ఏదైనా నిర్మాణం చేశారా? బ్యాంకులు జాతీయకరణ వంటి పేదరిక నిర్మూలన కార్యక్రమాలకు దోహదం చేశారా బిజెపి నాయకులు చెప్పాలనీ డిమాండ్ చేశారు. ఇందిరా గాంధీ, నెహ్రూ, రాజీవ్ గాంధీ పివి నర్సింహా రావు చేసి అభివృద్ధి కి పేరు మార్చి మోడీ బజన చేస్తుండనీ అన్నారు. కెటిఆర్ కుటుంబంలో అందరూ వెన్నుపోటు దారులేఎవరు ఎవరికి వెన్నుపోటు పొడుస్తున్నారో ప్రజలకు తెలుసు అని వ్యాఖ్యానించారు.

# వైద్యుల సామర్థ్యాన్ని పెంచే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

## ఆరోగ్య మంత్రి దామోదర్ రాజనర్సింహ



**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 14:** వైద్యుల సామర్థ్యాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరింత పెంచుతుందని అరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఈ అత్యాధునిక సాంకేతి కత వైద్యుల చేతుల్లో ప్రజల ప్రాణాలను కాపాడే శక్తివంతమైన సాధనంగా మారాలని ఆయన ఆకాంక్షించారు. హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రిలో నిర్వహించిన ఆరోగ్య రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సదస్సు ముగింపు కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్యరంగ చరిత్రలోనే అత్యంత కీలకమైన పరివర్తన దశలో ప్రపంచం ఉందన్నారు. ఇప్పటివరకు వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించడంపైనే వైద్య వ్యవస్థ దృష్టి కేంద్రీకృతమై ఉండేదని, అయితే ప్రస్తుతం కృత్రిమ మేధస్సు, జీనోమిక్స్, అత్యాధునిక నిర్ధారణ సాంకే తికతలు, డిజిటల్ హెల్ పరిజ్ఞానం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారించడం, ప్రతి వ్యక్తికి తగిన చికిత్సను అందించడం సాధ్యమవుతోందని తెలిపారు. కృత్రిమ మేధస్సు ఎంతటి అద్భుతమైన సాంకేతికత అయినా, దాని అంతిమ లక్ష్యం ప్రజల జీవితాలను మెరుగుపరచడమే కావాలని మంత్రి స్పష్టం చేశారు. ఆర్థిక సామర్థ్యంతో సంబంధం లేకుండా ప్రతి పౌరునికి వేగవంతమైన, నాణ్య మైన, అందుబాటు ధరలో వైద్య సేవలు పొందేందుకు ఉపయోగ పడితేనే ఆ సాంకేతికత తన లక్ష్యాన్ని చేరుకున్నట్టవుతుందని మంత్రి అన్నారు. హైదరాబాద్ ఇప్పటికే ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, వ్యాక్సిన్ తయారీ, వైద్య పరికరాల్లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని పేర్కొన్న మంత్రి, ఇప్పుడు ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధస్సు పరిష్కారాల అభివృద్ధికి కూడా ప్రపంచ కేంద్రంగా ఎదిగే అన్ని అవకాశాలు తెలంగాణకు ఉన్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు. వైద్య విద్యలో సాంకేతిక విప్లవానికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో డిజిటల్ క్లాస్‌రూమ్స్, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, హైబ్రిడ్ బోధన, సిమ్యులేషన్ ల్యాబ్స్, అత్యాధునిక శిక్షణా సదుపాయాలను ఏర్పాటు చేస్తూ భవిష్యత్ వైద్యులను ఏఐ యుగానికి సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ వైద్యరంగంలో ఇప్పటికే కృత్రిమ మేధస్సు ఆధారిత పలు కార్యక్రమాలు అమలులో ఉన్నాయని మంత్రి వెల్లడించారు. ఎక్స్‌రే చిత్రాల ఏఐ ఆధారిత విశ్లేషణ, సెప్సిస్‌ను ముందుగానే గుర్తించే వ్యవస్థలు, ఫ్యాటీ లివర్ వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించే సాంకేతికతలను ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో ప్రవేశపెడుతున్నామని తెలిపారు.

రాబోయే రోజుల్లో జిల్లా ఆస్పత్రుల్లో కూడా ఏఐ ఆధారిత వ్యాధి నిర్ధారణ వ్యవస్థలను విస్తృతంగా అమలు చేసి, నిపుణుల వైద్య సేవలు అందుబాటులో లేని ప్రాంతాల్లో కూడా అత్యున్నత స్థాయి వైద్య సేవలను ప్రజలకు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. కృత్రిమ మేధస్సు వైద్యులను భర్తీ చేయదని, వారి సామర్థ్యాన్ని మరింత పెంచుతుందన్నారు. సాంకేతికత వైద్యుల చేతుల్లో ప్రజల ప్రాణాలను కాపాడే శక్తివంతమైనసాధనంగా మారాలని మంత్రి అన్నారు. విజన్–2047 లక్ష్యాల దిశగా తెలంగాణ ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ, చికిత్స ఆధారిత వ్యవస్థ నుంచి నివారణ ఆధారిత ప్రజారోగ్య వ్యవస్థగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడిఉందన్నారు. ఆరోగ్యరంగంలో పరిశోధనలు, స్టార్టప్‌లు, నూతన ఆవిష్కరణలకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సహకరి స్తుందని, ప్రజల ప్రయోజనాలను కాపాడే బాధ్య తాయుతమైన కృత్రిమమేధస్సు వినియోగానికి అవసరమైన విధానాలను రూపొందిస్తామని తెలిపారు.

# నా గొంతును కృత్రిమమేధతో అనుకరించారు

## ఎవరిపట్ల అమర్యాదగా మాట్లాడలేదు: మల్లు రవికి వివరణ ఇచ్చిన మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు ఎంఎ షబ్బీర్ అలీ



**హైదరాబాద్,జూన్14,ప్రభాతవార్త:** కృత్రిమ మేథాతో ఆధునిక పద్ధతి లో నా గొంత ప్రతిరూపం (క్లోనింగ్) సృష్టిస్తూ 54 సెకండ్ల నిడివి కలిగిన మార్ఫింగ్‌చేసిన గొంతును ప్రసారం చేశారనీ టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, ఏ మహిళ గురించి కూడా తప్పుడు వ్యాఖ్యలు చేయలేదని మాజీ మంత్రి,ప్రభుత్వ సలహాదారు ఎంఎ షబ్బీర్ అలీ వివరణ ఇచ్చారు.తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి ఇచ్చిన నోటీసులకు సమాధానంగా ఆదివారం మూడు పేజీల వివరణను అందజేశారు. నాపై వస్తున్న ఆరోపణల్లో ఏలాంటి నిజంలేదనీ వ్యక్తిత్వహననంకు పాల్పాడుతున్నారని ఆవేదనతో వివర ణిచ్చారు. నేను కాంగ్రెస్ పార్టీ నేతలపై శ్రేణులపై ఎప్పుడు కూడా దురుసువ్యాఖ్యలు చేయలేదనీ ఇక ముందు కూడా చేయననీ ఆయన తెలిపారు. సామజిక మాద్యమం ఎక్స్ వేదికపై ట్వీట్ చేసి వారిపై, ఆ ట్వీట్ ఆధారంగా తన వ్యాఖ్యలుగా ప్రచారం చేసిన టివి,ఇతం "సామాజిక ప్రసార మాద్యమాలపై క్రిమినల్,సిల్ చర్యలు తీసుకొనేం దుకు చట్టపరమైన సలహా తీసుకొం టున్నాననీ ఆయన తెలిపారు. పోలీసులకు కూడా ఫిర్యాదు చేశానని ఆయన తెలిపారు. ఇలాంటి వాటిని ప్రసారం చేసే ముందు ఫరెన్సిక్ పద్ధతులు ఉపయోగించి ప్రామాణికతను నిర్ధారణ చేసుకోవాలనీ షబ్బీర్ అలీ సూచించారు. కామారెడ్డికి చెందిన గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, మహిళా నేతలు సామాజిక మాద్యమాలలో ప్రసారం అవుతున్న షబ్బీర్ అలీ వ్యాఖ్యలను క్రమశిక్షణ కమిటీ ముందు పెట్టి ఫిర్యాదు చేశారు.దీనితో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులపై షబ్బీర్ అలీ వివరణ ఇచ్చారు. ఈ ఆడియోలో వినిపిస్తున్న వాయిస్ తనది కాదని, తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కొందరు కుట్ర చేస్తున్నారని స్పష్టం చేశారు. క్రమశిక్షణ కమిటీ వివరణ కోరే ముందే ఈ ఆడియోపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్‌తో తనకు నాలుగు దశాబ్దాలుగా సాన్ని హిత్యం ఉందని, ఆయనను సోదరుడిలా భావిస్తానని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. ఆయనపై తాను ఎప్పుడూ తప్పుగా మాట్లాడలేదని, ఇద్దరి మధ్య దూరం పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పార్టీకి నష్టం కలిగించే పనులు తాను చేయనని,కాంగ్రెస్ పట్ల పూర్తి నిబద్ధతతో ఉన్నానని స్పష్టం చేశారు.షబ్బీర్ అలీ పదవులు అందుకోలేని ఒక కార్యకర్తను ఓదార్చుతూ" డబ్బులు పెడుతున్నారు.మహిళలను ఎరగా వేసి పదవులు తీసుకొంటున్నారు.. కాంగ్రెస్ పార్టీ అమ్ముడుపోయింది" అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు 54సెకన్ల ఆడియాలో షబ్బీర్ అలీ గొంతు తరహాలో ఎక్స్ వేదికపై పోస్టు చేశారు. కాంగ్రెస్ పార్టీలో షబ్బీర్ అలీ కంఠం పోలిన గొంతుతో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు వైరల్ అవుతుండటంతో ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలను కూడా కదలించింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకుడితో ఆ పార్టీ సీనియర్ నేత, సిఎం రేవంత్ సన్నిహితుడు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ మాట్లాడినట్టుగా ఉన్న ఈ ఆడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. టిపిసిసి అధ్యక్షుడిని ఉద్దేశించి షబ్బీర్ అలీ అనుచిత వ్యాఖ్యలు చేసిన ట్టుగా ఉన్న ఆ ఆడియో ఢిల్లీ కాంగ్రెస్ అగ్రనే తలు తీవ్రంగా స్పందించినట్లు తెలిసింది. మహేష్ కుమార్ గౌడ్ కూ ఆవేదనతో స్పందించారు. నేను ఏమిటో నావ్యక్తిత్వం, ఆస్తిపా స్తులు, నా పుట్టుక ఏంటో రాష్ట్ర ప్రజలకు తెలుసు. నిజామాబాద్ ప్రజలకు ఇంకా బాగా తెలుసు. 40 ఏళ్లుగా లేని అవినీతి ఇప్పుడెక్కడ నుంచి వస్తుంది? షబ్బీర్ అలీనే ఆ వ్యక్తిని రేవంత్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేర్పించారు. ఎందుకు చేర్పించారో ఆయనే సమా ధానం చెప్పాలి. రేవంత్‌రెడ్డి సిఫారసు చేసినం దుకే చంద్రశేఖర్‌రెడ్డికి టిపిసిసి ప్రధాన కార్యదర్శి పదవి వచ్చింది. షబ్బీర్ అలీ అయినా, ఎవరైనా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలి. మహిళల పరువు తీసేలా వ్యాఖ్యానాలు చేయకూ దదు. దీనిపై ఆయన్ను వివరణ కోరాం. ఈ వ్యవ హారం పార్టీ చూసుకుంటుందనీ అని చెప్పారు. బలహీన వర్గాలకు చెందిన మహేష్‌కుమార్‌గౌడ్‌ను బలహీనతలు కలిగిన వ్యక్తిగా చూపుతూ కొంత మంది ఉద్దేశ్యపూర్వకంగానే లక్ష్యం చేసుకొంటు న్నారనీ ఆ వర్గం పథకం ప్రకారం ఆయనపై ఒక తప్పుడు అభిప్రాయం మలిచేందుకు కుట్రలు చేస్తు న్నారని కాంగ్రెస్‌లోని శ్రేణులు చర్చించుకొంటున్నారు.

# వానాకాలం సాగుకు తొందరొద్దు

## నీటి సౌకర్యం ఉన్న మెట్ట పంటలనే ఎంచుకోండి

## భూమిలో అవసరమైన తేమ తర్వాతే నాటాలి

## వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రణాళిక

## వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి

**హైదరాబాద్, జూన్ 14, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాకాలం ఎలా ఉంటుందనే దానిపై అనిశ్చితి నెలకొనడంతో రాష్ట్రంలో వానాకాలం సాగుకు రైతులు తొందరపడొద్దని వ్యవసాయశాఖ సూచించింది. రుతుపవన కాలంలో తొలివర్షం కురిసిన వెంటనే పంటలు వేయవద్దని రైతులకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి ఆదివారం ఒక ప్రకటనలో రైతులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో కనీసం 50 నుంచి 70 మిల్లీమీటర్ల వర్షం కురిసే వరకు, అదీ కూడా పంటకు అవసరమైనంత తేమ నేలలో ఉందని నమ్మకం కుదిరిన తర్వాతే రైతులు పంటల సాగుకు సిద్ధమవ్వాలన్నారు. రైతులు వేచి చూసే వైఖరిని అవలంబించాలని, సాధ్యమైనంత వరకు నీటిపారుదల సౌకర్యం ఉన్న మెట్ట పంటలను ఎంచుకోవాలని మేము విజ్ఞప్తి చేస్తున్నారు. వచ్చే మూడు,నాలుగు రోజుల్లో రుతుపవనాలు రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకు కూడా వ్యాపించి, వర్షాలు విస్తరిస్తాయని ప్రస్తుత అంచనాలు చెబుతున్నాయని వెల్లడించారు. కాబట్టి రైతులు కొంత జాగ్రత్తతో పంటలు నాటా లని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని దాదాపు 60 శాతం సాగుభూమి వర్షంపై ఆధారపడి రైతులు పంటలు పండిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో రుతుపవనాల రాకలోనే కాకుండా, వర్షాలు కొనసాగడంలో కూడా జాప్యాన్ని పరి గణనలోకి తీసుకుని ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. వర్షాలు ప్రారంభమైనా, ఆలస్యమైనా, నాట్లు వేసినప్పటి నుండి పంట కోత వరకు పట్టే సమయం తగ్గిపోతున్న కొద్దీ, రైతులు పండించుకోవడానికి వీలుగా విత్తనాల లభ్యతను సర్దుబాటు చేయడానికి సంబంధిత ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. వర్షాలు ఎలా ప్రారంభమై, కొనసాగుతాయనే దానిపై ఈ సర్దుబాటు ఆధారపడి ఉంటుంది. కొన్ని జిల్లాల్లో రైతులు శాఖకు చెందిన ఎరువుల యాప్ ద్వారా యూరియాను కొనుగోలు చేయడం ప్రారంభిం చగా, సుమారు 3.20 లక్షల మంది రైతులు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకున్నారన్నారు. వ్యవసాయ కార్యకలాపాలు ఎక్కడ ప్రారంభమవుతున్నాయో యూరియా అమ్మకాలు తకు సూచిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని నిజామాబాద్, కామారెడ్డి, వరంగల్‌లోని కొన్ని ప్రాంతాల్లో యూరియాకు మంచి డిమాండ్ ఉందని వెల్లడించారు. తెలంగాణలో ఖరీఫ్ మాసంలో సాధారణ సాగు విస్తీర్ణంలో సగానికి పైగా అంటే సుమారు 130 లక్షల ఎకరాలు వర్షాధార వర్గం కిందకు వచ్చినప్పటికీ, వాటి పరీవాహక ప్రాంతాల్లో ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురు స్తాయని అంచనా ఉందన్నారు. దీంతో కృష్ణా, గోదావరి నదుల పరిస్థితి ఎలా ఉంటుందనే దానిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. మహారాష్ట్ర, కర్ణాటకల లోని వాటి పరీవాహక ప్రాంతాల్లో ఏం జరుగుతుందో అనేది తాము నిశితంగా గమనిస్తున్నామని, ఎందుకంటే నదులలోకి వచ్చే నీటి ప్రవాహం వ్యవసాయంపై కూడా ప్రభావం చూపుతుందని డాక్టర్ గోపి అన్నారు.

# తక్కువ నీటితో పండే పంటలకు ప్రోత్సాహం

## ఎల్‌నినోకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం: వ్యవసాయ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, జూన్ 14, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటలకు ప్రోత్సా హం కల్పించాలని నిర్ణయించినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి ఏప్రిల్ నెలలోనే వ్యవసాయ , వ్యవసాయ విశ్వవిద్యాలయ, వాతావరణ శాఖలతో సమీక్ష నిర్వహించి ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో ఎల్‌నినో ప్రభావం కనిపించే అవకాశం ఉన్నందున వర్షాలు ఆలస్యం, తక్కువగా నమోదైనా రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందించామన్నారు. వరి పంటలపై అధికంగా ఆధారపడకుండా రైతులను పంటల వైవిధ్యీకరణ వైపు ప్రోత్స హించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. కందులు, పెసలు, మినుములు, జొన్నలు, సజ్జలు, మొక్కజొన్న, నువ్వులు, ఆముదం వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్స హించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు కందులు, జొన్నలు, మొక్కజొన్న, సజ్జలు వంటి పంటలకు సంబంధించి 87.49 లక్షల క్వింటాళ్ల విత్తనాలను జిల్లాల్లో ముందుగానే నిల్వ చేసినట్లు వివరించారు. రైతులకు ఎరువుల లభ్యతను సులభంగాను, పంపిణీలో పారదర్శకతను పెంచే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. రైతుల నుంచి వచ్చిన సూచనలు, అభిప్రాయాలకు అనుగుణంగా ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌లో పలు మార్పులు చేసినట్లు తెలిపారు. జిల్లా వారీగా డీలర్ల స్టాక్ నిర్వహణ, మండల మ్యాపింగ్ సదుపాయాలతో పాటు మీ సేవ కేంద్రాల ద్వారా కూడా ఎరువుల బుకింగ్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఒక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రైతులు వ్యవసాయశాఖ సూచనలను పాటించాలని కోరారు. రైతులకు ఖచ్చితమైన, సమయానుకూలమైన వాతావరణ సమాచారాన్ని అందించేందుకు తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, పంట నష్టాలను తగ్గించడం లక్ష్యంగా ఇటువంటి సాంకేతిక ఆధారిత కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు తెలిపారు.

# ప్రాణదానం కంటే గొప్ప దానం లేదు: గవర్నర్ శివప్రతాప్ శుక్లా

## ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా లోక్‌భవన్‌లో రక్తదాన శిబిరం



ఆదివారం లోక్‌భవన్‌లో జరిగిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్ అందిస్తున్న గవర్నర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జూన్14:** రక్తదానం మహాదానమని,ఒక వ్యక్తికి ప్రాణదానం చేయడం కంటే గొప్ప దానం మరొకటి లేదని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా లోక్ భవన్‌లోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో భారత రెడ్‌క్రాస్ సొసైటీ, తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛంద రక్త దాన శిబిరాన్ని గవర్నర్ ప్రారంభించి ప్రసంగించారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, రక్తదానం కేవలం వైద్య సహాయం మాత్రమే కాదని, అది మానవత్వానికి, కరుణకు, సామాజిక బాధ్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. రక్తంలోని ప్రతి చుక్క ఒక రోగికి కొత్త ఆశను, ధైర్యాన్ని, జీవించే అవకాశాన్ని అందిస్తుందని అన్నారు. భారతీయ సంస్కృతిలో దానానికి విశిష్ట స్థానం ఉందని,అందులో రక్తదానం అత్యున్నత మైనదిగా భావిస్తారని తెలిపారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా అపరిచితుల ప్రాణాలను కాపాడేందుకు ముందుకొచ్చే స్వచ్ఛంద రక్తదాతలు సమాజానికి నిజమైన హీరోలని కొనియాడారు. భారత రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా స్వచ్ఛంద రక్తదాతల సేవలను అభి నందిస్తున్నానని పేర్కొన్న గవర్నర్, వారి సేవలు మానవీయ విలువలను బలోపేతం చేయడంతో పాటు వసుధైవ కుటుంబకం భావనను ఆచరణలో ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. రక్తదాన ఉద్యమాన్ని గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు, యువజన సంఘాల స్థాయికి విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. యువత, మహిళలు, ప్రతి పౌరుడు స్వచ్ఛంద రక్తదానాన్ని తమ జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ ఏడాది ప్రపంచ రక్తదాతల దినోత్సవం థీమ్ అయిన 'వన్ డ్రాప్ ఆఫ్ హ్యూమానిటీ –గివ్ బ్లడ్,సేవ్ లైవ్స్' మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తోందని గవర్నర్ అన్నారు. రక్తదానం ద్వారా భాష, ప్రాంతం, కులం,మతం వంటి భేదాలకు అతీ తంగా మానవత్వాన్ని చాటవచ్చని పేర్కొన్నారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కృషి చేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, సాంకేతిక నిపుణులు, స్వచ్ఛంద కార్యకర్తలు, కార్పొరేట్ సంస్థలను గవర్నర్ అభినందించారు. రక్తదానాన్ని ప్రజాఉద్యమంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణను క్షయ (టీబీ),మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు తన ప్రయత్నాలు కొనసాగుతాయని గవర్నర్ తెలిపారు. టీబీ రహిత, మాదకద్రవ్యాల రహిత తెలంగాణ లక్ష్య సాధనలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, యువత, పౌర సమాజం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిషోర్ మాట్లాడుతూ, తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరిం చిన ప్పటి నుంచి శివ ప్రతాప్‌శుక్లా క్షయ వ్యాధి నిర్మూ లన, మాదకద్రవ్యాల నియంత్రణ, రెడ్‌క్రాస్ సేవల విస్తరణ కోసం విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీని బలోపేతం చేసేందుకు గవర్నర్ ప్రత్యేక చర్యలు చేపట్టారని, ఆయన చొరవతో గత కొంతకాలంలో ఐదు వేలకుపైగా కొత్త సభ్యత్వాలు నమోద య్యాయని వెల్లడించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నాలుగు విభాగాల్లో విశిష్ట సేవలం దించిన వైద్యులు, అత్యధిక సార్లు రక్తదానం చేసిన దాతలు, రక్తదాన శిబిరాల నిర్వా హకులు, అలాగే కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కింద భారత రెడ్‌క్రాస్ సొసైటీ తెలం గాణ శాఖకు విశేష సహకారం అందించిన సంస్థల ప్రతినిధులను గవర్నర్ సత్కరించి పురస్కారాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో దాన కిషోర్‌తో పాటు శాంతిభద్రతల విభాగం డైరెక్టర్ జనరల్ మహేష్ భగవత్, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ శాఖ ప్రధాన కార్యదర్శి సీఈఓ ప్రొఫెసర్ ఎ.శ్రీరాములు, ట్రెజరర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజయ డెయిరీ అభివృద్ధి, విస్తరణ

## ఎన్డీడీబీ ఇడితో డెయిరీ డెవలప్‌మెంట్ ఛైర్మన్ భేటీ

**హైదరాబాద్, జూన్ 14, ప్రభాతవార్త:** విజయ డెయిరీ అభివృద్ధి, విస్తరణ, ఆధునికీకరణపై సంస్థ యాజమాన్యం చర్యలు చేపట్టింది. ప్రధానంగా విజయ మెగా డెయిరీలో ఉత్పత్తుల తయారీ సామర్థ్యాల విస్తరణ, ఆధునికీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టిసారించింది. ఈ నేపథ్యంలో గుజరాత్ రాష్ట్రంలోని ఆనంద్‌లో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్డీడీబీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రఘుపతితో తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి భేటీ అయ్యారు. ప్రధానంగా విజయ మెగా డెయిరీలో ఉత్పత్తుల తయారీ సామర్థ్యం పెంచేందుకు చేపట్టాల్సిన చర్యల గూర్చిచర్చించారు. రాష్ట్రవ్యాప్తంగావిజయ డెయిరీ అవుట్‌లెట్ల సంఖ్యను 200 నుంచి 600లకు పెంచాలని ఇప్పటికే రూపొందించిన ప్రణాళికలు ఈ భేటీలో వీరి మధ్య ప్రస్తావనకు వచ్చాయి. రాష్ట్రంలో విజయ డెయిరీ వృద్ధికి తీసుకున్న చర్యలు,వాటి ఫలితాలను వివరించారు. కేవలం పాలు మాత్రమే కాకుండా 28రకాల పాల ఉత్పత్తులను మార్కెట్లోకి విజయ వంతంగా తీసుకురావడం, రైతుల కోసం మిల్క్ ప్రొక్యూర్‌మెంట్ యాప్ ప్రవేశపెట్టి పారదర్శక తను తీసుకురావడమే కాకుండా, పాడి పశువులపై సబ్సిడీలను అందించి చిన్న, సన్న కారు రైతులకు అదనపు ఆదాయాన్ని సమకూర్చడం వంటి వాటిపై తాము తీసుకున్న చర్యలు, వాటి ఫలితాలను ఎన్డీడీబీ ఇడికి తెలియచేశారు. ఇదే సమయంలో డెయిరీ ఆధునికీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై సహకారాన్ని అందివ్వాలని కోరారు. దీంతో పాటు,పాడి రైతుల ప్రయోజనాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ విజయ డెయిరీ అభివృద్ధికి ఎన్డీడీబీ తరపున పూర్తిసహకారం అందిస్తామని రఘుపతి హామీ ఇచ్చారు.

# తడిసిన ధాన్యం రాశులు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

**హైదరాబాద్, జూన్ 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. వరద ప్రవాహంతో పలు చోట్ల రాకపోకలు నిలిచిపోగా, ఈదురు గాలులకు విద్యుత్ స్థంభాలు, చెట్లు నేలకూలాయి. ధాన్యం రాశులు నీటిపాలు కాగా, పలు పంటలకు నష్టం వాటిల్లింది. రాష్ట్రంలోని 30 జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా 621 మండలాలు ఉండగా, 435 మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఖమ్మం, కొత్తగూడెం, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, హైదరాబాద్ జిల్లాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. రాష్ట్రంలోని భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో భారీ వర్షం కురవగా 65వ నంబరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బలమైన ఈదురు గాలులకు ఎస్.లింగోటం, తాళ్ల సింగారం ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు కూలిపోయాయి. మునుగోడు పత్తి మిల్లు వద్ద చౌటుప్పల్ రోడ్డుపై వరద రావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మల్రివాగు వంతెన వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు వరద ప్రవాహానికి తెగిపోయింది. సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్, పటాన్‌చెరు తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం లక్ష్మీపురంలో వర్షం ధాటికి 25 ఎకరాల్లో వేసిన అరటి పంట ధ్వసమైంది. ఇదే మండలంలోని తిమ్మంపేటలో గేదెల షెడ్డు కూలిపోయింది. వర్ధన్నపేట మండలం కోనాపురంలో పలువురి ఇళ్లపై కప్పులు ఎగిరిపోయాయి.ఉమ్మడి నల్లగొండ, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి.సూర్యాపేట జిల్లాలో కురిసిన వర్షానికి, ఈదురుగాలుల దెబ్బకు 780 విద్యుత్ స్తంభాలు, 30 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినగా విద్యుత్ శాఖకురూ.80లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. రాఘవాపురంలో వర్షానికి తడిసిన గోడ కూలగా, దాని కింద పడి అనుముల మల్సూర్(75) అనే వృద్ధుడు మరణించాడు. అలాగే భువనగిరి జిల్లా రాజాపేట మండలం బొందుగుల గ్రామంలోనూ విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రాశులపై కప్పిన పరదాలు ఎగిరిపోవడంతో ధాన్యం తడిసి ముద్దయింది. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామ పాత కొండారం రెవెన్యూ శివారులో నిమ్మతోటలు నేలకొరిగాయి. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలో అర్ధరాత్రి ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఇంటి పైకప్పులు ఎగిరిపోయాయి.

# ఆర్‌టీసీ రిటైర్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి: 18న బస్ భవన్ వద్ద దీక్ష

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 14:**టిజిఎస్ ఆర్టీసీలో ఉద్యోగవిరమణ చేసిన కార్మిక, ఉద్యో గులకు చెల్లించాల్సిన రివైజ్డ్ పేస్కేలు(ఆర్‌పీ ఎస్–2017) అరియర్స్‌వెంటనే చెల్లించాలని టిఎస్ఆర్ టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(సిఐ టియు) డిమాండ్ చేసింది. 2017నుంచి ఇప్పటి వరకు చెల్లించలేదని,ఎప్పుడు చెల్లిస్తారో కూడా చెప్పగలిగే స్థితిలో ఆర్టీసి యాజమాన్యం ఉందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివిఎస్ రావు అన్నారు. ఆర్‌టీసీలో రిటైరైన వారి సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం, యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. వారికి చెల్లించాల్సిన బకాయిలను చెల్లించడం కోసం వెంటనే రోడ్ మ్యాప్‌ను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న బస్ భవన్ వద్ద దీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆర్‌పిఎస్–2017 ప్రకటించే నాటికి 11,015 మంది రిటైరైన కార్మికులు ఉన్నారని, ఇది ప్రకటించిన తర్వాత నుండి నేటి వరకు ప్రతి నెల 250 నుండి 300 మంది వరకు ఉద్యోగ విరమణ చేస్తున్నారన్నారు. గత 26 నెలల కాలంలో ఉద్యోగ విరమణ చేసిన వారితో కలిపి మొత్తం 17,515 మంది ఉన్నారని తెలిపారు. 2017 ఏప్రిల్ 1 నుండి 2024 మే వరకు రిటైరైనవారికి టెర్మినల్ లీవు ఎన్ క్యాష్మెంటు, గ్రాట్యుటీ డిఫరెన్స్ అమౌంట్స్ కూడా అనేకమందికి చెల్లించలేదని ఆ కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నా యన్నారు. రిటైరైన కార్మికులకు చెల్లించాల్సిన బకాయిల విలువ రూ.837 కోట్లు ఉంటుందన్నారు.

# శాంతి ఒప్పందం తరుణంలో ఈ దాడులేమిటి?

## ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై ట్రంప్ ఫైర్



**వాషింగ్టన్, జూన్ 14:** ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరే దశలో ఉన్న సమయంలో లెబనాన్ రాజధాని బీరూట్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు నిర్వహించడం తగదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో స్పందించారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి అత్యంత చేరువలో ఉన్న ఈ కీలక సమయంలో బీరూట్‌పై జరిగిన దాడి జరగకూడదు. ఇజ్రాయెల్‌కు తన భద్రతను కాపాడుకునే హక్కు ఉంది. అయితే ప్రతిస్పందనగా జరిగిన దాడి చాలా చిన్నది, ప్రాధాన్యతలేనిది. అందులో ఎవరూ గాయపడలేదు లేదా మరణించలేదు. అలాంటి ఘటనలు శాంతి ప్రక్రియకు ఆటంకం కలిగించకూడదని ట్రంప్ పేర్కొన్నారు. శాంతి ఒప్పందానికి అన్ని పక్షాలు సహకరించాలని మధ్యప్రాచ్య ప్రాంతంలో శాంతి నెలకొల్పే ఒప్పందం దాదాపు సిద్ధమైందని ట్రంప్ తెలిపారు. లెబనాన్ సహా మొత్తం ప్రాంతానికి శాంతిని తీసుకురాగల ఒప్పందం కుదిరే దశలో ఉంది. అందువల్ల అన్ని పక్షాలు సంయమనం పాటించాలి. లెబనాన్‌లో ఎక్కడా ఇజ్రాయెల్ మరిన్ని దాడులు చేయకూడదు. అలాగే హిజ్బుల్లా సహా ఇతర వర్గాలు కూడా ఇజ్రాయెల్‌పై దాడులు నిలిపివేయాలి. ఇది దీర్ఘకాలిక శాంతికి నాంది కావచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం చర్చల్లో ఉన్న ఇరాన్ ఒప్పందం పట్ల ఇజ్రాయెల్ ప్రభుత్వం అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. పాకిస్తాన్ తదితర దేశాల మధ్యవర్తిత్వంతో జరుగుతున్న చర్చల్లో ఇజ్రాయెల్‌కు ప్రాధాన్యం తగ్గిందని భావిస్తున్నారు. గత వారం బీరూట్ శివార్లపై ఇజ్రాయెల్ జరిపిన దాడులు, ఏప్రిల్ 7న అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణ తర్వాత ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య అత్యంత తీవ్రమైన ఉద్రిక్తతలకు దారితీశాయి. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో, ఉత్తర ఇజ్రాయెల్‌పై హిజ్బుల్లా జరిపిన రాకెట్ దాడులకు ప్రతిస్పందనగానే బీరూట్‌పై దాడులు నిర్వహించినట్లు తెలిపింది. ఇజ్రాయెల్ సైన్యం ప్రకారం, హిజ్బుల్లా మూడు ప్రొజెక్టైళ్లను ప్రయోగించింది. ఇందుకు సంబంధించిన వీడియోలను కూడా విడుదల చేసింది. అయితే ఇరాన్ మద్దతు ఉన్న హిజ్బుల్లా నుంచి తక్షణ స్పందన రాలేదు. బీరూట్‌లో భయాందోళనలుదాడుల్లో బీరూట్‌లోని ఐదు అంతస్తుల అపార్ట్‌మెంట్ భవనం దెబ్బతిన్నట్లు సమాచారం. భవనం దిగువ అంతస్తులు తీవ్రంగా నష్టపోయాయి. గత కొన్ని వారాలుగా పరిస్థితులు ప్రశాంతంగా ఉండటంతో తిరిగి ఇళ్లకు చేరుకున్న దక్షిణ బీరూట్ నివాసులు మళ్లీ భయంతో ప్రాంతాన్ని విడిచిపెడుతున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

మధ్యప్రాచ్య ఘర్షణలకు ముగింపు పలకడానికి జరుగుతున్న చర్చల్లో లెబనాన్‌లోని యుద్ధ పరిస్థితులు కూడా చేర్చాలని ఇరాన్ కోరుతోంది. అయితే ఇందుకు అనుగుణంగా ఇజ్రాయెల్ సైన్యం లెబనాన్ నుంచి ఎప్పుడు, ఎలా వెనక్కి వెళ్తుందనే అంశంపై ఇంకా స్పష్టత లేదు.



సాలార్‌జంగ్ మ్యూజియం ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాల జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా,కార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు,రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

## సాలార్‌జంగ్ మ్యూజియం ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాలను ప్రారంభించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**హైదరాబాద్(చార్మినార్), జూన్ 14 ప్రభాతవార్త :** సాలార్‌జంగ్ మ్యూజియం ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాలతో పాటు మూడవ సాలార్‌జంగ్ నవాబ్ మీర్ యూసుఫ్ అలీ ఖాన్ జయంతి ఉత్సవాలను ఆదివారం సాయంత్రం రాష్ట్ర గవర్నర్, సాలార్‌జంగ్‌మ్యూజియం బోర్డు చైర్మన్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ కళాఖండాలకు నిలయమైన సాలార్‌జంగ్ మ్యూజియంకు ప్రపంచంలోనే గొప్ప పేరుందని తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని సందర్శించటానికి వచ్చే పర్యాటకులు తప్పకుండ సాలార్‌జంగ్ మ్యూజియంను ఎంతో మక్కువతో తిలకిస్తారని, సాలార్‌జంగ్ మ్యూజియం భావి తరాల వారికి ఎంత గానో ఉపయోగ కలుగుతుందని ఆయన తెలియజేశారు. తెలంగాణరాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ మూడవ సాలార్‌జంగ్ నవాబ్ మీర్ యూసుఫ్ అలీ ఖాన్ బహదూర్ మన దేశంతో పాటు ప్రపంచంలోని పలు దేశాలు నుంచి నలభై మూడు వేల అద్భుతమైన కళాఖండాల ను సేకరించారని తెలిపారు. నగరంలో ఎన్నో చారిత్రక కట్టడాలు ఉన్నాయని, మూసీ నది ప్రక్షాళన చేయను న్నామని ఆయన తెలియజేశారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మూడవ సాలార్ జంగ్ నవాబ్ఒక్కరే వేలాది కళాఖండాలను సేకరించి చరిత్రలో నిలిచారని తెలిపారు. చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ మాట్లాడుతూ సాలార్‌జంగ్ మ్యూజియంకు ప్రపంచంలో గొప్ప పేరుందని, ముగ్గురు సాలార్ జంగ్‌లు కలిసి ఎంతో అద్భుతమైన కళాఖండాలను సేకరించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.దాన కిశోర్, సాలార్‌జంగ్ మ్యూజియం బోర్డు సభ్యులు నవాబ్ ఎత్తెరామ్ అలీఖాన్, ప్రొఫెసర్ తిరుమల రావు, సాలార్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ ప్రియాంక మేరీ ప్రాంచీస్, మాజీ డైరెక్టర్ డాక్టర్ ఏ.కె.వి.ఎస్.రెడ్డి. మ్యూజియం కీపర్ బి.ఆర్, నాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. కాగా రాష్ట్ర గవర్నర్, డిప్యూటీ సిఎం పాతబస్తీకి విచ్చేసిన సందర్భంగా మీర్‌చౌక్ పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

సాలార్‌జంగ్ మ్యూజియం 75 సంవత్సరాల ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఈ ఉత్సవాలలో వారం రోజుల పాటు సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రత్యేక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.




## ఆపరేషన్ సిందూర్‌తో పాక్ అణుభద్రతా కవచం పటాపంచలు

### సిప్రీ సంచలన నివేదిక

**స్టాక్‌హోం, జూన్ 14:** ఆపరేషన్ సింధూర్‌తో భారత్ పాకిస్తాన్ అణు భద్రతా కవచాన్ని బద్దలు కొట్టిందని స్టాక్ హోంకేంద్రంగా పనిచేస్తున్న సిప్రి నివేదిలో ప్రస్తావించింది. పాకిస్తాన్ అణ్వాయుధ మౌలిక సదుపాయాలతో సంబంధం ఉన్నాయని భావిస్తున్న ఎంపిక చేసిన పాకిస్తానీ వైమానిక స్థావరాలు మరియు క్షిపణి వ్యవస్థలను భారత వైమానిక దళం, సైన్యం నేరుగా లక్ష్యంగా చేసుకున్నాయని సిప్రీస్పష్టం చేసింది. పాకిస్తాన్ ప్రధాన అణు కమాండ్, నియంత్రణ కేంద్రంగా భావించే వ్యూహాత్మక నూర్ ఖాన్ ఎయిర్ బేస్ భారత్ దాడిలో ధ్వంసమైంది. గతంలో ప్రధాని మోడీ మాట్లాడుతూ భారత్ పాకిస్తాన్ అణు భయాలను పటాపంచలు చేసిందని చెప్పారు. ఇప్పుడు సిప్రి నివేదిక కూడా ఇదే విషయాన్ని హైలెట్ చేసింది. పహల్గామ్ దాడికి ప్రతీకారంగా భారత్ పాకిస్తాన్‌సౌ ఆపరేషన్ సిందూర్ పేరుతో భారీ దాడులు చేసిన దాడుల్లో పాకిస్తాన్, పీఓకేలోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. పాకిస్తాన్ సైన్యం భారత్‌పై దాడికి ప్రయత్నిస్తే, ఆ దేశ వైమానిక దళానికి చెందిన కీలకమైన ఎయిర్‌బేసుల్ని భారత్ ధ్వంసం చేసింది. ఈ దాడులతో పాకిస్తాన్ అణు అహంకారం బద్ధలైంది. పాకిస్తాన్ భారత్‌లో ఉగ్రదాడి చేసిన ప్రతీ సందర్భంలో తమ వద్ద అణ్వాయుధాలు ఉన్నాయని బ్లాక్‌మెయిల్ చేస్తూ వచ్చేది. కానీ, సిందూర్‌లో భారత్ పాక్ అణుమౌలిక సదుపాయాలపై దాడులు చేసింది. పాక్ తన అణ్వా యుధాలను దాచి ఉంచే కైరానా హిల్స్‌పై భారత్ దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

## రాజకీయాలపై ఆసక్తితో కెటిఆర్‌ను కలిసిన జెన్‌జీ యువతులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్14:** పార్టీ రాజకీయాలతో ఉండే తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆసక్తికరమైన దృశ్యం కనిపించింది. రాజకీయాల్లో ఉండే పార్టీ నేతలు, కార్యకర్తలు, సమస్యలతో వచ్చే ప్రజలే కాకుండా ఈ రోజు నలుగు జెన్ జీ యువతులు నేరుగా వచ్చి కెటిఅర్ ను కలిసారు. సాధారణంగా నేతలు, కార్యకర్తలు సందడి చేసే పార్టీ కార్యాలయానికి, ఉన్నత చదువుల కోసం సిద్ధమవుతున్న నలుగురు యువ విద్యార్థినులు నేరుగా వచ్చారు. తమ భవిష్యత్తు గురించి, తమకున్న రాజకీయాసక్తుల గురించి నేరుగా తెలుసుకోవాలనే సంకల్పంతో వారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన తీరు అందరినీ ఆకట్టుకుంది. తాము రాజకీయాల్లోకి రావాలన్న లక్ష్యంతో భవిష్యత్తును ప్లాన్ చేసుకుంటున్నామని తెలిపారు.

తాము మీరు కలిసి పనిచేస్తామని కెటిఅర్‌కు తెలిపారు. ఇప్పటికే పాఠశాల దశ నుంచి ఒక గ్రూప్ గా తాము పాలసీ అంశాలతో సమాజంలో మార్పు తీసుకురావలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. కెరీర్ మాత్రమే లక్ష్యంగా.. ఉద్యోగాల కోసం తపన పడే ఈ రోజుల్లో నలుగురు ఆడబిడ్డలు నేరుగా తనను వచ్చి కలవడంపైన కెటిఅర్ సంతోషం వ్యక్తం చేశారు. రాజకీయాల్లోకి రావాలనుకుంటున్న ఈ యువతకు కేటీఆర్ గట్టి భరోసానిచ్చారు. రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తితో తన దగ్గరకు వచ్చిన ఈ నలుగురిని చూసి ఆశ్చర్యపోయానని, వారితో గడిపిన క్షణాలు తనకి ఎంతో సంతోషాన్ని ఇచ్చాయని కేటీఆర్ స్వయంగా తన ట్వీట్టర్ పేర్కొన్నారు.

ఈ నలుగురు విద్యార్థినులలో లండన్‌లోని కింగ్స్ కాలేజీలో పాలిటిక్స్, ఎకనామిక్స్ అండ్ ఫిలాసఫీ చదవనున్న సరయు, నల్సార్ లా యూనివర్సిటీ విద్యార్థిని లాస్య, సింబయాసిస్ లా స్కూల్ విద్యార్థిని రేవతి మరియు సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీలో బీకాం చదువుతున్న అశ్విని ఉన్నారు. రాజకీయ పరిస్థితిని, పాలనా పరమైన అంశాలను క్షేత్రస్థాయిలో అర్థం చేసుకోవాలని వారు కోరగా, కేటీఆర్ సానుకూలంగా స్పందించారు.

## 23 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తే సహించేది లేదు..

### పాఠశాలల మూసివేతకు అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు, మేధావులు ఖండించాలి: రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో జిల్లపల్లి అంజీ, నీల వెంకటేష్, మోదీ రాందేవ్, సి.రాజేందర్, అనంతయ్య తదితరులు

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 14 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని నిరుపేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలలను 27 వేల నుంచి 4 వేలకు తగ్గిస్తామని 23 వేల పాఠశాలలను మూసి వేస్తామని సిఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనను తక్షణమే ఉపసంహరించుకోవాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. వారంరోజుల్లోగా సిఎం ప్రకటన చేయాలని లేకపోతే రాష్ట్రంలో మంత్రులు తిరగనీయబోమని, పెద్ద ఎత్తున ఉద్యమం కొనసాగుతుందని, యుద్ధమే జరుగుతుందని ఆయన హెచ్చరించారు. సిఎం చేసిన వ్యాఖ్యలపై అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు, మేధావులు తీవ్రంగా ఖండించి, రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. రాష్ట్ర బిసి యువజన సంఘం అధ్యక్షుడు జిల్లపల్లి అంజీ, విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ మోదీ రాందేవ్, సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేష్ ఈ సమావేశానికి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3 రోజుల క్రితం ఢిల్లీలో నీతి అయోగ్ సమావేశం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీని కలిసిన సిఎం రేవంత్‌రెడ్డి విద్యా ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ప్రకటించారని, ఆ తరువాత ఇక్కడికి వచ్చి ప్రభుత్వ పాఠశాలలను 27 వేల నుంచి 4 వేలకు తగ్గిస్తామని ప్రకటించడం దారుణమని, ఇది ప్రమాదకరమైన, ప్రజా వ్యతిరేకమైన చర్యని విమర్శించారు.

## మమత మేనల్లుడికి బిగుస్తున్న కేసుల ఉచ్చు..

### ఒకదానివెంట మరొకటి కేసుల పరంపర

**తాజాగా సీఐడీ విచారణకు మరోసారి హాజరైన అభిషేక్ బెనర్జీ**



**కోల్‌కతా, జూన్ 14:** తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, లోక్ సభ సభ్యుడు ఆదివారం ఎంఎల్‌ఏ సంతకాల ఫోర్జరీ కేసులో విచారణకు హాజ రయ్యేందుకు రాష్ట్ర క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) ప్రధాన కార్యాలయం భవానీ భవన్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు హాజరుకావాలని సీఐడీ అధికారులు సమన్లు జారీ చేసినప్పటికీ, నిర్ణీత సమయానికి ముందుగానే ఆయన కార్యాలయానికి చేరుకున్నారు. ఉదయం 11:43 గంటలకు భవానీ భవన్‌కు చేరుకున్న అభిషేక్ బెనర్జీ, ముందుగా రిసెప్షన్‌లో తన గుర్తింపు కార్డును చూపించి హాజరు నమోదు పుస్తకంలో సంతకం చేసి లోపలికి వెళ్లారు. ఈ కేసు దర్యాప్తులో రాష్ట్ర పోలీసు ఇంటెలిజెన్స్ విభాగానికి పూర్తిగా సహకరించాలని హైకోర్టు ఆదేశించింది. వచ్చే రెండు వారాల పాటు ఆయనపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని కూడా సీఐడీకి స్పష్టం చేసింది. విచారణ నేపథ్యంలో భవానీ భవన్ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. అదనపు పోలీసు బలగాలు, కేంద్ర భద్రతా సిబ్బందిని మోహరించారు. ఆదివారం సెలవు దినమైనప్పటికీ సీఐడీ అధికారులు ఉదయం నుంచే కార్యాలయానికి చేరుకున్నారు. ఈనెల 11న ఇదే కేసులో అభిషేక్ బెనర్జీ సీఐడీ ఎదుట హాజరై సుమారు ఐదున్నర గంటల పాటు విచారణను ఎదుర్కొన్నారు. అనంతరం రాత్రి సమయంలో ఆయన నివాసానికి వెళ్లారు. ఇక ఈనెల 15న ఆయనను పశ్చిమ బెంగాల్‌లో సంచలనం సృష్టించిన పాఠశాల ఉద్యోగాల నియామకాల కుంభకోణం కేసులో విచారణ కోసం ఈడీ సాల్ట్‌లేక్ కార్యాలయానికి హాజరుకావాలని నోటీసులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి ఈనెల 3న ఈడీ నోటీసు అందజేసింది. మరోవైపు, ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను బెదిరించడం, హింసను ప్రేరేపించారనే ఆరోపణలపై నమోదైన మరో కేసులో మంగళవారం మళ్లీ సీఐడీ ఎదుట హాజరుకావాల్సి ఉంది. ఈ కేసుకు సంబంధించిన నోటీసును ఈనెల12 సాయంత్రం సీఐడీ అధికారులు అందజేశారు. సోమ మంగళవారాల్లో జరిగే విచారణలకు అభిషేక్ బెనర్జీ హాజరవుతారా లేదా అన్నది ప్రస్తుతం స్పష్టంగా లేదు. ఈ రెండు కేసుల్లో ఆయనకు ఇప్పటివరకు హైకోర్టు నుంచి ఎలాంటి రక్షణ లభించలేదు.

## ప్రకాశం బ్యారేజికి వరద కళ

### ఎగువ నుంచి భారీగా చేరుతున్న వర్షం నీరు

**విజయవాడ,జూన్14,ప్రభాతవార్తప్రతినిధి:** ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల కృష్ణా నది జలకళను సంతరించుకుంది. ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ఈ ఉదయం గేట్లను ఎత్తివేశారు అధికారులు. సుమారు 2,000 నుంచి 3,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన తర్వాత ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా నది దిగువ భాగానికి నీరు వదలడం ఇదే మొదటిసారి. తెలంగాణా, ఏపీల్లోని ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. దీంతో కృష్ణకు ఉప నది మున్నేరుకు వరద నీరు పెరిగింది.

ఇదే సమయంలో వైరా, కట్టలేరులకు వరద నీరు పెరిగింది. ఈ వరద దిగువన కృష్ణా నదిలో కలుస్తుంది. దీంతో ప్రకాశం బ్యారేజీకి భారీ వరద నీరు వచ్చి చేరుతుంది. ఇకఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో స్థానిక పరివాహక ప్రాంతాల నుంచి బ్యారేజీకి వచ్చే నీటి ప్రవాహం పెరిగిందని అధికారులు తెలిపారు. దీంతో అదనపు నీటిని పరిమితంగా విడుదల చేసేలా నిర్ణయం తీసుకున్నారు. కృష్ణా సెంట్రల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం ఈ ఉదయం 9 గంటల నుంచి 10 గంటలమధ్య నాలుగుగేట్లు ఎత్తారు. ఆ సమయంలో దిగువకు సుమారు 2,000 నుంచి 3,000 క్యూసెక్కుల మధ్య నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. వాస్తవంగా విడుదలైన నీటి పరిమాణం సుమారు 2,900 క్యూసెక్కులుగా నమోదైంది. స్థానిక క్యాచ్‌మెంట్ ప్రాంతాల



ప్రకాశం బ్యారేజి దగ్గర ప్రవహిస్తున్న వరద నీరు

నుంచి ఇన్‌ఫ్లో పెరగడంతో మిగులు నీటిని వదిలినట్లు వివరించారు. ప్రకాశం బ్యారేజీ ఎగువ, దిగువ ప్రాంతాల్లో కృష్ణా నది ఒడ్డున ఉన్న ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. సంబంధిత శాఖల అధికారులకు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి విడుదల తక్కువ పరిమాణంలోనే ఉన్నప్పటికీ, ప్రవాహం పెరిగే పరిస్థితులు ఉంటే ముందస్తు జాగ్రత్తలు అవసరమని అధికారులు పేర్కొన్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి విడుదల దృశ్యాలను చూసేందుకు వచ్చిన సందర్శకులు బ్యారేజీ పరిసరాల్లో నిలిచారు.

## బ్రెజిల్‌లో రోప్ జంపింగ్ అడ్వెంచర్‌లో విషాదం

### తాడుకట్టకుండా 130 అడుగుల ఎత్తు నుంచి యువతిని కిందకు తోసేసిన వైనం

### క్షణాల్లో నేలపై పడి యువతి మృతి, ఆరుగురి అరెస్టు, హత్యా నేరం కింద కేసు నమోదు

**హైదరాబాద్, జూన్ 14, ప్రభాతవార్త:** బంగి జంపింగ్ గురించి అందరికి తెలిసిందే. నడుముకు తాడుతో 100 నుంచి 300 అడుగుల ఎత్తు నుంచి జలాశయం లేదా నది, చెరువులోకి దూకడం ఇందులో ప్రత్యేకత. పై నుంచి కొందరు దీనిని పర్యవేక్షిస్తుంటారు. అయితే బ్రెజిల్ సహా పలు దేశాల్లో కింద ఎలాంటి నీరు లేని ప్రాంతం అంటే రహదారి లేదా మైదానం ప్రాంతంలో అంతే ఎత్తు నుంచి కొందరు సాహసికులను నడు ముకు తాడుకట్టి పైనుంచి తోస్తారు. ఆ సమయంలో పైన వుండే వారు యంత్రాల సహాయంతో తాడును నియంత్రిస్తుంటారు. పై నుంచి దూకిన సాహసికులు ధైర్యంతో భూమి నుంచి ఐదు లేదా పది అడుగుల ఎత్తు వరకు వస్తారు. చూసే వారికి ఇది థ్రిల్ పంచడం, సాహిసికులకు మరింత ధైర్యం, భయంతో కూడిన అనుభవం వస్తుంటుంది. అయితే ఇందులో ఏమాత్రం తేడా వచ్చిన పైనుంచి దూకే సాహసికుల ప్రాణాలు పోవడం ఖాయం. బ్రెజిల్‌లోని సావో పాలో అనే రాష్ట్రంల లైమిరా నగరంలో గల పొంటే డొ ఎస్కెలెటో బ్రిడ్జి వద్ద శనివారం సాయంత్రం వేళ జరిగిన అడ్వెంచర్ రోప్ జంపింగ్‌లో 21 ఏళ్ల మరియయా ఎదుర్దా రోడ్రిగ్స్ ఫ్రీటాస్‌ను అక్కడి నిర్వాహకులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా, నిర్లక్ష్యంగా ఆమె నడుముకు తాడు కట్టకుండానే 130 అడుగుల ఎత్తు (40 మీటర్లు) నుంచి అమాంతం కిందకు తోసేసారు. రోప్ జంపింగ్‌కు ఆ యువతి ఉత్సాహంగా రాగా బలమైన గాలులు వీస్తున్న సమయంలో నడుముకు తాడు బిగించకుండానే నిర్వాహకులు కిందకు తోయడంతో క్షణాల్లో ఆమె కిందకు పడి తల పగిలి అక్కడికక్కడే చనిపోయింది. ఆ యువతి నడుముకు తాడు కట్టే వ్యక్తులు ఆమెకు ఇంకా తాడును బిగించలేదు అని అరుస్తున్నా నిర్వాహకులు వినిపించుకోకుండా కిందకు తోసేయడంతో 21ఏళ్ల యువతి రోప్ జంపింగ్ విషాదంతమయ్యింది. ఈ ఘటన దరిమిలా ఆ ప్రాంతంలో ఒక్కసారిగా విషాదం అలముకుంది. దీనిపై స్థానిక పోలీసులు నిర్వాహకులపై హత్యా నేరం కింద కేసు నమోదు చేయగా యువతిని కిందకు తోసిన ముగ్గురిపై ఉద్దేశపూర్వక హత్యా నేరం కింద కేసు నమోదు చేశారు. నిర్వాహకులందరిని పోలీసు లు అరెస్టు చేశారు. రోప్ జంపింగ్ క్లబ్‌కు ఎలాంటి అనుమతి లేదని తేలడంతో దాన్ని మూసివేశారు.

### ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు..

## కరవును తట్టుకునే పూలు, పండ్లు, కూరగాయల రకాలు

### విడతల వారీగా నారు మొక్కల పెంపకం చేపట్టాలి

### ఉద్యాన వర్సిటీ అత్యవసర ప్రణాళిక విడుదల

**హైదరాబాద్, జూన్ 14, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కోవడంలో రైతులకు సహాయ పడటానికి తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయం చర్యలు చేపట్టింది. మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం ద్వారా ఏర్పడే ఎల్‌నినో కారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఈ పంటల సీజనులో రాష్ట్రంలో రుతుపవన కాలంలో ఏకరీతి వర్షపాతం ఉండక పోవచ్చని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో పూలు, పండ్లు, కూరగాయల పంటలకు సంబంధించి అత్యవసర ప్రణాళికను ఆదివారం విడుదల చేసింది. వర్షాభావ, కరువు పరిస్థితులను తట్టుకునే రకాలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. అంతేకాకుండా సమర్థవంతమైన నీటి నిర్వహణ పద్ధతులు, తెగుళ్లు, వ్యాధుల వ్యాప్తికి వ్యతిరేకంగా నివారణ చర్యలను సిఫార్సు చేసింది. సాగుకు అనువైన పంట రకాలను కూడా విడుదల చేసింది. ఎల్‌నినోతో రుతుపవనాల ప్రారంభం ఆలస్యం కావడం, వర్షపాతం లోటు, సుదీర్ఘ పొడి వాతావరణం, పెరిగిన ఉష్ణోగ్రతలు మరియు వడగాలులు, పంటలలో తేమ ఒత్తిడి, జలాశయాలు, బోరుబావులలో నీటి లభ్యత తగ్గడం వంటివి సంభవిస్తాయని వివరించింది. ఇది మామిడి, నిమ్మజాతి పండ్లు, చిలగడదుంప, జామ తదతర ఉద్యానవన పంటలు, కూరగాయలు, పసుపు, మిరప, పామాయిల్, పూలు మరియు తోట పంటలను ప్రభావితం చేసే వీలుందని అంచనా వేసింది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, వర్షాభావ ప్రభావాన్ని తగ్గించడానికి, కూరగాయల రైతులు స్వల్పకాలిక రకాలను సాగుచేయాలని విజ్ఞప్తి చేసింది. అంతే కాకుండా విడతల వారీగా నారుమొక్కల పెంపకం చేపట్టాలని సూచించింది. మామిడి సాగుకు కేసర్, దసహరి రకాలను సిఫార్సు చేసింది. అదేవిధంగా, తీపి నారింజ, సీతాఫలం, సపోటా పండించే రైతులకు సత్గుడి, బాలానగర్, కాళిపతి రకాలను వేయాలని పేర్కొంది. కూరగాయల విషయానికొస్తే, టమాటా సాగుకు అర్కా వికాస్, అర్కా రక్షక్, అర్కా సమర్థ్ వంటి రకాలను వేయాలని కోరింది. వంకాయ పండించే రైతులకు శ్యామల, భాగ్యమతి, పుష్కాంతి రకాలను సాగు చేయాలని తెలిపింది. రుతుపవనాలు జాప్యమైన సందర్భం లో బంతి, చామంతి, మల్లె, గులాబీ, తువరోస్ వంటి పూల సాగుదారులు నాట్లు వేసే ఉద్దేశ్యాన్ని మార్చుకోవాలని అత్యవసర ప్రణాళికలో స్పష్టం చేసింది. కరువు పరిస్థితుల్లో మల్చింగ్, సూక్ష్మ నీటిపారుదల వ్యవస్థను అవలంబించాలని సలహా ఇచ్చింది. పంటలను ఉష్ణోగ్రతల ఒత్తిడి నుండి రక్షించుకోవడానికి నీడ వలలను ఉపయోగించాలని సూచన చేసింది. పామాయిల్ సాగులో తేమ ఒత్తిడి, పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తట్టు కునేందుకు సమర్థవంతమైన నీటి నిర్వహణ పద్ధతులను పాటించాలని రైతులకు విజ్ఞప్తి చేసింది. తగినంత వర్షపాతం కురిసిన తర్వాతే రైతులు విత్తనాలు వేయడం ప్రారంభించాలని సిఫార్సు చేసింది. పంటలు పొడి పరిస్థితులను తట్టుకోవ డానికి వీలుగా, ఎత్తైన మడుల సాగు, తేమ పరిరక్షణ పద్ధతులు, కరువును తట్టుకునే పంట రకాలను అనుసరించాలని ఉద్యాన పంటలకు సం బంధించిన అత్యవసర ప్రణాళికలో వెల్లడించింది.

# జులై నుంచి సీఎస్ ఎవరు?

>> నియమిస్తారా? అనే అశం ఇప్పుడు సచివాలయ అధికార వర్గాల్లో హాట్ టాపిక్ మారింది. ప్రస్తుత సీఎస్ పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనున్నందున ఈ అంశం మరోసారి చర్చనీయాంశమైంది. సీనియర్ ఐఏఎస్ అధికారులు సంజయ్ జాజు, జయేశ్ రంజన్, వికాస్‌రాజ్, సవ్యసాచి ఘోష్ పేర్లు కూడా రేసులో వినిపిస్తున్నాయి. అయితే కీలకమైన బాధ్యతను ఎవరికి ఇవ్వాలనే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మనసులో ఏముందో త్వరలోనే తేలనుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇద్దరు సీఎస్‌లు పని చేశారు. ప్రభుత్వం ఏర్పడే నాటికే సీఎస్‌గా ఉన్న శాంతికుమారి అలాగే కొనసాగి 2025 ఏప్రిల్ 30న పదవీ విరమణ చేశారు. అప్పుడు సీఎస్ ఎవరనే అంశంపై అనేక ఊహాగానాలు వచ్చినప్పటికీ చివరకు 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి రామకృష్ణారావును ప్రభుత్వం నియమించింది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఆర్థిక శాఖలో అత్యంత కీలకంగా వ్యవహరించడంతో పాటు వివాదరహితుడు, సమర్థుడిగా పేరున్నందున రామకృష్ణారావు వైపు ప్రభుత్వం మొగ్గుచూపింది. ప్రభుత్వం ఆశించిన విధంగానే పనితీరు కనబరచడంతో గతేడాది ఆగస్టు 31న రామకృష్ణారావు పదవీ కాలం ముగిసినప్పటికీ ఆయనను కొనసాగించాలని కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ వినతి మేరకు రామకృష్ణారావు పదవీ కాలాన్ని ఏడు నెలలు కేంద్రం పొడిగించింది. మార్చి 31న ఆ సమయం కూడా ముగియగా మరింత కాలం పొడిగించాలని మరోసారి రాష్ట్ర ప్రభుత్వం కోరింది. కేంద్ర ప్రభుత్వం మరో మూడు నెలలు పొడిగించటంతో ఆ గడువు ఈ నెల 30న ముగియనుంది. ఇప్పుడు రామకృష్ణారావు పదవీ కాలాన్ని మళ్లీ పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతుందా? లేక కొత్త అధికారి వైపు మొగ్గుచూపుతుందా? అనే ఉత్కంఠ ఉద్యోగ వర్గాల్లో నెలకొంది. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం మరోసారి అడిగినా ఇప్పటికే రెండుసార్లు పది నెలలు పొడిగించిన కేంద్రం అంగీకరిస్తుందా లేదా అని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. అత్యున్నత పోస్టు కోసం పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రత్యేక సీఎస్ హోదాలో ఉన్న సంజయ్ జాజు, జయేశ్ రంజన్, వికాస్ రాజ్, సవ్యసాచి ఘోష్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అందరికన్నా సీనియర్‌గా ఉన్న ఢిల్లీ తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ శశాంక్ గోయల్ సెప్టెంబరు 30న పదవీ విరమణ చేయనున్నారు. మెట్రో పాలిటన్ అభివృద్ధి ప్రత్యేక సీఎస్ జయేశ్ రంజన్‌కు 2027 సెప్టెంబరు వరకు సర్వీసు ఉంది. కేంద్ర సర్వీసుల్లో ఉన్న సంజయ్ జాజు 2029 ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా ఉన్న సంజయ్ జాజు రాష్ట్రానికి రావడం పట్ల ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. రవాణా, ఆర్ అండ్ బీ ప్రత్యేక సీఎస్ వికాస్‌రాజ్ 2028 మార్చి, ఫ్లాగ్‌షిప్ పథకాల అమలు విభాగం ప్రత్యేక సీఎస్ సవ్యసాచి ఘోష్ 2027 ఏప్రిల్ వరకు సర్వీసులో ఉండనున్నారు. నవీన్ మిత్తల్, దానకిషోర్, వాణిప్రసాద్ కూడా ప్రత్యేక సీఎస్ హోదాలో ఉన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, అమలు చేయాల్సిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సవాల్‌గా ఉన్న పరిస్థితుల్లో కొత్త సీఎస్‌పై ముఖ్యమంత్రి ఆలోచనేమిటో త్వరలో తేలిపోనుంది. మొత్తంగా ఈ నెలాఖరులోగా ఆయన ఓ స్పష్టతకు వచ్చే అవకాశం ఉంది.

## నిజామాబాద్ జిల్లా నందిపేట్‌లో కత్తిపోట్ల కలకలం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్14:** నిజామాబాద్ జిల్లా నందిపేట్‌లో యువకుడిపై ఇనుప రాడ్లు, కత్తులతో దాడి చేశారు. తీవ్రగాయాలపాలైన యువకుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారులో వచ్చి దాడికి పాల్పడినట్లు కుటుంబసభ్యుల వెల్లడించారు.

# ఇథనాల్ ఇంధనంగా 100 శాతం వినియోగం



## కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

**న్యూఢిల్లీ, జూన్ 14:** దిగుమతి చేసుకునే శిలాజ ఇంధనాలపై భారతదేశం ఆధారపడటాన్ని తగ్గించడం, స్వచ్ఛమైన, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు పరివర్తనను వేగవంతం చేయడం లక్ష్యంగా, ఇంధనంగా 100 శాతం ఇథనాల్ వినియోగానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు.దీనివల్ల తక్కువ ధరకే ఇంధనం దొరుకుతుందని, దేశంపై చమురు దిగుమతుల భారం తగ్గుతుందని పేర్కొన్నారు.
గత 12 యేళ్లలో ఎన్‌డియే ప్రభుత్వం సాధించిన కీలక విజయాలను వివరిస్తూ, నాగ్‌పూర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి ఈ ప్రకటన చేశారు. దేశంలో వాహన ఇంధనంగా 100 శాతం ఇథనాల్‌ను చట్టబద్ధంగా ఉపయోగించేందుకు మార్గం సుగమం చేస్తూ, అవసరమైన నియంత్రణ ఫైల్‌పై శనివారం సాయంత్రం సంతకం చేసినట్లు గడ్కరీ తెలిపారు. ముడి చమురు దిగుమతులను తగ్గించడం, ఇంధన భద్రతను మెరుగుపరచడం, స్వచ్ఛమైన ఇంధన ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం వంటి ప్రభుత్వ విస్తృత ప్రయత్నాలకు ఈ నిర్ణయం మద్దతు ఇస్తుందని భావిస్తున్నారు. సాంప్రదాయ శిలాజ ఇంధనాలకు ఆచరణీయమైన ప్రత్యామ్నాయంగా ఇథనాల్‌కు తాను చాలాకాలంగా మద్దతు ఇస్తున్నట్లు మంత్రి పునరుద్ఘాటించారు. సాంకేతిక పురోగతులు, పెరుగుతున్న పారిశ్రామిక భాగస్వామ్యం ఇప్పుడు ఇథనాల్‌తో నడిచే వాహనాలను ఒక వాస్తవిక ఎంపికగా మార్చాయని ఆయన అన్నారు. 100 శాతం ఇథనాల్ ఇంధనంతో నడిచే సామర్థం గల వాహనాలను ప్రవేశపెట్టడానికి అనేక ప్రముఖ ఆటోమొబైల్ తయారీదారులు సిద్ధమవుతున్నారని గడ్కరీ చెప్పారు. ప్రభుత్వ ప్రత్యామ్నాయ ఇంధన వ్యూహం విజయవంతం కావడానికి ఫ్లెక్స్ ఫ్యూయల్, ఇథనాల్ అనుకూల వాహనాల లభ్యత చాలా అవసరమని పరిశ్రమ నిపుణులు భావిస్తున్నారు.
స్వచ్ఛమైన, దేశీయంగా ఉత్పత్తి అయ్యే ఇంధనానికి ప్రోత్సాహం:ఇంధన వనరులను వైవిధ్యపరచడం, ఉద్గారాలను తగ్గించడం, దేశీయ వ్యవసాయ ఉత్పత్తికి మద్దతు ఇవ్వడం వంటి తన దీర్ఘకాలిక వ్యూహంలో ఇథనాల్‌ను ఒక కీలక భాగంగా కేంద్రం పరిగణిస్తోంది. ఇథనాల్ ప్రధానంగా చెరకు, మొక్కజొన్న వంటి వ్యవసాయ ముడి పదార్థాల నుండి ఉత్పత్తి అవుతుంది. ఇది ఇంధన భద్రతకు దోహద పడటంతో పాటు, రైతులకు అదనపు ఆదాయ వనరును కూడా అందిస్తుంది. 100 శాతం ఇథనాల్ ఇంధనానికి ఆమోదం లభించడం, దానికి అనుకూలమైన వాహనాలను త్వరలో విడుదల చేయనుండటంతో, రాబోయే సంవత్సరాల్లో ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు మార్పును వేగవంతం చేసి, దిగుమతి చేసుకునే పెట్రోలియం ఉత్పత్తులపై భారతదేశం ఆధారపడటాన్ని తగ్గించాలని ప్రభుత్వం ఆశిస్తోంది.

# వాణిజ్య నౌకలు హార్ముజ్ జలసంధి మీదుగా రావద్దు

## పబ్లిక్ మారిటైమ్ రేడియో ఛానల్‌లో ఇరాన్ హెచ్చరికలు

**టెహ్రాన్, జూన్ 14:** అంతర్జాతీయ చమురు, సహజ వాయువుల రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరాయి. ఈ వ్యూహాత్మక జలసంధిని ఇరాన్ పూర్తిగా మూసివేసింది. ఈ పరిసర ప్రాంతాల్లో ప్రయాణించే వాణిజ్య నౌకలు హార్మూజ్ జలసంధి వైపు రావద్దని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నావికాదళం హెచ్చరికలు జారీ చేసింది. పబ్లిక్ మారిటైమ్ రేడియో ఛానల్ ద్వారా ఇరాన్ నావికాదళం పంపిన ఈ హెచ్చరికల ఆడియో రికార్డింగ్ ఇప్పుడు అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. ఆ ప్రాంతంలో ప్రయాణిస్తున్న ఒక వాణిజ్య నౌక సిబ్బంది అందించిన ఆడియో రికార్డింగ్ ప్రకారం పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్ పరిధిలో ఉన్న అన్ని నౌకలను ఉద్దేశించి ఐఆర్‌జీసీ హెచ్చరికలు జారీ చేసింది. హార్మూజ్ జలసంధిని ప్రస్తుతం పూర్తిగా మూసివేయడం జరిగింది. ఈ జలసంధి గుండా ఎలాంటి నౌకల కదలికలు ఉన్నా వాటిని చాలా కఠినంగా ఎదుర్కొంటాం. మీ ఆరోగ్యం, భద్రత దృష్ట్యా, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు హార్మూజ్ జలసంధి వైపు రాకుండా దూరంగా ఉండండని ఆ రేడియో సందేశంలో ఇరాన్ స్పష్టం చేసింది. ట్రంప్ శాంతి ఒప్పందం డ్రోన్ల కూల్చివేత ఈ ఉద్రిక్తతల నడుమ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఆదివారం (జూన్ 14) ఒక శాంతి ఒప్పందం కుదరబోతోందని, ఆ ఒప్పం దంపై సంతకాలు ముగిసిన వెంటనే హార్మూజ్ జలసంధిని తిరిగి తెరుస్తారని ట్రంప్ వెల్లడించారు. మరోవైపు క్షేత్రస్థాయిలో ఘర్షణ వాతావరణం కొనసాగుతూనే ఉంది. హార్మూజ్ జలసంధిలోని వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ పంపిన పలు డ్రోన్లను తాము విజయవంతంగా కూల్చివేసినట్లు అమెరికా సైన్యం శుక్రవారం రాత్రి ప్రకటిం చింది. అంతర్జాతీయ మారిటైమ్ ఆర్గనైజేషన్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఈనెల 11 నాటికి హార్మూజ్ జలసంధి, పశ్చిమాసియా పరిసర ప్రాంతాల్లో అంతర్జాతీయ నౌకలపై 46 దాడులు జరిగాయి. ఈ దాడుల వల్ల ఇప్పటివరకు 14 మంది అంతర్జాతీయ నావికులు ప్రాణాలు కోల్పోయారు. బుధవారం ఒక చమురు ట్యాంకర్‌పై జరిగిన దాడిలో ముగ్గురు నావికులు మరణించగా, ఆ దాడిని తామే చేసినట్లు అమెరికా సైన్యం ఆ తర్వాత ధ్రువీకరించింది. ఈ నేపథ్యంలో ఆదివారం జరగబోయే శాంతి ఒప్పందం కోసం అంతర్జాతీయ వాణిజ్య వర్గాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.

**యుఎస్‌తో డీల్‌పై గుస్సా..**
**ఇరాన్‌లో మిన్నంటిన నిరసనలు**

యుఎస్‌తో డీల్ కుదరనుందన్న వార్తలు ఇరాన్‌లో నిరసనలను రగిలించాయి. దేశ ప్రయోజనాల విషయంలో విదేశాంగ శాఖ మంత్రి అరాగ్చీ రాజీ పడ్డారంటూ ప్రజలు పలునగరాల్లో నిరసనలకు తెరతీశారు. యూఎస్‌తో డీల్ విషయంలో ఇరాన్‌లోని అతివాదులు నిరసన బాట పట్టారు. ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అరాగ్చీ, పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ ఘాలిబఫ్‌కు వ్యతిరేకంగా నిరసనలకు తెరతీశారు. నేడు ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాటు పాక్ కూడా ప్రకటించడంతో ఇరాన్‌లో నిరసనలు మిన్నంటుతున్నాయి. ఇరాన్ అధికార వర్గాలు మాత్రం ఈ విషయంపై ఆచితూచి స్పందిస్తున్నాయి. అయినప్పటికీ, తమ దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగేలా విదేశాంగ శాఖ మంత్రి, స్పీకర్ యూఎస్‌తో ఒప్పందానికి సిద్ధమవుతున్నారంటూ కొందరు ఇరానీయన్లు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు.అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, మషాద్ నగరంలోని విదేశాంగ శాఖ కార్యాలయం ముందు అనేక మంది అతివాదులు పెద్ద ఎత్తున నిరసనకు




తెరతీశారు. యూఎస్‌తో ఒప్పందం గురించి మంత్రి అరాగ్చీ ప్రస్తావించిన అనంతరం దేశంలో ఆగ్రహా వేశాలు ఊపందుకున్నాయి. అనేక మంది అరాగ్చీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన దేశానికి తలవంపులు తెచ్చే పని చేశారని, మరణ శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. రాజధాని టెహ్రాన్‌తో పాటు అనేక ఇతర ప్రాం తాల్లో నిరసనలు వెల్లువెత్తినట్టు తెలుస్తోంది. యూఎస్‌తో కుదుర్చుకోనున్న ప్రతిపాదిత డీల్‌లో ఇరాన్ ప్రయోజనాలకు రక్షణలు లేవని ఇరాన్‌లోని అతివాద వర్గం ఆరోపిస్తోంది. ఈ డీల్ కుదిరితే హోర్ముజ్‌పై ఇరాన్ పట్టు సడలిపోతుందని వారు చెబుతున్నారు. అంతిమంగా ఇరాన్ ప్రయోజనాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీల్ కోసం అమెరికా చెప్పినట్టల్లా తలూపుతున్నారని ఇరాన్ పాలకవర్గాన్ని తీవ్రంగా విమర్శి స్తున్నారు. ఈ డీల్ కుదిరాక అమెరికా విధించిన నిర్బంధం తొలగిపోతుందని అరాగ్చీ ఇటీవల చెప్పారు.

# జూలై 4 నుంచి దివంగత ఖొమేనీ అంత్యక్రియలు ప్రారంభం

## పలుచోట్ల అంతిమయాత్రలు.. చివరిగా 9న మషాద్‌లో తుది క్రతువు

**టెహ్రాన్, జూన్ 14:** ఇరాన్‌లో సుదీర్ఘ కాలంపాటు పరిపాలించిన మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల షెడ్యూల్ ఖరారైంది. జూలై 4 నుంచి రాజధాని టెహ్రాన్‌లో ఈ అంత్యక్రియల ప్రక్రియ ప్రారంభం కానుందని ఇరాన్ ప్రభుత్వ మీడియా ఆదివారం వెల్లడించింది. ఖమేనీ సంస్మరణ బాధ్యతలను పర్యవేక్షిస్తున్న ప్రధాన కమిటీ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. జూలై 4, 5 తేదీల్లో టెహ్రాన్‌లోని ప్రసిద్ధ ఇమామ్ ఖమేనీ ముసల్లా ప్రార్థనా మందిరంలో ఖమేనీ పార్థివ దేహానికి వీడ్కోలు వేడుకలు నిర్వహిస్తారు. అనంతరం జూలై 6, 7 తేదీల్లో రాజధాని టెహ్రాన్, పవిత్ర నగరం కోమ్‌లలో భారీ అంతిమ యాత్రలు సాగుతాయి. 9న దేశ ఈశాన్య ప్రాంతంలోని మషాద్ నగరంలో తుది వీడ్కోలు కార్యక్రమం ముగుస్తుంది. అదే రోజున షియా ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే ఎనిమిదవ మతపెద్ద ఇమామ్ రెజా పవిత్ర క్షేత్రంలో ఖమేనీ దేహాన్ని ఖననం చేయనున్నారు. నిజానికి మార్చి నెలలోనే జరగాల్సిన ఈ అంత్యక్రియలు యుద్ధ పరిస్థితుల కారణంగా వాయిదా పడుతూ వచ్చాయి. 86 యేళ్ల అలీ ఖమేనీ ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన భారీ వైమానిక దాడుల్లో మరణించారు. ఈ దాడితో ఇరాన్‌పై ఆయన సాగించిన 36 యేళ్ల పాలన ముగిసింది. ఖమేనీ మరణం తర్వాత మార్చి మొదటి వారంలో ఆయన కుమారుడు మొజ్తబాఖమేనీ ఇరాన్ కొత్తసుప్రీంలీడర్‌గా బాధ్యతలు చేపట్టారు.ఈ దాడుల్లో ఖమేనీతోపాటు ఆయనకుమార్తె, మనవడు, అల్లుడు, మరోనలుగురు కుటుంబసభ్యులు ప్రాణాలు కోల్పోయారు.

# ముంబయిలోని 36 పెట్రోలు బంకుల్లో లీటరుకు రూ.5 తగ్గింపు

## ఎంఎన్ఎస్ రాజ్‌థాకరే పుట్టినరోజు కానుక

**ముంబయి, జూన్ 14:** మహారాష్ట్ర నవ్‌నిర్మాణ్‌సేన వ్యవస్థాపకుడు రాజ్ థాక్రే పుట్టినరోజు సందర్భంగా ముంబైలోని ద్విచక్ర వాహన దారులకు పెట్రోల్‌పై ప్రత్యేక తగ్గింపును ప్రకటించింది. ఈ పథకం కింద నగరంలోని ఎంపిక చేసిన 36 పెట్రోల్ బంకుల్లో టూవీలర్లకు లీటర్ పెట్రోల్‌పై రూ.5 తగ్గింపును అందిస్తోంది. రాజ్ థాకరే పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఒక్కరోజు పాటు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. దేశంలో ద్రవ్యోల్బణం, ఇంధన ధరలు నిరంతరం పెరుగుతూ సామాన్యుల బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్న తరుణంలో ఎంఎన్ఎస్ ఈ నిర్ణయం తీసుకుంది. సామాన్యులపై పడుతున్న ఆర్థిక భారాన్ని కొంతమేర తగ్గించడమే తమ లక్ష్యమని వారు స్పష్టం చేశారు. ఈ చొరవపై ఎంఎన్ఎస్ డివిజన్ ప్రెసిడెంట్ జై శృంగార్‌పురే మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో పరిస్థితులు చాలా కష్టంగా ఉన్నాయి. ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగింది, పెట్రోల్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇలాంటి సమయంలో మా వంతుగా ప్రజలకు కొంత మద్దతు ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. మరో ఎంఎన్ఎస్ నేత సందీప్ దేశ్‌పాండే ఇంధన ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం విషయంలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పెట్రోల్ ధరల భారాన్ని అంతిమంగా ప్రజలే మోస్తున్నారని, వినియోగదారులపై ఒత్తిడి తగ్గించడానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అమెరికా డాలర్ విలువలో హెచ్చుతగ్గులు కూడా ఇంధన ధరలపై ప్రభావం చూపుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ తాజా కార్యక్రమం ద్వారా ముంబై వాసులకు తక్షణ ఊరట లభిస్తుందని అన్నారు.

# అఖిలేష్‌యాదవ్ కుమార్తెపై అభ్యంతరకర పోస్టులు

## ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సిఎం యోగి ఆదేశం

**లక్నో, జూన్ 12:** సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కుమార్తె అదితి యాదవ్‌పై కొందరు తప్పుడు, అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం, సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ చేయడంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర అభ్యంతర వ్యక్తం చేశారు. సమాజంలో ఎవరి ఆడపిల్లపైనా ఒకటేనని, వారిని ఇలాంటి నీచమైన బహిరంగ చర్చల్లోకి లాగకూడదని అన్నారు. యూపీలోని అంజాంగఢ్‌లో రూ.955 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను యోగి ఆదిత్యనాథ్ ఆదివారంనాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడకూతుళ్లపై అభ్యంతరకర వ్యాఖ్యలను అనుమతించే ప్రసక్తే లేదని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఇటీవల సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కుమార్తెపై కొందరు వ్యక్తులు అనుచిత వ్యాఖ్యలు చేయడం చూశాను. వారిపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించానని యోగి ఆదిత్యనాథ్ చెప్పారు. ఆడకూతుళ్లు అందరికీ కూతుళ్లేనని, గ్రామాల్లో ఆడపిల్లలను తమ ఆడపిల్లలుగా, అక్కాచెల్లెళ్లను తమ సొంత సోదరీమణులుగా చూస్తారని, అలాంటి సంస్కృతిలో పెరిగిన మనం ఆడపిల్లల పట్ల ఎలాంటి వైరుధ్యం చూపించరాదని అన్నారు. అఖిలేష్ యాదవ్ కుమార్తెను టార్గెట్ చేస్తూ సామాజిక మాధ్యమంలో పరువునష్టం కలిగించే పోస్టును సర్క్యులేట్ చేసిన వారిపై ఇటీవల ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. తప్పుడు ఉద్దేశాలతో కొందరు వ్యక్తులు ఈ పోస్టులను సర్క్యులర్ చేస్తున్నారంటూ అఖిలేష్ యాదవ్ కాన్పూర్ పోలీస్ కమిషనరేట్ సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేశారు. ఫోటో మార్ఫింగ్ చేసి, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆడపిల్లలు, సీనియర్ సిటిజన్లను కించపరచేలా సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తలు వ్యవహరిస్తుండటంపై కూడా యోగి ఆదిత్యనాథ్ చురకలు వేశారు. అఖిలేష్ జీ మహిళలు, సీనియర్ సిటిజన్లు, సీనియర్ నేతలను కించపరచే వ్యాఖ్యలు చేయవద్దని మీ కార్యకర్తలకు సూచించండి. తగిన సంయమనంతో వ్యవహరించేలా చూడండి. వారికి బాగా అర్థమయ్యేలా చెప్పండి. అప్పటికీ వారికి అర్థం కాకపోతే మాకు అప్పగించండి. వారికి ఎలా చెప్పాలో అలా మేము చెబుతామని అన్నారు.

# బావిలోకి దూసుకుపోయిన పికప్ ట్రక్కు

## 14 మంది మృతి, మరో ఆరుగురి వెలికితీత

**సోలాపూర్, జూన్ 14:** దైవ దర్శనానికి వెళ్లి తిరిగొస్తుండగా మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా తాండుల్వాడి సమీపంలో పికప్ ట్రక్కు బావిలో పడిపోయింది. ఈ ఘటనలో 14 మంది భక్తులు అక్కడికక్కడే మరణించారు. మరో ఆరుగురిని బావిలో నుంచి సురక్షితంగా బయటకు తీసినట్లు అధికారులు వెల్లడించారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం సోలాపూర్ జిల్లాలోని రంజణిగావ్ గ్రామానికి చెందిన 14 మంది భక్తులు పికప్ వాహనంలో మస్వాడ్ ప్రాంతంలోని సిద్ధనాథ్ దేవాలయం దర్శించుకు నేందుకు వెళ్లారు. అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో పండర్‌పూర్ వెళ్తుండగా తాండుల్వాడీ సమీపంలో ఒక్కసారిగా అదుపుతప్పిన పికప్ వాహనం రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. బావి పూర్తిగా నీటితో నిండి ఉండటంతో పికప్ ట్రక్కు క్షణాల్లోనే మునిగిపోయింది. ఇది గమనించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ బృందాల ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. బావిలో నుంచి ఎనిమిది మంది మృతదేహాలను వెలికితీశారు. మృతుల్లో నలుగురు మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. ఇక మరో ఆరుగురిని సురక్షితంగా బయటకు తీసి ఆస్పత్రికి తరలిం చారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. పికప్ ట్రక్కులో సాంకేతిక లోపం తలెత్తిందా లేదా డ్రైవర్ నిర్లక్ష్యంకారణమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ప్రమాదం జరిగిన బావికి రక్షణ గోడలు లేవని దీనివల్ల ఇంతమంది ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని స్థానికులు చెబుతున్నారు.



# హిమాచల్‌ప్రదేశ్‌లో డ్రోన్ పోస్ట్ సర్వీస్

**సిమ్లా, జూన్ 14:** భారత తపాలా శాఖ హిమాచల్‌ప్రదేశ్‌లోని అత్యంతఎత్తైన, దుర్గమమైన కొండ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు వేగంగా సేవలు అందించడానికి డ్రోన్‌టెక్నాలజీని అందు బాటులోకి తెచ్చింది. రాష్ట్రంలోని మండీ జిల్లాలో తొలిసారిగా నిర్వహించిన డ్రోన్ పోస్టల్ డెలి వరీ ట్రయల్స్ విజయవంతమయ్యాయి.ఈ విషయాన్ని కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధి యా సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ సేవల ద్వారా హిమాచల్‌ప్రదేశ్‌లోని మారు మూల ప్రాంతాలకు తపాలా సేవలను మరింత చేరువ చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

# ఒమన్ తీరంలో మునిగిపోతున్న నౌక నుంచి 14 మందిని రక్షించిన యుఎస్

**మస్కట్, జూన్ 14:** ఒమన్ తీరంలో భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న ఓడ ఇంజన్ వైఫల్యంతో మునిపోవడం ప్రారంభమైంది. సకాలంలో రెస్క్యూ చేయడంతో అందులో ఉన్న 14 మంది భారతీయుల్ని సురక్షితంగా కాపాడారు. అయితే, ఇదే ప్రాంతంలో జరిగిన మరో ప్రమాదంలో ఒక భారతీయ నావికుడు మరణించారు. జూన్ 14న ఎంఎస్‌వి విరాట్1 అనే కార్గో షిప్ మునిగిపోయినట్లు మస్కట్‌లోని భారతీయ రాయబార కార్యాలయం వెల్లడించింది. ఈ ప్రమాదం ఒమన్ లోని రాస్ అల్ హద్‌కు సుమారు 80 నాటికల్ మైళ్ల దూరంలో జరిగింది. ముందుగా పరిస్థితి తీవ్రంగా ఉండటంతో ఇండియన్ నేవీకి చెందిన నౌకలు సంఘటనా స్థలానికి వెళ్లాయి. అయితే, అమెరికన్ నేవీకి చెందిన పీ8 సముద్ర నిఘా విమానం సంఘటన స్థలానికి చేరుకుని ఒక లైఫ్ రాఫ్ట్ జారవిడిచి, భారతీయ సిబ్బందిని రక్షించింది. ఓడలోని 14 మంది సిబ్బంది లైఫ్ రాఫ్ట్ సాయం తో ప్రాణాలతో బయట పడ్డారు. ఎంవి జబల్ అలీ 9 నౌక కూడా సంఘటనా స్థలంలో సహా యక కార్యక్రమాల్లో పాలు పంచుకుంది. గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఇదిలా ఉంటే మరో నౌకలో భారతీయ పౌరుడు నిశాంత్ ఉర్తానంతన్ మరణించారు. ఆరోగ్య కారణాల వల్ల మరణించినట్లు భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. అతడి మృతదేహం దుక్మ్ పోర్టులోని ఎంటీ సెలెస్టియన్ నౌకలో ఉంది. అతడి మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్ పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాయబార కార్యాలయం వెల్లడించింది.



# బంగ్లా అక్రమ వలసల కట్టడికి అసోం సిఎం కార్యాచరణ

**దిస్‌పూర్, జూన్ 14:** అసోం ప్రభుత్వం ఆధార్ కార్డుల జారీ ప్రక్రియపై 18 ఏళ్లు నిండిన వారికి కొత్తగా ఆధార్ నమోదును నిలిపివేస్తున్నట్లు ప్రకటిం చింది. బంగ్లాదేశ్ నుంచి వచ్చే అక్రమ వలసదారులు ఆధార్ కార్డులు పొందకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ కఠిన చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో జనాభా కంటే అధికంగా, అంటే 100 శాతానికి మించి ఆధార్ కార్డులు జారీ అయినట్లు గుర్తించామని, ఈ అదనపు కార్డులు ఎవరికి జారీ అయ్యాయో నిగ్గుతేల్చాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అక్రమ చొరబాటుదారులు ఆధార్ పొందకుండా కట్టడి చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని సీఎం వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో అర్హులైన వారు ఆధార్ పొందేందుకు ప్రత్యేక నిబంధ నలను రూపొందించారు. దీని ప్రకారం, జిల్లా కలెక్టర్ సంబంధిత వ్యక్తి వివరాలను సిఫార్సు చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం వాటిని క్షుణ్ణంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుంది. కాగా, షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ), మరియు టీ గార్డెన్ కమ్యూ నిటీలకు చెందిన వారికి మార్చి 31, 2027 వరకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు. 18 ఏళ్లు పైబడిన వారికి కొత్త ఆధార్‌కార్డుల జారీ ప్రక్రియను నిలిపివేసినప్పటికీ, 18 ఏళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు యథాతథంగా కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# రాహుల్ ఆక్షేపణ

## అమెరికాకు నమ్మకమైన సేవకుడిలా వ్యవహరిస్తున్న మోడీ

**న్యూఢిల్లీ, జూన్ 14:** హార్మూజ్ జలసంధిలో అమెరికా సైనిక దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో కేంద్రం అమెరికాకు ఒక నమ్మకమైన సేవకుడిలా మోడీ వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందిస్తూ అమెరికా ఏమాత్రం పశ్చాత్తాపం చూపకపోగా, వారి ఆదేశాలను పాటించని నౌకలను సహించబోమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో హెచ్చరించడాన్ని ఆయన తప్పుబట్టారు. అమెరికా దాడుల్లో మన ముగ్గురు నావికులు చనిపోయి కొద్ది రోజులే అయింది. అయినా ఇంతవరకు వారి నుంచి కనీసం పశ్చాత్తాపం లేదు, క్షమాపణ లేదు. పైగా, మనకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. అమెరికా సైన్యం ఆదేశాలను తక్షణమే పాటించాలి. ఎలాంటి ఉల్లంఘనలైనా సహించేది లేదన్న వారి మాటలు చూడండి. ఒక స్వతంత్ర దేశం



ఇలాంటి భాషను ఎప్పటికీ సహించదు. కానీ మన బలహీన ప్రధాని మాత్రం నోరు మెదపడం లేదు. ఒక విధేయుడైన సేవకుడిలా వారి ఆదేశాలను వింటున్నారు, పాటిస్తున్నారు. ఈ బలహీన ప్రధాని దేశ గౌరవాన్ని కాపాడలేరు. ఎందుకంటే, దేశాన్ని అవమానించే వాళ్లే ఆయన నియంత్రణలో ఉన్నారు. అందుకే మన వాళ్లను చంపినా, మనల్ని అవమానించినా ఆయన మౌనంగా ఉండిపోతున్నారు. ఇది దేశ ప్రజలందరూ గమనించాలంటూ రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇతర నేతలు కూడా కేంద్రంపై విరుచుకుపడ్డారు. ఈ ఘటనపై అమెరికా బేషరతుగా క్షమాపణ చెప్పాలని పవన్ ఖేరా డిమాండ్ చేశారు. విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందన చాలా బలహీనంగా ఉందని, ఆయన కేవలం ఇది సమర్థనీయం కాదు అనడం సరికాదని అన్నారు. మరో నేత మనీశ్ తివారీ మాట్లాడుతూ, అమెరికా మంత్రి వ్యాఖ్యలు బెదిరింపుగా ఉన్నాయని, నావికుల మృతికి వారే కారణమన్నట్లుగా ఉన్నాయని ఆరోపించారు. ఈ ఘటనపై భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అమెరికాతో మాట్లాడి, నావికుల మృతిపై తీవ్ర నిరసన తెలిపినట్లు వెల్లడించారు. వాణిజ్య నౌకలపై ప్రాణాంతక దాడులు సమర్థనీయం కాదని స్పష్టం చేసినట్లు తెలిపారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో జరిగిన ఈ ఘటన, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానంపై ప్రతిపక్షాలకు ప్రధాన అస్త్రంగా మారింది.

# సంక్షిప్త వార్తలు

## లండన్‌లో భారత్ సంతతి యువకుడి దారుణ హత్య



**లండన్, జూన్ 14:** భారత సంతతి యువకుడు నగరంలో దారుణ హత్యకు గురయ్యాడు. పశ్చిమ లండన్‌లోని సౌత్‌హాల్ ప్రాంతంలో పంజాబ్‌కు చెందిన 26 ఏళ్ల గుర్బేజ్ సింగ్‌ను దుండగులు కత్తితో పొడిచి చంపారని మెట్రోపాలిటన్ పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనతో లండన్‌లోని భారత సమాజంలో ఆందోళన వ్యక్తమవుతోంది. బుధవారం అర్ధరాత్రి దాదాపు 12:30 గంటలకు నార్త్ రోడ్‌లోని డోర్మర్స్ వెల్స్ లేన్ జంక్షన్ వద్ద ఈ దాడి జరిగింది. కత్తిపోట్లపై సమాచారం అందుకున్న లండన్ అంబులెన్స్ సర్వీస్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, పారామెడికల్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకునేసరికి ఇద్దరు వ్యక్తులు గాయాలతో పడి ఉన్నారు.

## మమతా బెనర్జీకి లీగల్ నోటీసులు

**కోల్‌కతా, జూన్ 14:** పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి టిఎంసి రెబల్ ఎంపి కకోలీ ఘోష్ కుమారుడు బైద్యనాథ్ ఘోష్ లీగల్ నోటీసులు పంపారు. మాజీ సీఎం మమతాతోపాటు మరో ముగ్గురు ఎంపిలకు కూడా లీగల్ నోటీసులు పంపారు. బరసత్ అసెంబ్లీ టికెట్ కోసం తాను పార్టీని అడిగానని చేసిన ఆరోపణలపై క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. పదవి కోసం తాను ఆశపడలేదని ఆయన స్పష్టం చేశారు. మమతకు లీగల్ నోటీసులివ్వడంపై పశ్చిమబెంగాల్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అటు తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో ప్రక్షాళన చేపట్టిన అధిష్ఠానం యువజన విభాగం అధ్యక్షుడిగా అర్నబ్‌బెనర్జీ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా అలీఫా అహ్మద్‌ను నియమించింది.

## ఎఐఎడిఎంకెకు సీనియర్ నటి గౌతమి రాజీనామా

**చెన్నై, జూన్ 14:** తమిళనాడు రాజకీయాల్లో ఎఐఎడిఎంకెకు షాక్ తగిలింది. ఆ పార్టీకి సీనియర్ నటి గౌతమి రాజీనామా చేశారు. పార్టీ సభ్యత్వంతో పాటు తన పదవికి రాజీనామా చేస్తూ ఎఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శి పళనిస్వామికి లేఖ పంపారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీలోని అంతర్గత పరిణామాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు. కచ్చితమైన కారణాలను మాత్రం వెల్లడించలేదు. బిజెపితో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన గౌతమి ఆ తర్వాత ఎఐఎడిఎంకెలో చేరారు. ఆమె తదుపరి అడుగుపై తీవ్ర ఆసక్తి నెలకొంది.

## పరిహారం ఫైల్ పెండింగ్.. అధికారిని చెప్పుతో కొట్టిన రైతు

**బెంగళూరు, జూన్ 14:** కర్ణాటకలోని బాగల్‌కోట్‌లో భూసేకరణ పరిహారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ విసిగిపోయిన రైతు బసప్ప దొడమణి.. శనివారం టౌన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో ఒక అధికారిపై చెప్పుతో దాడి చేశాడు. ఈ ఘటనతో కార్యాలయంలో కలకలం రేగింది. కొందరు అధికారులు భయంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పిఒకెలో ప్రజలపై షరీఫ్ సర్కార్ అణిచివేత, దమనకాండ




**ముజఫరాబాద్, జూన్ 14:** పాక్ ఆక్రమిత కాశ్మీర్ పీవోకేలో ప్రజలు రాజకీయ హక్కులు, అణచివేతకు వ్యతిరేకంగా తిరగబడుతున్నారు. అక్కడి ప్రజలు బాధల్ని వినకుండా పాకిస్తాన్ ప్రభుత్వం, పాక్ ఆర్మీ ప్రజల్ని పిట్టల్లా కాల్చి చంపుతోంది. తమ హక్కుల్ని పాక్‌లోని ఇతర ప్రాంతాల వారు ముఖ్యంగా పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన వారు దోచుకు పోతు న్నారని పీఓకేలోని ప్రజలు ఆరోపిస్తున్నారు. పీఓకేను పంజాబ్‌గా పాకిస్తాన్ మారుస్తోందని,వలసల్ని ప్రోత్సహించడంతోపాటు పీఓకేలోని సహజవనరులను పంజాబ్ ప్రాంతానికి దోచిపెడుతోందని ఆరోపిస్తున్నారు. నిజానికి ఇది పీఓకే ఒక్క ప్రాంత సమస్య కాదు. పాకిస్తాన్‌లోని ఖైబర్ ఫఖ్తుంఖ్వా, బలూచిస్తాన్, సింధ్ ప్రావిన్సుల హక్కుల్ని కూడా పంజాబ్ ప్రావిన్స్ హరిస్తుందనే భావన అక్కడి ప్రజల్లో ఉంది. పాకిస్తాన్ అంటే పంజాబ్, పంజాబ్ అంటే పాకిస్తాన్ అనేది నిజం. ఎందుకంటే పాకిస్తాన్ సైనిక వ్యవస్థ, రాజకీయ వ్యవస్థలో పంజాబీ ఆధిక్యత కనిపిస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే పాక్ ఆర్మీని ఖైబర్ ఫఖ్తుంఖ్వావంటి ప్రాంతాల్లో పంజాబ్‌ఆర్మీ అని సంబోధిస్తుంటారు. పాకిస్తాన్ పంజాబీల ఆధిపత్యం గల సైన్యం, అధికార యంత్రాంగం, రాజకీయ వ్యవస్థలు పాక్ ఆక్రమిత కాశ్మీర్, గిల్గిత్‌బాలిస్తాన్‌లపై తమ నియంత్రణకోసం ఒత్తిడి చేస్తున్నాయని హక్కుల కార్యకర్తలు, సంస్థలు చెబుతున్నారు.

# సోమవతీ అమావాస్య



నేడు సోమవతీ అమావాస్య

అత్యంత విశిష్టమైన అమావాస్య రోజులలో సోమవతీ అమావాస్య ఒకటి. సోమవారం నాడు అమావాస్య కలిసి వస్తే అదే ఈ పర్వదినం. 2026లో, ఆ సంవత్సరపు తొలి సోమవతీ అమావాస్య 'అధిక మాసం' (అదనపు చాంద్ర మాసం)లో రావడం వల్ల, ప్రార్థనలు, దాన ధర్మాలు ఆధ్యాత్మిక కార్యక్రమా లకు ఇది మరింత శుభప్రదంగా మారింది. హిందూ విశ్వాసాల ప్రకారం, ఈ రోజున శివ పార్వతులను పూజిస్తే కుటుంబం లో సామరస్యం, శ్రేయస్సు దైవాను గ్రహం లభిస్తాయి. అమృత సిద్ధి యోగం సర్వార్థ సిద్ధి యోగాల అరుదైన కలయిక కారణంగా ఈ సంవత్సరం ఈ పర్వదినం ఎంతో ప్రత్యేకమైనది. 2026 జూన్ 14న మధ్యాహ్నం 12:19 గంటలకు అమావాస్య తిథి ప్రారంభమై, 2026 జూన్ 15న ఉదయం 8:23 గంటలకు ముగుస్తుందని మన పంచాం గాలు నివేదిస్తు న్నాయి. సూర్యోదయ సమయంలో అమావాస్య ఉన్నందున, సోమవతీ అమావాస్యను 2026 జూన్ 15, సోమవారంనాడు జరుపుకోవడం ప్రతీతి. హిందూ సంప్రదాయంలో, సోమవతీ అమావాస్య శివారాధన, పార్వతీదేవి పితృదేవతల సోమవతీ అమావాస్య ఆరాధనతో ముడిపడి ఉంది. శాంతి, శ్రేయస్సు కుటుంబ శ్రేయస్సు కోసం చాలా మంది భక్తులు ఉపవాసం ఉండి ప్రత్యేక పూజలు చేస్తారు. శివ పార్వతులను పూజి స్తారు. వైవాహిక బంధంలో సామరస్యం పెరుగుతుందని విశ్వాసం. తర్పణం, శ్రాద్ధం వంటి ఆచారాల ద్వారా పితృదేవతలకు ప్రార్థనలు చేయడానికి కూడా ఆ రోజు చాలా ముఖ్యమైనది. గోధుమ పిండిలో పంచదార కలిపి చీమలకు ఆహారంగా ఇవ్వడం మంచిది. ఇలాచేస్తే ఆర్థిక ద్డంకులను తొలగించి, సానుకూల శక్తిని ఆకర్షిస్తుంది అదే రోజు సూర్యాస్తమయం తర్వాత తులసి మొక్క దగ్గర నెయ్యి దీపం వెలిగించడం అత్యంత శుభప్రదం. ఈ ఆచారం పాటించడం వల్ల లక్ష్మీ కటాక్షం కలుగు తుంది. వాస్తు శాస్త్రం ప్రకారం ఆ రోజు సాయంత్రం ఈశాన్య దిశమూలలో ప్రత్యేక ప్రాము ఖ్యత ఉంది. సాయం త్రం ఈ మూలలో నెయ్యి దీపం వెలిగించడం వల్ల ఇంటికి శాంతి, అదృష్టం కలుగుతుంది నమ్ముతారు. ఉదయాన్నే స్నానమాచరించాక భక్తులు రావి చెట్టును పూజించి, దాని చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. అక్కడ అశ్వత్థనారాయణుడు కొలువై ఉంటా డని ఆమనే ఆర్థిక ఇబ్బందులను తొలగించి, స్థిరత్వాన్ని చేకూరుస్తారని భక్తుల విశ్వాసం సోమవతి అమావాస్య నాడు తెల్లని మిఠాయిలు, ధాన్యాలు, నువ్వులు, బట్టలు, పాదరక్షలు ఇతర ఉపయోగకర మైన వస్తువులను దానం చేయడం అత్యంత పుణ్యకార్యం. పెద్దల ఆశీర్వాదాన్ని అందుకోగలుగుతాము. □



## బరువు తగ్గించే 'మూంగ్‌దాల్ చీలా'!

**అధిక బరువును తగ్గించుకోవడం కోసం పడే పాట్లు అన్నీ ఇన్నీ కావు కదా!** 'మూంగ్‌దాల్ చీలా తింటే' బరువు ఇట్టే తగ్గుతారు. ఆ విషయంలో వినగానే ఖయురేకా' అంటూ అమ్మాయిలు ఎగిరి గంతేస్తారు. తీరా దాని అసలు సిసలు తెలుగు పేరు 'పెసరట్టు' అనగానే ఔనా! అంటూ .. అయితే ఇంకేంమరి తిందాం! అంటూ వటింట్లోకి దారి తీస్తారు. అందు కోసం పెసర పప్పు ను నానబెట్టి అందులో మిరపకాయ, జీలకర్ర, రుచికి తగినంత ఉప్పు, పసుపు, కొత్తిమీర, అన్నింటినీ వేసి మిక్సీ పట్టండి. దాన్లో కొంచెం నీళ్లను కలిపి అట్టులా వేసు కుంటే సరి ఇందులోని ప్రొటీన్ మెటబాలిజాన్ని మెరుగుపరచడమే కాకుండా ఆకలినీ అదుపులో ఉంచుతుంది. దీనిలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ కావడం వల్ల బ్లడ్ షుగర్ స్థాయులూ అదుపులో ఉంటాయి. పెసర్లలోని ఫైబర్ పొట్టనిండిన భావనను కలిగించి ఎక్కువ ఆహారం తీసుకోకుండా నూ సాయపడుతుంది. తద్వారా బరువు తగ్గుతుందటే నమ్మండి ! మరి! □


## నిర్లక్ష్యానికి మూల్యం ఇదే కదా !

**మహిళలు ప్రతి ఉదయం వ్యాయామంలో ముందుగా అరగంటసేపు 'వార్మ్ అప్' పరుగులు తీస్తిరు. పరుగు పెట్టేటప్పుడు మనం చేసే కొన్ని పొరపాట్లవల్ల ఆరోగ్యానికి బదులుగా మరిన్ని అనారోగ్యాలు చుట్టుముట్టే ప్రమాదం ఉంది. ప్రధానంగా కీళ్ల నొప్పులు రాకుండా చూసుకోవాలి. కాబట్టి కొన్ని జాగ్రత్తలతో వీటి నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు. అవేంటో చూద్దాం.**



పరుగుపెట్టడం ఆరోగ్యానికి మంచిదే. అయినా కొన్ని సార్లువేగంగా పరుగెట్టేటప్పుడు చీలమండ బెణకడం, ఒత్తిడి పెరగడంవంటి సమస్యలు తప్పవు. కాబట్టి జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి. పరుగులో తేదావస్తే క్రమేపీ కండరాల అసమతుల్యతతో ఇది దీర్ఘకాల సమస్య 'వెన్ను నొప్పికి దారి తీస్తుంది. చాలామంది రన్నర్లు ఓవర్‌స్ట్రైట్ రన్నింగ్‌గా అడుగులు దూరంగా వేస్తూ పరుగుపెడు తుంటారు. దీనివల్ల మోకాలిపై ఒత్తిడి పెరుగుతుంది. ఇది మోకాళ్లతోపాటు చీలమండపైనా చెడు ప్రభావం పడేలా చేస్తుంది. ఎంతో వేగంగా నడిచినా లేదా పరుగు పెట్టినప్పుడైనా అడుగుల మధ్య సహజమైన దూరాన్ని పాటిస్తూ ముందుకు సాగాలి. అధికబరువు తగ్గడమే లక్ష్యంగా పెట్టు కునేవారు డాక్టరు సలహాలు పాటించడం మేలు. పాదాలవద్ద బెణికినట్లు లేదా కీళ్ల వద్ద చిన్నగా నొప్పి మొదలవుతుంది. ఇలాంటి. నొప్పిని విస్మరించడానికి ప్రయత్నిస్తూ పరుగును కొనసాగిస్తే మరొక కొత్త సమస్యకు కారణం అవుతుంది. ఈ తీవ్రత పెరిగి కీళ్లకు సంబంధించిన అనారోగ్యాలు మొదలవుతాయి. వ్యాయామానికే కాదు, పరుగు పెట్టే ముందు 'వార్మ్-అప్' తప్పనిసరి. మోకీళ్లతో వచ్చేతంలా మరో రకంగా బాధిస్తుంది. ముందుగా చేసే వార్మ్ అఫ్' పాదాలపై ఒత్తిడి కలగనివ్వకుండా, అలాగే పరుగుపెట్టడానికి కండరాలు కీళ్లను సిద్ధం చేస్తాయి. పరుగెత్తేటప్పుడు సౌకర్యంగా ఉండటానికి మనం ధరించే బూట్లు కూడా సహకరించాలి. బిగుతైన పాదరక్షలు కీళ్లపై ఒత్తిడి పెంచుతాయి. ఫ్లాట్‌గా ఉండేవాటిని ఎంచుకోవాలి. ఒక్క పరుగు మన ఆరోగ్యాన్ని సంరక్షిస్తుందంటే ఇదే కాబోలు.

## 'ఎమ్మా'యే వయసు 92
# ముదిమిని జయించిన ధీర!



**వయసు మీదపడుతోంటే ఇంకా బతికి ఏం చేస్తాం, కృష్ణా రామా అనుకుని ఓ మూల కూర్చుంటాం లేమా! అంటూ విసవిసలు పడే బామ్మలున్న ఈ రోజుల్లోనే 'నిత్య వ్యాయామం నిత్య యవ్వనం నినాదంతో ముందుకుసాగు తున్న తొమ్మిది పదుల మామ్మగారి గురించి చెప్పుకుందాం..**

ఇటలీకి చెందిన మాజీ సైన్స్ టీచర్ ఎమ్మా మారియా మజ్జెంగా మాత్రం ప్రపంచాన్ని ఆశ్చర్యపర ఽస్తోంది. 92 ఏళ్ల ఆమె ఆమె ఇప్పటికీ అథ్లెట్‌గా పోటీల్లో పాల్గొంటూ 90–94 ఏళ్ల వయసు క్యాటగిరీలో పలు ప్రపంచ రికార్డులు నెలకొల్పింది. ఈ స్థాయికి ఎదిగిందంటే ఆమె శరీర సామర్థ్యమే. ఆమెకు శ్రీరామ రక్ష అంటుంటారు శాస్త్రజ్ఞులు తాజాగా ఆమె ఆరోగ్య పరిస్థితిపై నిర్వ హించిన అధ్యయనంలో తేలిందేమిటంటే 92 ఏళ్ల వయసులో ఉన్నప్పటికీ ఆమె శారీరక సామర్థ్యం దాదాపు 30 ఏళ్ల వయసున్న మహిళ స్థాయిలో ఉందని పరిశోధకులు గుర్తిం చారు. ఎమ్మా శరీరంలో ఆక్సిజన్‌ను గ్రహించి కండరాలకు చేరవేసే వ్యవస్థ అత్యంత సమర్థంగా పనిచేస్తోంది. అంతేకాదు కణాల్లో శక్తిని ఉత్పత్తి చేసే మైటో కాండ్రియా పనితీరు కూడా యవ్వత స్థాయిలోనే ఉందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఆము నిత్యావ్యాయామం వృద్ధాప్య ప్రభావాన్ని తగ్గిస్తోందన ిదానికి ఎమ్మాయే ఉదాహరణ. ఇంత ఫిట్‌గా ఉండటానికి ఆమె అనుసరించే సింపుల్ లైఫ్‌స్టైల్ కూడా ఓ కారణం. ఎమ్మా వారానికి మూడు రోజులు మాత్రమే వ్యాయామం చేస్తుంది. ఒక్కో సెషన్ గంటలోపే ముగుస్తుంది. కొద్దిసేపు జాగింగ్, కొన్ని స్ప్రింట్లు, రోజువారీ నడక, తేలికపాటి వ్యాయామాలు ఆమె రొటీన్‌లో భాగం. ఎక్కువ దూరం పరుగులు తీయడం మాత్రం ఆమెకు అలవాటు లేదు. ఆహారం విషయంలో కూడా ఎమ్మా ప్రత్యేక డైట్‌లను అనుసరించడం లేదు. చేపలు, గుడ్లు, కూరగాయలను ఎక్కువగా తీసుకుం టుంది. అదే సమయంలో అప్పుడప్పుడు స్టేక్ వంటి ఇష్టమైన ఆహారాన్ని కూడా ఆస్వాదిస్తుంది. కఠినమైన ఆహార నియమాల కంటే బ్యాలెన్స్‌డ్ డైట్, క్రమం తప్పని వ్యాయామమే ఆరోగ్య రహస్యం అని ఆమె జీవనశైలి చెబుతోంది. వయసు పెరిగినా శారీరక చురుకుదనం కొనసాగిస్తే ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండొచ్చని ఆమె మరోసారి నిరూపించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సూచించే ఆరోగ్యకర జీవన విధానానికి కూడా ఎమ్మా అలవాట్లు దగ్గరగా ఉండటం గమనార్హం. □

## నురగ స్నానం.. ఎలా ?



**వేసవి ఉష్ణోగ్రతల** నుంచి సేదతీరేందుకు షవర్‌బాత్‌లూ టబ్‌బాత్‌లూ చేస్తుంటారు. కొందరు వీటివల్ల మహిళలకు యూటీఐ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉందంటున్నాయి అధ్యయనాలు. నురగ ఎక్కువ రావడానికి ఉపయోగించే రసాయనాలు జననేంద్రియాలో మంట, దురదను కలిగిస్తాయి. సహజంగా యోని పిహెచ్ ఆమ్లత్వాన్ని కలిగి ఉంటుంది. ఇది ఆరోగ్యకర బ్యాక్టీరియాను కాపాడటంలో సాయపడుతుంది. బబుల్‌బాత్ లిక్విడ్‌లో ఉండే హానికారక రసాయనాలు. జననేంద్రియాల్లో ఉండే సహజ నూనెలను తొలగించడంతో ఆ ప్రదేశం పొడిగా మారే అవకాశం ఉంది. అలా కాకూడదంటే మీ చర్మతత్వాన్ని బట్టి సల్ఫేట్లు లేని బాత్‌సోప్ లిక్విడ్లు మాత్రమే ఎంచుకోవాలి. పావుగంటకు మించకుండా స్నానం చేయాలి. స్నానానంతరం జననేంద్రియాలను తడి లేకుండా తుడవాలి. □

## రెడ్ డేట్స్‌తో ఆందోళన మాయం !

రెడ్ డేట్స్ పండ్ల గురించి ఎప్పుడైనా విన్నారా? ఇవి ఎర్రగా, కోలగా ఉంటాయి. చూడటానికి రేగు పండ్లు, ఖర్జూరాలను పోలి ఉంటాయి. పండ్లు ముగ్గిన కొద్దీ ముడతలు పడతాయి. ఇవి పుట్టింది చైనాలోఅయినా.. ఇప్పుడు చాలా దేశాల్లో దొరుకుతున్నాయి. ఈ పండ్లను చైనీస్ డేట్స్ అని



ఈ చెట్లు 16 నుంచి 39 అడుగుల ఎత్తు వరకూ ఎదుగుతాయి. రెడ్ డేట్స్ పండ్లను అలాగే తినొచ్చు. లేదంటే జ్యూస్ చేసి తాగొచ్చు. వీటిలో యాంటీ డిప్రెసెంట్ గుణాలు ఉంటాయి.. ఒత్తిడి ఆందోళనలు తగ్గుతాయి. ఇవి నరాల వ్యవస్థకు రక్షణ కల్పిస్తాయి. నొప్పి, వాపులను తగ్గిస్తాయి. శరీరంలో చేరిన బ్యాక్టీరియాను నశింపచేస్తాయి. రక్తపోటును అదుపులో ఉంచుతాయి. ఇంత మేలు చేసే పండ్లు మనకు కూడా అందుబాటులో ఉంటే బాగుంటుంది కదూ! □

# 'నాగబంధం' ఘన విజయం సాధిస్తుంది: డైరెక్టర్ అభిషేక్ నామా



విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం – ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. స్వామి వారి రథయాత్ర ఈవెంట్‌లో డైరెక్టర్ అభిషేక్ నామా మాట్లాడుతూ.. ' ఇంత వర్షంలో కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ థాంక్స్. ఇది కేవలం సినిమా ప్రమోషన్స్ మాత్రమే కాదు, మన సంస్కృతి, మన మూలాలను నెక్స్ట్ జనరేషన్‌కు పరిచయం చేయడానికి చేస్తున్న ఒక ప్రయత్నం. ఇది మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అన్నారు. హీరో విరాట్ కర్ణ మాట్లాడుతూ..'అనంత పద్మనాభ స్వామి వారి రథయాత్రలో పాల్గొన్నందుకు అందరికీ ధన్యవాదాలు. నాగబంధం ఎంతో కష్టపడి చేసిన సినిమా. రెండేళ్ల పాటు శ్రమించి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. జూలై 3న మీరందరూ థియేటర్లకు వెళ్లి మా చిత్రాన్ని ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను' అన్నారు. హీరోయిన్ నభా నటేష్ మాట్లాడుతూ..'స్వామి వారి రథయాత్రను ఈరోజు ప్రారంభిస్తున్నాము. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ఈ రథయాత్ర జరగబోతోంది. మీడియాకు, ప్రేక్షకులకు ధన్యవాదాలు' అన్నారు. ప్రొడ్యూసర్ నిశిత నాగిరెడ్డి మాట్లాడుతూ.. 'మేము విడుదల చేసిన ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇంత ప్రేమగా ఆదరించిన ప్రేక్షకులకు హృదయపూర్వక ధన్యవాదాలు' అన్నారు. ప్రొడ్యూసర్ కిశోర్ అన్నపురెడ్డి మాట్లాడుతూ..'ఈ వేడుకకు విచ్చేసిన అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. అనంత పద్మనాభ స్వామి యాత్ర ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో నిర్వహిస్తున్నాము. స్వామి వారి ఆశీస్సులు మా మీద ఉన్నాయని నమ్ముతున్నాము' అన్నారు.

# జూలై 10న రానున్న 'లెనిన్'

తెర



అఖిల్ అక్కినేని హీరోగా నటిస్తోన్న లేటెస్ట్ మూవీ 'లెనిన్'. మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మురళి కిషోర్ అబ్బూరు దర్శకుడు. ఈ సినిమాను జూన్ 26న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. తన అధికారిక ఎక్స్ అకౌంట్ ద్వారా ఈ విషయాన్ని నిర్మాత కింగ్ నాగార్జున తెలియజేశారు. లెనిన్ సినిమాను థియేటర్స్‌లో చూసే ఆడియెన్స్‌కు స్పెషల్ ఎక్స్‌పీరియెన్స్ కోసం బెటర్ ఔట్ పుట్ అవసరం. దాని కోసం మరింత సమయం కావాలని, ఎంటైర్ టీమ్ అందుకు కష్టపడుతోందని ఆయన తెలియజేశారు. టీమ్ తమ బెస్ట్ ఔట్‌పుట్ ఇవ్వడానికి మరింత టైమ్ కావాలని భావించిన మేకర్స్, రిలీజ్ డేట్‌ను జూలై 10కి మార్చారు.
'లెనిన్' టీమ్ నా దగ్గరకు ఓ రిక్వెస్ట్‌తో వచ్చారు. వారు తమ హండ్రెడ్ పర్సెంట్ ఎఫర్ట్స్‌తో స్పెషల్ మూవీని క్రియేట్ చేయటానికి కాస్త సమయం కావాలని అడిగారు. వారి ప్యాషన్, స్పిరిట్ చూసి నేను ఒప్పుకున్నాను. మనోడు జూలై 10న వస్తున్నాడు ఇప్పటివరకు రిలీజ్ చేసిన పోస్టర్స్, పాటలు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేపాయి. టీమ్ తీసుకున్నఈ నిర్ణయం చివరికి మంచి ఫలితాన్ని ఇస్తుందని అందరూ భావిస్తున్నారు. మ్యూజికల్ సెన్సేషన్ తమన్ సంగీతం అందిస్తోన్న ఈ సినిమాలోని పాటలతో పాటు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా సినిమాకు మరింత ఎఫెక్టివ్‌గా ఉండనుందని ఇప్పటి వరకు రిలీజైన కంటెంట్‌ను చూస్తే అర్థమవుతుంది. లియోన్ బ్రిట్టో సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ చిత్రానికి నవీన్ నూలి ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు.

# ఘనంగా 'పోలీస్ కంప్లైంట్' సక్సెస్ సెలబ్రేషన్స్



వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, కృష్ణసాయి, రాగిణి ద్వివేది ప్రధాన పాత్రల్లో ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మించిన హారర్ యాక్షన్ థ్రిల్లర్ 'పోలీస్ కంప్లైంట్' జూన్ 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. సినిమాకు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్‌లో చిత్రబృందం ఘనంగా సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించింది. కేక్ కట్ చేసి చిత్ర విజయాన్ని ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, ఈ సినిమా హీరోయిన్ వరలక్ష్మి శరత్‌కుమార్ సినిమా ప్రమోషన్‌లో పాల్గొనలేదని చిత్రయూనిట్ ఆరోపణల నేపథ్యంలో ఆమె ప్రొడ్యూసర్ కౌన్సిల్‌ను సంప్రదించారు. ఈ వివాదాన్ని పెద్దల జోక్యంతో సానుకూలంగా పరిష్కరించుకున్నామని చెప్పాను. దీంతో దర్శకుడు సంజీవ్ మేగోటి గారు తన తప్పు లేకపోయినా వరలక్ష్మికి సారీ చెప్పారు. దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ, 'మా చిత్ర హీరోయిన్ వరలక్ష్మి శరత్ కుమార్ నాలెడ్జ్ కంటే మా నాలెడ్జ్ లక్ష రేట్లు ఎక్కువ ఉంది. అందుకే ప్రసన్న కుమార్ వంటి పెద్దల సూచన మేరకే ఆమెకు సారీ చెప్పడం జరిగింది. అంతేకానీ, సమస్య పూర్తి సర్దుమణిగిందని కూడా చెప్పలేను. మొత్తానికి ఒక వివాదంతో సతమతం అయ్యాం.. చివరికి విజయంతో శుభం కార్డు పడిందని భావిస్తున్నాం' అన్నారు. హీరో కృష్ణసాయి మాట్లాడుతూ, 'సినిమాకు ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణ ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. దర్శకుడు సంజీవ్ మేగోటి ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. నా అభిమాన నటుడు సూపర్ స్టార్ కృష్ణగారిని గుర్తు చేసే పాటలో నటించడం నాకు ప్రత్యేక అనుభూతిని ఇచ్చింది' అన్నారు. నటుడు జెమినీ సురేష్ మాట్లాడుతూ, 'వివిధ ప్రాంతాల నుంచి ప్రేక్షకులు, స్నేహితులు ఫోన్ చేసి సినిమా గురించి ప్రశంసించడం ఆనందంగా ఉంది' అన్నారు. నిర్మాత ఘంటా శ్రీనివాస్ మాట్లాడుతూ, 'సినిమాలో ప్రతి నటుడు తన పాత్రకు పూర్తి న్యాయం చేశాడు. ప్రేక్షకుల ఆదరణ మాకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోంది' అన్నారు. హారర్, యాక్షన్, కామెడీ, రొమాన్స్, థ్రిల్లర్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కిన 'పోలీస్ కంప్లైంట్' ప్రస్తుతం పాజిటివ్ టాక్‌తో ప్రేక్షకులను అలరిస్తూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది.

# 'హిట్ అండ్ రన్' ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్



సంజయ్ రావ్, నటాషా సింగ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'హిట్ అండ్ రన్'. క్రైమ్, థ్రిల్లర్ జానర్‌లో రాబోతోన్న ఈ సినిమాను శ్రీ ఉరుకుంద ఈరణ్ణ స్వామి సమర్పణలో సతీష్ రెడ్డి అల్లం ఎంటర్టైన్మెంట్, శ్రీలక్ష్మీ నరసింహస్వామి క్రియేషన్స్ బ్యానర్‌ల మీద సతీష్ రెడ్డి అల్లం, కె. శేఖర్ నిర్మిస్తున్నారు. ఈ మూవీకి సాయి కృష్ణ సాగర్ దర్శకత్వం వహిస్తున్నారు. రీసెంట్‌గా రిలీజ్ చేసిన సంజయ్ రావ్ పాత్ర, ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకున్నాయి. 'హిట్ అండ్ రన్' కాన్సెప్ట్ తెలిసేలా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ అందరిలోనూ అంచనాలు పెంచేసింది. తాజాగా ఇప్పుడు రకుల్ ప్రీత్ సింగ్ 'హిట్ అండ్ రన్' సినిమాలోని హీరోయిన్ పాత్రకు సంబంధించిన లుక్‌ను రివీల్ చేశారు. నటాషా సింగ్ ఈ సినిమాలో రిపోర్టర్ సాక్షి అనే పాత్రలో కనిపించనున్నారు. పోస్టర్‌లో కనిపిస్తున్న కారు, వెనకాల ఉన్న డీటైల్స్ అన్నీ కూడా ఇంట్రెస్టింగ్‌గా ఉన్నాయి. ఇక హీరోయిన్ లుక్ కూడా చాలా డిఫరెంట్‌గా కనిపిస్తోంది. త్వరలోనే 'హిట్ అండ్ రన్' టీజర్‌తో అందరినీ మెస్మరైజ్ చేయనున్నారు. ఈ సినిమాకి ప్రిన్స్ హెన్రీ సంగీతాన్ని అందిస్తున్నారు. డి. వెంకట్ ప్రభు ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.




## సాకర్ ప్రపంచ కప్‌లో

# తళుక్కుమన్న ఇండియన్

ప్రపంచాన్ని సాకర్ ఫీవర్ ఊపేస్తోంది. దీనికి భారత్ కూడా మినహాయింపేమీ కాదు. మన జట్టు ప్రపంచకప్ ఆడకున్నా తమ ఫేవరెట్ జట్ల ఆటను ఆస్వాదించడానికి రాత్రిళ్లు జాగారం చేస్తున్నారు. అయితే మన టీమ్ లేని లోటును మనవాడు భర్తీ చేస్తున్నాడు. ప్రస్తుత సాకర్ కప్‌లో ఓ ఇండియన్ మెరిశాడు. భారతీయ మూలాలున్న వింగర్ నిషాన్ మాథ్యూ వేలు పిళ్లై... ప్రస్తుత ఫిఫా వరల్డ్ కప్‌లో అరంగేట్రం చేశాడు. భారత సంతతికి చెందిన ఓ ప్లేయర్ ఫిఫా వరల్డ్ కప్ ఆడటం ఇదే మొదటిసారి.

(వార్త క్రీడా విభాగం)

నిషాన్ మాథ్యూ వేలు పిళ్లై...తుర్కియేతో మ్యాచ్‌లో ఆస్ట్రేలియాకు ఆడాడు. 61వ నిమిషం తర్వాత సబ్ స్టిట్యూట్‌గా ఎంట్రీ ఇచ్చాడు. 61వ నిమిషంలో గోల్ చేసిన ఇరన్కుండా స్థానంలో నిషాన్ గ్రౌండ్‌లోకి వచ్చాడు. మ్యాచ్ చివరికంటా ఆడాడు. అప్పటికే ఆస్ట్రేలియా 2-0 గోల్స్‌తో స్పష్టమైన ఆధిక్యంలో ఉండడంతో కోచ్ సలహాల మేరకు నిషాన్ డిఫెన్స్‌పైనే ఫోకస్ పెట్టాడు. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించడంతో నిషాన్ ఎంట్రీ మ్యాచ్ చిరకాలం గుర్తుండిపోయేలా మారింది.

నిషాన్ వేలు పిళ్లై మలయాళీ. స్వరాష్ట్రం కేరళ. నిషాన్ తల్లి గిల్లియన్ వేలుపిళ్లై మలయాళీ. ఆమె ఆంగ్లో ఇండియన్. ఆస్ట్రేలియాలో స్థిరపడ్డారు. నిషాన్ మే7, 2001లో మెల్‌బోర్న్‌లో జన్మించారు. తల్లి ప్రోత్సాహంతో మెల్‌బోర్న్ విక్టరీ అకాడమీలో శిక్షణ పొందాడు. స్థానిక క్లబ్ నుంచి ఎదిగాడు. 2024లో ఆస్ట్రేలియా జట్టులో అరంగేట్రం చేశాడు. చైనాతో జరిగిన ఫిఫా వరల్డ్ కప్ క్వాలిఫయర్‌లో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన ఏడు నిమిషాల్లోనే గోల్ చేశాడు. ఆస్ట్రేలియాకు 3-1 విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆ గోల్ తర్వాత నిషాన్ పై ఆస్ట్రేలియా జట్టు మేనేజ్మెంట్ కు నమ్మకం పెరిగింది. ఏకంగా ఫిఫా ప్రపంచకప్‌లో ఆడే జట్టులో చోటు కల్పించింది.

తాజాగా టర్కీతో జరిగిన మ్యాచ్ కలుపుకుని ఇప్పటివరకు నిషాన్ మాథ్యూ వేలు పిళ్లై ... 8 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. మూడు గోల్స్ నమోదు చేశాడు. ఆ మూడు గోల్స్ కూడా వరల్డ్ కప్ క్వాలిఫయర్లలో చేసినవే. ఈ ప్రదర్శనలే 26 మంది ఆస్ట్రేలియా సాకర్ జట్టులో నిషాన్‌కు చోటు కల్పించాయి.

# డ్రాతో సరిపెట్టిన సాంబా : బ్రెజిల్ స్పీడ్‌కు మొరాకో బ్రేక్

## 36 యేళ్ల తర్వాత స్కాట్లాండ్ గెలుపు బోణీ * టర్కీపై కంగారూల్ * నేడు ట్యూనీషియాతో నెదర్లాండ్స్ ఢీ

**న్యూజెర్సీ, జూన్ 14:** ఫిఫా ప్రపంచకప్‌ను అయిదుసార్లు ఛాంపియన్ బ్రెజిల్ నిస్సారంగా ప్రారంభించింది. సాంబా అభిమానుల ఆశలపై నీళ్ల చల్లుతూ గ్రూప్-సి తొలిమ్యాచ్‌లో మొరాకోతో 1-1తో డ్రాగా ముగించింది. దీంతో ఇరు జట్లకు చెరో పాయింట్ లభించింది.

గాయంతో నెయ్‌మార్ ఈ మ్యాచ్‌కు దూరం కావడం సాంబా అవకాశాలను దెబ్బతీసింది. యువ ఆటగాళ్లు స్థాయికి తగ్గ ప్రతిభ చాటలేకపోయారు. ఈ మ్యాచ్ ఆరంభం నుంచే మొరాకో దూకుడుగా ఆడింది. అచ్రాఫ్ హకీమి, నీల్ ఎల్ ఐనౌయి వరుసగా గోల్ పోస్ట్‌పై వరుసగా దాడులు చేస్తూ బ్రెజిల్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. ఎట్టకేలకు ఈ వ్యూహం 21వ నిమిషంలో ఫలించింది. బ్రాహిమ్ డియాజ్ అందించిన చక్కటి పాస్‌ను అందుకున్న మొరాకో ఫార్వర్డ్ ఇస్మాయిల్ సైబారీ.. బ్రెజిల్ డిఫెండర్లు మార్క్వినోస్, గాబ్రియెల్ మగల్హాస్‌లను బోల్తా కొట్టిస్తూ అద్భుతమైన ఫీల్డ్ గోల్‌ను సాధించిపెట్టాడు. ఈ గోల్‌తో మొరాకో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత 32వ నిమిషంలో బ్రెజిల్ స్టార్ వినీషియస్ జూనియర్ సూపర్ గోల్‌తో స్కోర్ 1-1 సమం చేశాడు.

రెండో అర్ధభాగంలో ఇరు జట్లు గోల్ చేయడంలో విఫలమయ్యాయి. బ్రెజిల్ సూపర్ స్టార్లు రాఫిన్హా, డానిలో, ఇగోర్ థియాగో చేసిన ప్రయత్నాలు కూడా ఫెయిల్ అయ్యాయి. మ్యాచ్ చివరి నిమిషాల్లో మొరాకో ఆటగాడు ఎల్ ఐనౌయి కొట్టిన లాంగ్‌రేంజ్ షాట్‌ను బ్రెజిల్ గోల్ కీపర్ అలిసన్ అద్భుతంగా అడ్డుకుని జట్టును ఓటమి నుంచి కాపాడాడు. కాగా 1934 నుంచి ఫిఫా ప్రపంచకప్‌లో తమ ఆరంభ మ్యాచ్‌లో బ్రెజిల్ ఒక్కసారి కూడా ఓడిపోలేదు. ఈ డ్రాతో తన అజేయ రికార్డును కొనసాగించింది. బ్రెజిల్ తదుపరి మ్యాచ్‌లో హైతీతో తలపడనుండగా, మొరాకో జట్టు స్కాట్లాండ్‌ను ఎదుర్కోనుంది.

### విజయం కోసం 36 యేళ్లు

గ్రూప్-సి మరో మ్యాచ్‌లో స్కాట్లాండ్ ఏకైక గోల్‌తో హైతీపై గెలుపొందింది. 36 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ సాకర్ ప్రపంచకప్‌లో విజయం నమోదుచేసింది. చివరిసారిగా 1990లో స్వీడన్‌పై 2-1గోల్స్ తేడాతో నెగ్గిన స్కాట్లాండ్.. మరో గెలుపు కోసం ఇన్నాళ్లు వేచిచూసింది. ఆరంభం నుంచి ఇరు జట్లు డిఫెన్స్‌కే ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చాయి. ఆ తర్వాత ఒక్కసారిగా స్కాట్లాండ్ గేమ్ ప్లాన్ మార్చింది. వరుసగా హైతీ గోల్ పోస్ట్‌పై దాడులు చేసింది. చివరకు 28వ నిమిషంలో జాన్ మెక్‌గిన్ గోల్ చేసి స్కాట్లాండ్‌కు 1-0 ఆధిక్యం అందించాడు. ఈ మ్యాచ్‌లో నమోదైన ఏకైక గోల్ ఇదే. ఆ తర్వాత హైతీ గోల్స్ సమం చేసేందుకు ప్రయత్నించింది. అయితే స్కాట్లాండ్ రక్షణ ఫంక్తిని చేధించడంలో విఫలమైంది. హైతీ 13 సార్లు గోల్ పోస్ట్‌ను టార్గెట్ చేసినా గోల్ చేయలేకపోయింది. ఈ విజయంతో స్కాట్లాండ్ గ్రూప్-సిలో అగ్రస్థానంలో నిలిచింది.





### ఆస్ట్రేలియా దూకుడు

ఫిఫా వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. కెనడాలోని వాంకోవర్ వేదికగా జరిగిన గ్రూప్-డి మ్యాచ్‌లో టర్కీపై 2-0 తేడాతో ఘన విజయం సాధించింది. 24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రపంచకప్ బరిలోకి దిగిన టర్కీకి కంగారూలు షాక్ ఇచ్చారు. మ్యాచ్ ప్రారంభమైన 27వ నిమిషంలోనే ఆస్ట్రేలియా యువ ఫార్వర్డ్ ఆటగాడు నెస్టోరీ ఇరాన్‌కుండా అద్భుతమైన కౌంటర్ ఎటాకింగ్ గోల్‌తో జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ప్రపంచకప్ చరిత్రలో ఆస్ట్రేలియా తరఫున గోల్ చేసిన అతి పిన్న వయస్కుడిగా ఇరాన్‌కుండా రికార్డు సృష్టించాడు.

ఆ తర్వాత టర్కీ ఆటగాళ్లు మ్యాచ్‌ను డ్రా చేయడానికి తీవ్రంగా శ్రమించినప్పటికీ ఆస్ట్రేలియా డిఫెన్స్ దాన్ని తిప్పికొట్టింది. ముఖ్యంగా 75వ నిమిషంలో మిడ్‌ఫీల్డర్ కానర్ మెట్‌కాఫ్ బాక్స్ వెలుపల నుండి ఒక అద్భుతమైన లో షాట్‌తో రెండో గోల్ అందించి ఆస్ట్రేలియా విజయాన్ని ఖాయం చేశాడు. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 22 ఏళ్ల యువ గోల్‌కీపర్ పాట్రిక్ బీచ్ అసాధారణ ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నాడు. టర్కీ జట్టు చేసిన పలు ప్రమాదకరమైన గోల్ ప్రయత్నాలను సమర్థవంతంగా అడ్డుకున్నాడు. ఈ విజయంతో ఆస్ట్రేలియా ఆస్ట్రేలియా ఖాతాలో మూడు పాయింట్లు చేరాయి. ఈ గ్రూప్‌లో పరాగ్వేపై నెగ్గిన అమెరికా అగ్రస్థానంలో ఉండగా, ఆస్ట్రేలియా రెండో స్థానంలో కొనసాగుతోంది.

# టి20 ప్రపంచకప్‌లో భారత్ శుభారంభం


స్మృతి మంధాన(68)

**బర్మింగ్హామ్:** ఇంగ్లాండ్ వేదికగా జరుగుతున్న మహిళల టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా శుభారంభం చేసింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో దుమ్మురేపిన భారత మహిళల జట్టు... గ్రూప్-1 తొలి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 64 పరుగులతో ఘనవిజయం సాధించింది. ఐసీసీ టోర్నీల్లో మరోసారి భారత్ జోరుకు పాకిస్థాన్ తలొగ్గింది. 171 పరుగుల లక్ష్య ఛేధనలో పాక్‌కు టీమిండియా స్పిన్నర్లు ముచ్చెమటలు పట్టించారు. 17 ఓవర్లలోనే 106 పరుగులకు కుప్పకూల్చారు.

మొదట బ్యాటింగ్ చేసిన భారత్ విమెన్ టీమ్ ఆరంభంలో తడబడింది. 18 పరుగులకే షఫాలీ, రోడ్రిగ్స్ వికెట్లను కోల్పోయింది. ఓపెనర్ స్మృతి మంధాన(44 బంతుల్లో 68) అర్ధ శతకంతో కదం తొక్కగా.. హర్మన్‌ప్రీత్ కౌర్(35 బంతుల్లో 36) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో భారత్ కోలుకుంది. స్లాగ్ ఓవర్లలో రీచా ఘోష్(17 బంతుల్లో 34), దీప్తి శర్మ(9 బంతుల్లో 12) తుఫాన్ బ్యాటింగ్‌తో రెచ్చిపోయారు. దీంతో భారత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 రన్స్ చేసింది. 171 పరుగుల ఛేదనను పాక్ ధాటిగానే ఆరంభించింది. తొలి వికెట్‌కు 38 పరుగులు చేసింది. ఈ దశలో స్పిన్నర్ల ఎంట్రీతో ఒక్కసారిగా కుప్పకూలింది. దీప్తి శర్మ(10 రన్స్‌కు 5 వికెట్లు), శ్రీచరణి(21 రన్స్‌కు 3 వికెట్లు) బంతిని తిప్పేసి మ్యాచ్‌ను టీమిండియా వైపు మరల్చారు. దీంతో పాక్ వేగంగా వికెట్లు కోల్పోయింది. 17వ ఓవర్లో దీప్తి శర్మ ఏకంగా మూడు వికెట్లు తీసి పాక్‌ను 106 పరుగులకు ఆలౌట్ చేసింది. పాకిస్థాన్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ మునీబా అలీ(41) టాప్ స్కోరర్‌గా నిలిచింది.

# స్వర్ణంతో మెరిసిన భారత్ ఆర్చర్లు



**షాంఘై:** అంతర్జాతీయ వేదికపై భారత ఆర్చర్లు అదరగొట్టారు. చైనాలోని షాంఘై వేదికగా జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్3 రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కుంకుమ్ మొహోద్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర స్వర్ణంతో మెరిశారు. ఫైనల్లో ఒలింపిక్ ఛాంపి యన్స్ దక్షిణ కొరియా జోడీ ఓహ్ యేజిన్, కిమ్ జెడివోక్‌పై భారత్ జోడీ అద్భుత విజయం సాధించింది. దీంతో ఒలింపిక్ ఛాంపియన్ కొరియా సిల్వర్‌తో సరిపెట్టింది.


ఆంటిల్యాలో జరిగిన వరల్డ్ కప్ ఆర్చరీలో భారత పతకం ఆశలు మోసిన ధీరజ్ బొమ్మదేవర, కుంకుమ్ మొహోద్ ఫైనల్లో గురితప్పని లక్ష్యంతో దూసుకెళ్లారు. తొలి రెండు రౌండ్లలో 37-36, 37-36తో ఆధిక్యం చాటారు. ఇక మూడో రౌండ్‌లోనూ పోటాపోటీగా పాయింట్లు స్కోరు చేశారు. 39-39తో ఇరు జట్లూ సమంగా నిలిచాయి. ఓవరాల్‌గా భారత్ జోడీ 113-111 పాయింట్ల తేడాతో విజేతగా అవతరించింది. మిక్స్‌డ్ ఈవెంట్‌లో ధీరజ్, కుంకుమ్‌కు ఇదే తొలి వరల్డ్ కప్ గోల్డ్ మెడల్. ఇక నాలుగేళ్ల తర్వాత భారత్ వరల్డ్ కప్ స్టేజ్‌లో ఈ విభాగంలో పసిడి పతకం సాధించింది. చివరిసారిగా 2022 ఈవెంట్‌లో రిధి ఫోర్, తరుణ్‌దీప్ రాయ్ జోడీ స్వర్ణం గెలుచుకుంది.

# టాప్-8 సంస్థల్లో 1.90 లక్షల కోట్ల ఎంక్యాప్ వృద్ధి

**ముంబై, జూన్ 14:** దేశంలోని అత్యంత విలువైన టాప్10 కంపెనీల్లో ఎనిమిది సంస్థల మార్కెట్ విలువలు గత వారం రూ.1.90 లక్షల కోట్ల మేర పెరిగింది. ఈ వృద్ధిలో ఐసీఐసీఐ బ్యాంక్ అగ్రస్థానంలో నిలిచింది. రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా మాట్లాడుతూ, గ్లోబల్ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, విదేశీ కరెన్సీ ప్రవాహాలను ఆకర్షించేందుకు ఆర్‌బీఐ చేపట్టిన చర్యలు భారత ఈక్విటీ మార్కెట్లకు మద్దతుగా నిలిచాయని తెలిపారు. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరే అవకాశాలపై ఆశావహ సంకేతాలు రావడంతో పెట్టుబడిదారుల విశ్వాసం పెరిగిందన్నారు. టాప్10 కంపెనీల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్‌అండ్‌టీ), హిందుస్థాన్ యూ నిలీవర్ మార్కెట్ విలువ పెరిగింది.

మరోవైపు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ టీసీఎస్, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎల్‌ఐసీ, మార్కెట్ క్యాప్ తగ్గింది. ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.56,223 కోట్ల మేర పెరిగి రూ.9.61 లక్షల కోట్లకు చేరుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలువ రూ.38,571 కోట్ల పెరుగుదలతో రూ.11.89 లక్షల కోట్లకు చేరగా, ఎస్‌బీఐ మార్కెట్ క్యాప్ రూ.36,138 కోట్ల పెరుగుదలతో రూ.9.38 లక్షల కోట్లకు చేరుకుంది.

బజాజ్ ఫైనాన్స్ విలువ రూ.18,367 కోట్లు పెరిగి రూ.5.72 లక్షల కోట్లకు చేరగా, భారతి ఎయిర్‌టెల్ మార్కెట్ క్యాప్ రూ.14,380 కోట్లు పెరిగి రూ.11.10 లక్షల కోట్లకు చేరింది. అలాగే ఎల్‌అండ్‌టీ మార్కెట్ విలువ రూ.13,241 కోట్ల పెరుగుదలతో రూ.5.57 లక్షల కోట్లకు చేరగా, హిందుస్థాన్ యూనిలీవర్ విలువ 10,984కోట్ల పెరుగుదలతో రూ.5.09 లక్షల కోట్లకు చేరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాప్ కూడా 2,098 కోట్ల మేర పెరిగి 17.49లక్షల కోట్లకు చేరుకుంది. ఇక టీసీఎస్ మార్కెట్ విలువ రూ.13,296 కోట్ల మేర తగ్గి రూ.7.82 లక్షల కోట్లకు చేరగా, ఎల్‌ఐసీ మార్కెట్ క్యాప్ రూ.822 కోట్ల మేర క్షీణించి రూ.5.05 లక్షల కోట్లకు పడిపోయింది. మార్కెట్ విలువల పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశంలోనే అగ్రస్థానంలో ఉంటే ఆ తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టీ, హిందుస్థాన్ యూనిలీవర్, ఎల్‌ఐసీ స్థానాల్లో ఉన్నాయి.





# ఎఫ్‌టీఏలతో ఫర్నిచర్ రంగానికి భారీ ఊతం

## ఎగుమతులు, పెట్టుబడులు పెరిగే అవకాశం

**న్యూఢిల్లీ, జూన్ 14:** భారత్ ఇటీవల కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు దేశీయ ఫర్నిచర్ పరిశ్రమకు కొత్త అవకాశాలను తెరుస్తున్నాయని పరిశ్రమ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఒప్పందాల ద్వారా ఎగుమతులు పెరగడంతో పాటు దేశీయ తయారీ సామర్థ్యాలు పెరిగి కొత్త పెట్టుబడులు వస్తాయని అంచనా. భారత్ ఇప్పటికే మారిషస్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా, యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ దేశాలు, ఒమాన్‌లతో ఎఫ్‌టీఏలను అమలు చేసింది. న్యూజిలాండ్, యునైటెడ్ కింగ్‌డమ్‌లతో ఒప్పందాలు కుదుర్చుకోగా, యూరోపియన్ యూనియన్‌తో చర్చలు విజయవంతంగా ముగించింది. ఇజ్రాయెల్, కెనడా, పెరూ, చిలీ, గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా), యూరేషియన్ ఎకనామిక్ యూనియన్ దేశాలతో కూడా ఇలాంటి ఒప్పందాల కోసం చర్చలు కొనసాగుతున్నాయి. గుజరాత్‌కు చెందిన నిప్పోన్‌ప్లై ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ కేతన్ ఠక్కర్ మాట్లాడుతూ, ఈ వాణిజ్య ఒప్పందాలు భారత ఫర్నిచర్ రంగానికి అపారమైన ఎగుమతి అవకాశాలను అందిస్తాయని తెలిపారు. ఇప్పటికే తమ సంస్థ విదేశాలకు ఉత్పత్తుల ఎగుమతులను ప్రారంభించిందని చెప్పారు. భారతీయ ఫర్నిచర్ ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉంటాయని, ప్రపంచ మార్కెట్లలో వాటికి మంచి డిమాండ్ ఉందని ఆయన పేర్కొన్నారు. ఆఫీస్, హోమ్ ఫర్నిషింగ్ ఉత్పత్తులను భారత్ పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటోందని, వాటిని దేశీయంగా తయారు చేసే సామర్థ్యం మనకు ఉందని తెలిపారు. నిప్పోన్‌ప్లై ఇండస్ట్రీస్ ప్రాజెక్ట్ హెడ్ ఆస్థా ఠక్కర్ మాట్లాడుతూ, రౌండ్ డైనింగ్ టేబుల్స్, కాన్ఫరెన్స్ టేబుల్స్, మోనోలిథిక్ బఫెట్ టేబుల్స్, కుర్చీలకు మంచి విచారణలు వస్తున్నాయని తెలిపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ వైస్‌చాన్సలర్ రాకేష్ మోహన్ జోషి మాట్లాడుతూ, ఎఫ్‌టీఏల వల్ల భారతఫర్నిచర్ రంగానికి విస్తృతమైన ఎగుమతి అవకాశాలు లభించాయని, పరిశ్రమలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వీడన్‌కు చెందిన ప్రముఖ ఫర్నిచర్ రిటైల్ సంస్థ ఐకియా ఇటీవల భారత్‌లో కొత్త ఉత్పత్తి అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. భారత ఫర్నిచర్ మార్కెట్ విలువ ప్రస్తుతం 30 బిలియన్ డాలర్లకు పైగా ఉంది. ప్రపంచ ఫర్నిచర్ ఎగుమతుల్లో భారత్ ప్రస్తుతం 16వ స్థానంలో ఉంది. ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అంచనాల ప్రకారం, ప్రపంచ ఫర్నిచర్ పరిశ్రమ 2030 నాటికి 872.5 బిలియన్ డాలర్ల మార్కెట్‌గా ఎదుగుతుంది. ప్రస్తుతం ప్రపంచ ఫర్నిచర్ ఎగుమతుల్లో భారత్ వాటా 1 శాతానికి కొద్దిగా ఎక్కువగా ఉంది.




# ఇపిఎఫ్ ఖాతాదారులకు 7 లక్షల ఉచిత బీమా

**న్యూఢిల్లీ, జూన్ 14:** భారతదేశంలోని వేతన ఉద్యోగులకు ఉద్యోగుల భవిష్య నిధి ఈపీఎఫ్ అత్యంత ముఖ్యమైన సామాజిక భద్రతా పథకాలలో ఒకటిగా కొనసాగుతోంది. ఈపీఎఫ్ పథకం ప్రకారం ఉద్యోగులు ప్రతి నెల తమ ప్రాథమిక వేతనంలో కొంత మొత్తాన్ని భవిష్య నిధి ఖాతాలో జమ చేయాలి. అదే మొత్తాన్ని యజమాని కూడా చెల్లిస్తారు. ఈ నిధిపై వడ్డీ జమ అవుతూ ఉండటంతో ఉద్యోగ విరమణ సమయానికి గణనీయమైన నిధి సమకూరుతుంది. ఇటీవల తీసుకొచ్చిన ఈపీఎఫ్ఓ3.0 సంస్కరణలలో భాగంగా ఉద్యోగులు పదవీ విరమణకు ముందే పీఎఫ్ నిధులను సులభంగా పొందే అవకాశాలు పెరిగాయి. డిజిటలైజేషన్, తక్కువ పత్రాల ప్రక్రియ, వేగవంతమైన క్లెయిమ్ పరిష్కారాలు, మెరుగైన ఆన్‌లైన్ సేవలు, సులభ ఖాతా నిర్వహణ వంటి ప్రయోజనాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే చాలా మంది ఉద్యోగులకు తెలియని మరో ముఖ్యమైన ప్రయోజనం కూడా ఈపీఎఫ్ ఖాతాతో అనుసంధానమై ఉంది. అదే ఎంప్లాయీస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ఈఎల్ఐఎస్ పథకం. ఈ పథకం కింద అర్హులైన ఈపీఎఫ్ సభ్యులకు రూ.7లక్షల వరకు బీమా రక్షణ లభిస్తుంది. ఇందుకోసం ఉద్యోగులు అదనంగా ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. సేవలో ఉండగానే ఉద్యోగి మరణించిన సందర్భంలో ఉద్యోగి వేతనం, ఈపీఎఫ్ నిల్వల ఆధారంగా కనిష్ఠంగా రూ.2.5 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.7 లక్షల వరకు బీమా మొత్తం అందుతుంది. ఈడీఎల్ఐ పథకంలో భాగంగా ఉద్యోగి వేతనంలో 0.5 శాతం మొత్తాన్ని యజమాని బీమా నిధికి చెల్లిస్తారు. ఈ బీమా ప్రయోజనం ఉద్యోగి వేతనం, ఈపీఎఫ్ ఖాతా నిల్వలు మరియు గత సేవా వివరాల ఆధారంగా నిర్ణయిస్తారు. 12 నెలల సగటు పీఎఫ్ నిల్వలు లేదా సగటు నెలవారీ వేతనం ఆధారంగా లెక్కింపు జరుగుతుంది. ఈపీఎఫ్ సభ్యులకు ఆటోమేటిక్‌గా ఈడీఎల్ఐ బీమా వర్తిస్తుంది. ఉద్యోగి నుంచి అదనపు ప్రీమియం అవసరం లేదు. యజమాని వేతనంలో0.5బీమా నిధికి చెల్లిస్తారు. ఉద్యోగి మరణిస్తే నామినీలకు 2.5నుంచి 7లక్షల వరకుపరిహారం. క్లెయిమ్‌లను సాధ్యమైనంత త్వరగా, సాధారణంగా 20 రోజుల్లో పరిష్కరించేలా చర్యలుంటాయి.

# డివిడెండ్లు, బోనస్ షేర్లు బైబ్యాక్‌లపై ఇన్వెస్టర్ల దృష్టి

**ముంబయి, జూన్ 14:** పలు లిస్టెడ్ కంపెనీలు వచ్చేవారం కీలక కార్పొరేట్ చర్యలను చేపట్టనున్నాయి. డివిడెండ్ చెల్లింపులు, బోనస్ షేర్ల జారీ, షేర్ విభజన, షేర్ బైబ్యాక్‌లు వంటి చర్యల కోసం తేదీలు నిర్ణయించాయి. దీంతో ఆయా కంపెనీల షేర్లపై ఇన్వెస్టర్ల దృష్టి పెరిగింది. ఈనెల15న ఎస్ఎంసి గ్లోబల్‌సెక్యూరిటీస్ లిమిటెడ్ షేరు ఒక్కంటికి రూ.0.60తుది డివిడెండ్ కోసం ఎక్స్‌డివిడెండ్‌గా ట్రేడ్ కానుంది. 16న ఆర్ ఆర్ కేబుల్ లిమిటెడ్ షేరు ఒక్కంటికి 5.50 తుది డివిడెండ్ కోసం ఎక్స్‌డివిడెండ్‌గా మారనుంది. 18న క్యాపిటల్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఈముద్రా, జీహెచ్‌సీఎల్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, మోనికా ఆల్కోబెవ్, స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్, టాటా టెక్నాలజీస్, విమ్టా ల్యాబ్స్ కంపెనీలు ఎక్స్‌డివిడెండ్‌గా ట్రేడ్ కానున్నాయి. అలాగే 19నఅంబా ఎంటర్‌ప్రైజెస్, ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్, కరోనా రెమెడీస్, జీహెచ్‌సీఎల్ టెక్స్‌టైల్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, హిందుస్తాన్ ఇన్సులేటర్స్ అండ్ ఇండస్ట్రీస్, ఇండియామార్ట్ ఇంటరమేష్, పాలీక్యాబ్ ఇండియా, రాఘవ ప్రొడక్టివిటీ ఎన్‌హాన్సర్స్, సనోఫీకన్స్యూమర్ హెల్త్‌కేర్ ఇండియా, సాలిటైర్ మెషిన్ టూల్స్, టాటా కమ్యూనికేషన్స్, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్, టొరెంట్ పవర్ కంపెనీలు ఎక్స్ డివిడెండ్‌లోకి ప్రవేశించనున్నాయి. బోనస్ షేర్లుమినీ డైమండ్స్ ఇండియా లిమిటెడ్ 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను ప్రకటించింది. దీనికి రికార్డు తేదీ ఈనెల16గా నిర్ణయించారు.


# మొగవీరా కోఆపరేటివ్ బ్యాంక్‌పై ఆర్బీఐ ఆంక్షలు

## ఖాతాదారుల ఉపసంహారణకు లక్ష పరిమితి



**ముంబయి, జూన్ 14:** రాష్ట్రంలోని మొగవీరా కోఆపరేటివ్ బ్యాంక్ ఆర్థిక పరిస్థితి దిగజారడంతో భారతీయ రిజర్వ్ బ్యాంక్ పలు ఆంక్షలను విధించింది. బ్యాంకు ఖాతాదారులు తమ ఖాతాల నుంచి గరిష్టంగా లక్ష మాత్రమే ఉపసంహరించుకునేందుకు అనుమతించింది. ఈ ఆంక్షలు ఆరు నెలల పాటు కొనసాగనున్నాయని ఆర్బీఐ వెల్లడించింది.

ఆర్బీఐ ఆదేశాల ప్రకారం బ్యాంకు ఇకపై కొత్త రుణాలు మంజూరు చేయడం, ఇప్పటికే ఉన్న రుణాలను పునరుద్ధరించడం, పెట్టుబడులు పెట్టడం, నిధులు అప్పుగా తీసుకోవడం లేదా కొత్త డిపాజిట్లు స్వీకరించడం వంటి కార్యకలాపాలను నిర్వహించరాదు. బ్యాంకు ప్రస్తుత ద్రవ్య లభ్యత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రతి డిపాజిటర్ తన పొదుపు ఖాతా, కరెంట్ ఖాతా లేదా ఇతర ఖాతాల నుంచి గరిష్టంగా రూ.1 లక్ష వరకు మాత్రమే ఉపసంహరించుకునేందుకు అనుమతి ఇవ్వాలని బ్యాంకుకు ఆదేశించినట్లు ఆర్బీఐ తెలిపింది. బ్యాంకు పనితీరును మెరుగుపరచేందుకు ఆర్బీఐ గతంలో బోర్డు సభ్యులు, ఉన్నతాధికారులతో నిరంతరం చర్చలు జరిపిందని పేర్కొంది. అయితే పర్యవేక్షణలో గుర్తించిన సమస్యలను పరిష్కరించడంలో బ్యాంకు యాజమాన్యం తగిన చర్యలు తీసుకోకపోవడంతో పాటు డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడేందుకు స్పష్టమైన ప్రయత్నాలు చేయకపోవడంతో ఈ ఆంక్షలు విధించాల్సి వచ్చిందని వెల్లడించింది. ఈ ఆదేశాలను బ్యాంకు లైసెన్స్ రద్దుగా భావించరాదని ఆర్బీఐ స్పష్టం చేసింది. బ్యాంకు ఆర్థిక పరిస్థితి మెరుగుపడే వరకు విధించిన పరిమితుల పరిధిలోనే బ్యాంకింగ్ కార్యకలాపాలను కొనసాగించవచ్చని తెలిపింది. ఇకపై కూడా బ్యాంకు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తామని, డిపాజిటర్ల ప్రయోజనాల దృష్ట్యా మార్పులు లేదా అదనపు చర్యలు తీసుకుంటామని ఆర్బీఐ పేర్కొంది. డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) నిబంధనల ప్రకారం అర్హత కలిగిన డిపాజిటర్లు తమ డిపాజిట్లపై గరిష్టంగా రూ.5 లక్షల వరకు బీమా రక్షణ పొందే హక్కు కలిగి ఉంటారని ఆర్బీఐ వివరించింది.



## ట్రిలియనీర్‌గా మారినా..

# అతి చిన్న ఇంట్లోనే మస్క్

**టెక్సాస్, జూన్ 14:** లక్షకోట్ల సంపద మార్కును దాటిన ట్రిలియనీర్ ఎలాన్ మస్క్ వ్యక్తిగత జీవనశైలి అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అత్యంత నిరాడంబరంగా చిన్న ఇంట్లో ఇంట్లో నివసిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. స్పేస్‌ఎక్స్ ఐపీఓ ద్వారా సుమారు 75 బిలియన్ డాలర్ల నిధులను సమీకరించింది. ఒక్కో షేరును 135 డాలర్లకు విక్రయించడంతో, కంపెనీ మార్కెట్ విలువ ఏకంగా 1.77 ట్రిలియన్ డాలర్లకు చేరింది. ఆ తర్వాత రోజు ట్రేడింగ్‌లో షేరు విలువ దాదాపు 20 శాతం పెరిగి 162 డాలర్లకు చేరుకుంది. దీంతో స్పేస్‌ఎక్స్, టెస్లా కంపెనీలలో మస్క్‌కు ఉన్న వాటాలను కలుపుకుంటే, ఆయన నికర సంపద ట్రిలియన్ డాలర్ల మార్కును దాటింది. లక్షల కోట్ల సంపదకు అధిపతి అయినా, మస్క్ ప్రధాన నివాసం టెక్సాస్‌లోని బోకాచికాలో స్పేస్‌ఎక్స్ స్టార్‌బేస్ సమీపంలో ఉన్న ఒక చిన్న ప్రీఫ్యాబ్రికేటెడ్ ఇంట్లో నివసిస్తున్నారు. ఫార్చ్యూన్ మ్యాగజైన్ ప్రకారం ఈ ఇంటి విలువ 50వేల డాలర్లు మాత్రమే. 2020లో టెక్సాస్‌కు మారిన తర్వాత మస్క్ కాలిఫోర్నియాలోని తన విలాసవంతమైన ఆస్తులన్నింటినీ అమ్మేశారు. బాక్సబుల్‌అనే స్టార్టప్ నిర్మించిన ఈ ఇల్లు కేవలం 20x20 అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. ఇందులో ఒక లివింగ్ ఏరియా, బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్ మాత్రమే ఉంటాయి. మొత్తానికి మస్క్ జీవనశైలి అంతే ఆసక్తికరంగా మారింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.